

కరీంనగర్ వార్త

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

గురువారం 12, నవంబర్ 2026 16 పేజీలు



ఉద్యోగుల మధ్య సమన్వయ లోపం

ఇందిరమ్మ ఇల్లవి 1503, వ్యక్తిగత మరుగు దొడ్లు 105 బిల్లుల పెండింగ్

ప్రభుత్వాలు ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్లు ఉండాలని తప్పని సరిగా నిర్మించుకోవాలని పదేపదే తెలుపు తుండగా లబ్ధిదారులు ముందుకు వచ్చి వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోగ, సంబంధిత డాటా ఆన్ లైన్ చేయక, అధికారుల మధ్య సమన్వయ లోపంతో ఫైల్స్ జిల్లా కార్యాలయనికి వెళ్లకపోవడం లబ్ధిదా రులకు డబ్బులు రాకపో వడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకొని, మహిళలు పురు షులు చిన్నారులు బహి ర్భూమికి బయటకు వెళ్ళ వద్దని వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి 12 వేల రూపాయలు అందజేస్తున్నారు.

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త

2లో

మరుగుదొడ్ల డబ్బులకై ఎదురుచూపులు

లబ్ధిదారులు మరుగుదొడ్లు నిర్మించుకొని సంవత్సరాలు గడుస్తున్నా వైనం

కదలని వ్యక్తిగత మరుగుదొడ్ల ఫైల్స్ డాటా.. ఆన్లైన్ చేయని సంబంధిత అధికారులు

తప్పులకు తావులేకుండా

భూముల రీసర్వే

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశం

జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష



2లో

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త: రాష్ట్రంలో భూముల రీసర్వేను ప్రజలకు ప్రయోజనం చేకూరేలా నాణ్యతతో, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో తొందరపాటు కారణంగా తప్పులు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బుధవారం హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రీసర్వే పురోగతిని సమీక్షించారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుతో కలిసి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి పాల్గొన్నారు.



మరుగుదొడ్ల డబ్బులకై ఎదురుచూపులు

మొదటిపేజీ తరువాయి

అందులో కేంద్ర ప్రభుత్వం వాటా 60 శాతం కాగా రూ లు 7200, రాష్ట్ర ప్రభుత్వం వాటా 40 శాతం రూ లు 4800 అందజేస్తూ ఉంటారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రతి ఒక్కరి ఇంట్లో వ్యక్తిగత మరుగుదొడ్లు ఉండాలని ఇండ్లలోని చిన్నలు పెద్దలు, మహిళలు పురుషులు కాలకృత్యాలకు బయటకు వెళ్ళవద్దని. వ్యక్తిగతంగా మరుగుదొడ్లు లేని ఇళ్లను గుర్తించి వెంటనే ఆ ఇళ్లలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఆదేశాలు ఉన్నాయి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రతి ఒక్కరి ఇంట్లో వ్యక్తిగత మరుగుదొడ్లు ఉండాలని ఇండ్లలోని చిన్నలు పెద్దలు, మహిళలు పురుషులు కాలకృత్యాలకు బయటకు వెళ్ళవద్దని. వ్యక్తిగతంగా మరుగుదొడ్లు లేని ఇళ్లను గుర్తించి వెంటనే ఆ ఇళ్లలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఆదేశాలు ఉన్నాయి అందులో భాగంగానే గ్రామ కార్యదర్శులు మరుగుదొడ్లు లేని ఇళ్లను గుర్తించి వాటిని నిర్మించుకోవాలి అని ఇంటి యజమానులకు తెలిపి నిర్మించుకోవాలని ప్రోత్సహించాలి అందులో భాగంగానే తెల్ల రేషన్ కార్డు ఉన్న ఇంటి యజమానులు వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మాణానికి గ్రామంలోని కార్యదర్శి సర్పంచి అనుమతులు తీసుకొని నిర్మించుకుంటున్నారు. గ్రామ కార్యదర్శి వాటికీ సంబంధించిన మార్కెట్ ఇచ్చి, ముగ్గు పోసి బిస్మిత్ లెవెల్ మొదటి దాపా , మొత్తం మరుగుదొడ్డి పూర్తయినంక రెండవ దఫా ఆన్లైన్ చేసి సంబంధిత మండల ఎంపీడీవో కు రిపోర్ట్ ను అందజేయాల్సి ఉంటుంది, రిపోర్టు ఆన్లైన్ అనంతరం సంబంధించిన జిల్లా అధికారులకు అందజేయడం, కలెక్టర్ అనుమతితో ట్రెజరీకి లబ్ధిదారుల వివరాలు పంపించడంతో ట్రెజరీ నుండి లబ్ధిదారుని బ్యాంకు అకౌంట్లో 12 వేల రూపాయలు పడడం జరుగుతుంది. వ్యవహారం గ్రామ కార్యదర్శి తో పాటు మండల ఎంపీడీవో ప్రత్యేక చర్వతీసుకుని సంబంధిత లబ్ధిదారులకు సంబంధించిన వ్యక్తిగత మరుగుదొడ్డు ఫోటో మొత్తం ఆన్లైన్లో జయడంతో వారం రోజులలో సంబంధిత వ్యక్తిగత మరుగు దొడ్ల బిల్లులు లబ్ధిదారుని ఖాతాలో జమ అవుతాయి. కానీ కొన్ని గ్రామాలలో గ్రామ కార్యదర్శులు వ్యక్తిగత మరుగుదొడ్ల విషయాన్ని మరిచిపోయి నిర్మించుకుందామని ఇంటి యజమానులు తెలిపినప్పటికీ పట్టించుకోకపోవడం కొందరు కార్యదర్శులు నిర్మించుకున్న మరుగుదొడ్ల లబ్ధిదారుల డాటాను ఆన్లైన్లో ఎక్కించకపోవడం వారి వివరాలను ఎంపీడీవో ఆఫీసులో నమోదు చేయకపోవడం తదితర కారణాలతో అనేకమంది లబ్ధిదారులకు బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా మండల ఆఫీస్ లో మరుగుదొడ్ల డాటా ఆన్లైన్ చేయకపోవడం తో తీవ్ర ఆలస్యం జరగడం వలన మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు డబ్బుల కొరకు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికి జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి మరుగుదొడ్లు 2684సాంక్షన్ కాగా, పని పూర్తయి 1181 మంది లబ్ధిదారులకు డబ్బులు జమ కాగా, ఇంకా 1503 మంది లబ్ధిదారులకు డబ్బులు జమ కాకపోవడంతో వేచి చూస్తున్నారు. అలాగే జిల్లాలో 20 మండలాలలో వ్యక్తిగత మరుగుదొడ్ల పై 356 మంది కి సాంక్షన్ కాగా 251 మంది పూర్తయి డబ్బులు జమ కాదా, మిగతా 105 మంది లబ్ధిదారులకు డబ్బులు జమ కాకపోవడంతో వేచి చూస్తున్నారు. అంతేకాకుండా ఇంకా గ్రామాలలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవడానికి కార్యదర్శులు సరైన, ప్రచారాలు, సమాచారం ఇవ్వకపోవడంతో ఇంకా అనేక ఇళ్లలో మరుగుదొడ్లు లేకనే ఉన్నట్లు సమాచారం. అలాగే ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండేలా గ్రామ ల కార్యదర్శులు సర్పంచులు గ్రామాలలో పూర్తిగా పరిశీలించి, నిర్మించుకుంటే ఉచితంగా 12 వేల రూపాయలు ఇస్తారని సమాచారం అందజేయడంతో పాటు మరుగుదొడ్లు లేని ఇల్లు గుర్తించి వారిని వెంటనే నిర్మించుకోవాలని ప్రోత్సహించాల్సిన బాధ్యత ఎంతైనా ఉన్నది, అంతేకాకుండా అధికారుల మధ్య సమన్వయ లోపంతో మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు డబ్బులు పడకపోవడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే, కాగా ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామ కార్యదర్శిలు ఎన్ పి డి ఓ జిల్లా అధికారుల సమన్వయంతో మరుగుదొడ్ల సంబంధించిన ఫైల్స్ ఆన్లైన్ చేయడం ఎక్కడ పెండింగ్ లేకుండా చూడడం లబ్ధిదారులకు వెంటనే డబ్బులు అందజే చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఇప్పటికే వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించు కొని వారిని గుర్తించి వారికి పూర్తి సమాచారం అందజేసే మరుగుదొడ్లు నిర్మించుకునేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత ఎంతగానో ఉన్నది. సంబంధిత అధికారులు స్పందించి మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల వివరాలను ఆన్లైన్లో చేసి వెంటనే డబ్బులు అకౌంట్లో జమ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

మరుగుదొడ్ల బకాయిలు వెంటనే అంద చేయాలి.. విక్రమ్ రెడ్డి

వేముల యువజన సంఘాల, రాష్ట్ర రైతు నాయకులు ధర్మపురి..

జగిత్యాల జిల్లా లో వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకున్న వారికి అందాల్సిన ప్రభుత్వ ప్రోస్సహం ఏళ్లుగా అందక ఎదురుచూపులు చూస్తున్నాము. ఈ విషయం కార్యదర్శితో పాటు మండల అధికారికి ఎన్ని మార్లు విన్న మించిన స్పందించడం లేదని , జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు, అందాల్సిన12వేల రూపాయలకు ఎన్నో నిబంధనలు ఉన్నా స్నాక్షన్లకు ఏళ్ళు సాక్షన్ అయ్యాక బిల్లు అందడానికి ఏళ్ళు పట్టడం తో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నాము ఇప్పటికయినా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ చూపి సమస్య పరిష్కారం అయ్యేందుకు యుద్ద ప్రాతిపదిక స్పందించాలని లేని పక్షంలో తీవ్ర నిరసన కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు.

మరుగుదొడ్ల బిల్లుల విషయమై మా దగ్గర ఎలాంటి పెండింగులు లేవు : రఘు వరన్ డి ఆర్ డి ఓ పిడి



జగిత్యాల. జగిత్యాల జిల్లాలో వ్యక్తిగత మరుగు దొడ్లకు సంబంధించి మా దగ్గర ఎలాంటి బిల్లులు పెండింగ్ లో లేవని అన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల విషయంలో గ్రామ కార్యదర్శులు సాంక్షన్ చేసి సంబంధిత ఫైలు ఎంపీడీవోలకు అందజేసి ఆన్లైన్ చేసిన అనంతరం, మా కార్యాలయానికి అందజేసిన అనంతరం కలెక్టర్ అనుమతితో లబ్ధిదారుల వివరాలను ట్రెజర్ కి పంపిస్తామని ట్రెజరీ నుండి లబ్ధిదారుని అకౌంట్ లో 12 వేల రూపాయలు జమ కావడం జరుగుతుందని పేర్కొన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు గానీ, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించినవి కానీ మా కార్యాలయానికి వచ్చిన వెంటనే కలెక్టర్ అనుమతితో ట్రెజరీకి కి పంపించి వెంటనే లబ్ధిదారుని అకౌంట్లో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని మా దగ్గర ఎలాంటి ఇబ్బందులు పెండింగ్ లేవని పేర్కొన్నారు.

లాడ్జిల నిర్వహణపై కొరవడిన నిఘా ..

నిర్వహణలో లాలూచీ.....

గంటల లెక్కన గదుల కేటాయింపు ..

పూర్తి వివరాలు నమోదు చేస్తున్నారా? ..

పోలీస్ యంత్రాంగం దృష్టి సారించాలి

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త: కరీంనగర్ పట్టణం వ్యాపార, విద్యా, వైద్య రంగాల్లో అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో వివిధ పనుల నిమిత్తం నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు, వ్యాపారులు, ఉద్యోగులు, కుటుంబాలకు బస కల్పించే లాడ్జిలు నగరంలో కీలకంగా మారాయి. అతిథులకు వసతి కల్పించాల్సిన కొన్ని లాడ్జిల నిర్వహణలో నిబంధనలు ఎంతవరకు అమలవుతున్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

గంటల లెక్కన గదుల కేటాయింపు

కొన్ని లాడ్జ్ లలో గంటల ప్రాతిపదికన గదుల కేటాయింపు జరుగుతోందా? అలా జరుగుతున్న సందర్భాల్లో అతిథుల వివరాలు తప్పనిసరిగా నమోదు చేస్తున్నారా? గదిలోకి వెళ్లిన వ్యక్తుల వివరాలు, బయటకు వచ్చిన సమయాలు నమోదు చేస్తున్నారా? ముఖ్యంగా తక్కువ వ్యవధిలో పలువురు వ్యక్తులు ఒకే గదిని వినియోగించే పరిస్థితుల్లో ఒకవేళ నేరం జరిగితే, భద్రతా ప్రమాణాలు పాటించకపోతే, నేర పరిశోధనలో కీలకమైన ఆధారాలు లభించకుండా పోయే అవకాశం ఉంది.

పూర్తి వివరాలు నమోదు చేస్తున్నారా?

లాడ్జిలో గది తీసుకునే ప్రతి ఒక్కరి వివరాలు నమోదు చేయడం అత్యంత కీలకం. అతిథి పేరు, చిరునామా, ఫోన్ నంబర్, గుర్తింపు పత్రం, గదిలో బస చేస్తున్న వ్యక్తుల సంఖ్య, రాకపోకల సమయాలు వంటి వివరాలు సక్రమంగా నమోదు చేస్తున్నారా కొందరు అతిథుల వివరాలు రిజిస్టర్ లలో నమోదు చేయకుండానే గదులు కేటాయిస్తున్నారనే అనుమానాలు ఉంటే వాటిపై పోలీసులు తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

లాడ్జిల నిర్వహణపై కొరవడిన నిఘా

లాడ్జిల్లో ఎంట్రన్స్, రిసెప్షన్, పార్కింగ్ వంటి ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి పనితీరును పరిశీలించడం అత్యంత ముఖ్యం. కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ, అవి పనిచేస్తున్నాయా? అవసరమైన సమయంలో ఫుటేజీ అందుబాటులో ఉంటుందా? అనే అంశాలను అధికారులు పరిశీలించాల్సి ఉంది. ఏదైనా నేరం జరిగినప్పుడు నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాల ఫుటేజీ కీలక ఆధారంగా మారుతుంది. తనిఖీలు కేవలం పండుగలు, ప్రత్యేక సందర్భాలకే పరిమితం కాకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగితేనే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది.

పోలీస్ యంత్రాంగం దృష్టి సారించాలి

కరీంనగర్ నగరంలోని లాడ్జిల నిర్వహణపై సమగ్ర తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతి లాడ్జిలో అతిథుల వివరాల రికార్డులు, గుర్తింపు పత్రాలు, సీసీ కెమెరాలు, సిబ్బంది వివరాలు పరిశీలించాలి. నిబంధనలు పాటించని సంస్థలకు చట్టప్రకారం నోటీసులు జారీ చేసి, ఉల్లంఘనలు నిర్ధారణ ఐతే చర్యలు తీసుకోవాలి. లాడ్జిలను అనధికార కార్యకలాపాలకు వేదికగా మార్చకుండా యాజమాన్యాలకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలి. లాడ్జ్ లలో వసతి కల్పించడం వ్యాపారమే కావచ్చు, కానీ అతిథుల భద్రత, ప్రజల రక్షణ మాత్రం సామాజిక బాధ్యత. ఆ బాధ్యతను విస్మరిస్తే నేరాలు జరిగే అవకాశం కల్పించినట్లే. కరీంనగర్ లాడ్జిల నిర్వహణపై పోలీసుల ప్రత్యేక దృష్టి ఎప్పుడు? అన్నది ఇప్పుడు పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.



భూముల రీసర్వేలో తప్పులకు తావులేకుండా పారదర్శకత పాటించాలి

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశం

జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త: రాష్ట్రంలో భూముల రీసర్వేను ప్రజలకు ప్రయోజనం చేకూరేలా నాణ్యతతో, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో తొందరపాటు కారణంగా తప్పులు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బుధవారం హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రీసర్వే పురోగతిని సమీక్షించారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుతో కలిసి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూముల రీసర్వేపై ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించామని, ఉమ్మడి జిల్లాల్లో క్షేత్రస్థాయి పర్యటనలతో జిల్లా నుంచి మండల స్థాయి వరకు రెవెన్యూ అంశాలపై సమీక్షలు చేపట్టామని తెలిపారు. రీసర్వే ఫలితాల వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు గ్రౌండ్ రిపోర్టులు సేకరిస్తున్నామని, ఎదురవుతున్న సమస్యలు, లోపాలు, వాటి పరిష్కార మార్గాలను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. ఎస్ఓపీ అమలుపై దృష్టి: రీసర్వే కోసం రూపొందించిన ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ)ని కచ్చితంగా అమలు చేయాలని, క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా అవసరమైన మార్పులు చేపట్టాలని సూచించారు. ఉన్నతాధికారులను సంతృప్తిపరిచే నివేదికలకు బదులుగా వాస్తవ పరిస్థితులు ప్రతిబింబించేలా నివేదికలు రూపొందించాలని స్పష్టం చేశారు. నవంబర్ నెలాఖరులోగా ప్రతి జిల్లాలో తొలి విడతకు ఎంపిక చేసిన 70 గ్రామాలతో పాటు నక్షా లేని గ్రామాల్లో సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. అధికారులు బాధ్యతతో పనిచేస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని చెప్పారు. ప్రతి మండలంలో ప్రత్యేక సర్వే బృందాలను ఏర్పాటు చేసి, లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, పనుల వేగం పెంచేందుకు బృందాల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. వచ్చే ఏడాదిన్నరలో రాష్ట్రవ్యాప్తంగా 3 విడతల్లో రీసర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నందున కలెక్టర్లు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. రైతులకు ముందస్తు సమాచారం: సర్వే చేపట్టే గ్రామాల రైతులకు ముందుగానే నోటీసులు ఇచ్చి, వారి సమక్షంలోనే ప్రక్రియ నిర్వహించాలని సూచించారు. అభ్యంతరాలు ఎక్కడ, ఎలా సమర్పించాలి, వాటిని ఏ విధంగా పరిష్కరిస్తారనే విషయాలను ప్రజలకు వివరించాలని, అవసరమైన కౌన్సెలింగ్ నిర్వహించాలని తెలిపారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో దండోరా వేయించి వివరాలను తెలియజేయడంతో పాటు అభ్యంతరాలు స్వీకరించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. సర్వే పూర్తయిన ప్రాంతాల్లో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను క్యూఆర్ కోడ్‌తో అందించనున్న నేపథ్యంలో భూముల వివరాలు, రికార్డుల్లో కచ్చితత్వం ఉండేలా చూడాలన్నారు. అసైన్డ్ భూముల పరిశీలన: అసైన్డ్ భూముల పట్టాలు అసలైనవా, నకిలీవా అనేది క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, పట్టా పొందిన వ్యక్తులే ప్రస్తుతం భూమిని అనుభవిస్తున్నారా లేదా నిర్ధారించాలని సూచించారు. గతంలో ఒకరికి పట్టా ఇచ్చి ప్రస్తుతం మరొకరు భూమిని సాగు చేస్తున్నట్లయితే ప్రస్తుత అనుభవదారుడి అర్హతను నిబంధనల ప్రకారం పరిశీలించాలన్నారు. పట్టాలోని విస్తీర్ణానికి క్షేత్రస్థాయిలో ఉన్న భూమి విస్తీర్ణానికి మధ్య తేడాలుంటే గుర్తించాలని తెలిపారు. సాగునీటి చెరువులు, రహదారులు, కుంటలు, ఇతర అభివృద్ధి పనుల కోసం గతంలో సేకరించిన భూములకు సంబంధించిన సర్వే నంబర్ల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. ఎలాంటి అంశాలు పెండింగ్‌లో లేకుండా సమగ్రంగా పరిశీలించాలన్నారు. రీసర్వేలో అక్రమాలు, అవకతవకలకు పాల్పడే అధికారులపై సస్పెన్షన్‌తో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. భవిష్యత్తులో ప్రజలకు భూ వివాదాలు తలెత్తకుండా నాణ్యతతో, పారదర్శకంగా సర్వే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓలు గంగయ్య, సురేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పెద్దపల్లి ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా తిర్రి తిరుపతి గౌడ్ ఏకగ్రీవ ఎన్నిక

పెద్దపల్లి, ప్రభాతవార్త: పెద్దపల్లి ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా తిర్రి తిరుపతి గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో క్లబ్ కమిటీ సభ్యులు ఆయన పేరును ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రధాన కార్యదర్శి తిర్రి తిరుపతి గౌడ్‌కు పలువురు జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, ప్రెస్ క్లబ్ అభివృద్ధికి, పాత్రికేయుల సంక్షేమానికి, జర్నలిస్టుల ఐక్యతకు ఆయన కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులే కీలకం....

పెద్దపల్లి డీసీపీ బి. రామిరెడ్డి .. గర్రెపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు

సుల్తానాబాద్, ప్రభాతవార్త: మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పెద్దపల్లి డీసీపీ బి. రామిరెడ్డి విద్యార్థులకు సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సుల్తానాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం గర్రెపల్లి ఎస్వీఎస్ ఫంక్షన్ హాల్‌లో మోడల్ స్కూల్ విద్యార్థులకు మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన డీసీపీ బి. రామిరెడ్డి, ప్రవచనకర్త ఎస్పీ నాయక్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వినియోగం వల్ల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని తెలిపారు. విద్యార్థి దశ ఎంతో విలువైందని, ఈ సమయంలో చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి



సారించాలని సూచించారు. మంచి లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత స్థాయికి ఎదగాలని హితవు పలికారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పేర్కొన్నారు.సదస్సులో సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు, ఎస్ఐ చంద్రకుమార్, ఎలిగేడు ఎస్ఐ మధుకర్, కాశీరాంపూర్ ఎస్ఐ సుధాకర్, పోలీసు సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లాడ్జిలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

10 మంది అరెస్ట్.. రూ.1,36,130 నగదు, 10 సెల్‌ఫోన్ల స్వాధీనం

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త: గోదావరిఖని ఐ.బీ. కాలనీలోని వినాయక్ రెసిడెన్సీ లాడ్జిలో డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్న 10 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి అందిన నమ్మదగిన సమాచారం మేరకు పోలీస్ కమిషనర్ ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్/నార్కోటిక్ ఏసీపీ శ్రీనివాస్ రావు నేతృత్వంలో గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఎస్ ఐ దీకొండ రమేష్ సిబ్బందితో కలిసి సంయుక్తంగా దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు ముక్కలాట ఆడుతున్న 10 మందిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.1,36,130 నగదు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో ఎన్టీపీసీ సండే మార్కెట్‌కు చెందిన ఎస్.ఎం. ఖాన్, జంగాంకు చెందిన టి.నర్సింగరావు, పవర్‌హౌస్ కాలనీకి చెందిన పి.తిరుపతి, ప్రగతి నగర్‌కు చెందిన ఎం.కుమార్, రామగుండంకు



చెందిన కె. కిరణ్, బాపూజీనగర్‌కు చెందిన వి. సతీష్, గౌతమీనగర్‌కు చెందిన ప్రవీణ్, మార్కండేయ కాలనీకి చెందిన ఆర్. మణి, అదే కాలనీకి చెందిన ఎస్.కె. భాషి, తిలక్‌నగర్‌కు చెందిన కె. రాజ్‌కుమార్ ఉన్నారు. పట్టుబడిన వ్యక్తులతో పాటు స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు, ఇతర వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల కోసం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా పేకాట, జూదం నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



డెడ్‌లైన్‌ను దాటిన గూడ్స్ ఇంజిన్.. తృటిలో తప్పిన ప్రమాదం!

కూనారం రైల్వే గేట్ వద్ద షంటింగ్ ప్రక్రియలో ఘటన

హుటాహుటిన చేరుకున్న రైల్వే అధికారులు.. కారణాలపై విచారణ

పెద్దపల్లి, ప్రభాతవార్త: పెద్దపల్లి పట్టణంలోని కూనారం రైల్వే గేట్ సమీపంలో బుధవారం షంటింగ్ నిర్వహిస్తుండగా గూడ్స్ రైలు ఇంజిన్ నిర్ణీత పరిమితిని దాటి పట్టాల చివరి వరకు వెళ్లింది. ఈ అనూహ్య పరిణామంతో రైల్వే సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తినష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. షంటింగ్ సమయంలో అదుపుతప్పిన ఇంజిన్...రైళ్ల రాకపోకలకు అనుగుణంగా బోగీలను ఒక ట్రాక్ నుంచి మరో ట్రాక్‌కు మార్చే పనులు చేపడుతుంటారు. ఈ క్రమంలో కూనారం రైల్వే గేట్ వద్ద షంటింగ్ జరుగుతుండగా గూడ్స్ ఇంజిన్ నిర్ణీత హద్దును దాటి డెడ్‌లైన్ అవతలకు వెళ్లింది. దీంతో అక్కడ ఒక్కసారిగా కలకలం నెలకొంది.

వెంటనే స్పందించిన రైల్వే సిబ్బంది...



సమాచారం అందిన వెంటనే రైల్వే సాంకేతిక విభాగం సిబ్బంది, అధికారులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. పట్టాల పరిమితిని దాటిన ఇంజిన్‌ను తిరిగి ట్రాక్‌పైకి తీసుకొచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఈ ఘటనకు సిగ్నలింగ్ వ్యవస్థలో లోపం కారణమా, ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తిందా అనే అంశాలపై పరిశీలన ప్రారంభించారు. అధికారుల పర్యవేక్షణలో చర్యలు...సెక్షన్ ఇంజనీర్ కె. నారాయణ, జూనియర్ ఇంజనీర్ వివేక్ ఘటనా స్థలంలో పరిస్థితులను పర్యవేక్షించారు. ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోకపోవడంతో స్థానికులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.



డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి

విద్యార్థులకు పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి పిలుపు

ఓదెల,ప్రభాతవార్త: ఓదెల మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై యాంటీ డ్రగ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ ఎస్.పి. నాయక్ మహారాజ్ మాట్లాడుతూ యువత తమ శక్తిసామర్థ్యాలను సరైన మార్గంలో వినియోగించుకుని సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, సుల్తానాబాద్ సీఐ పి. రంజిత్ రావు, కాల్వ శ్రీరాంపూర్ ఎస్ఐ జి. సుధాకర్, పొత్కపల్లి ఎస్ఐ సనత్ కుమార్ పాల్గొని డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలను వివరించారు. సర్పంచులు కనికిరెడ్డి సతీష్,గుగులోత్ నిమ్మ,తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శిరీష,ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అమరేందర్, కేజీబీవీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థిని,విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

నేత్రదానంతో కంటి చూపు

ఓదెల,ప్రభాతవార్త: ఓదెల మండల కేంద్రా నికి చెందిన గడిగొప్పుల ఎల్లయ్య మరణా నంతరం ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానానికి ముందుకు వచ్చి మానవ త్వాన్ని చాటుకున్నారు. బండారి కుమార్, సింగనీ శంకరయ్య, మెరుగు సారంగం నేత్రదానంపై అవగాహన కల్పించడంతో కుటుంబ సభ్యులు అంగీకరించారు. దీంతో వాసన్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ చందు సహకారంతో ఎల్లయ్య కార్నియాలను సేకరించి సికింద్రాబాద్ ఐ బ్యాంకుకు పంపించారు. ఈ నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించే అవకాశం కలిగింది.ఈ సందర్భంగా ఎల్లయ్య భార్య రాజేశ్వరి, కుమారుడు సంతోష్, కోడలు కవిత, మనుమడు విశాల్, మనుమరాలు హాసినిలను సర్పంచ్ కనికిరెడ్డి సతీష్, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్‌తో పాటు సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, ప్రచార కార్యదర్శి వాసు, తదితరులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

నేరాలు-దారుణాలు



తాటి చెట్టు పై నుంచి పడి గీత కార్మికుడు మృతి



బోయిన్‌పల్లి, ప్రభాతవార్త: తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తూ జీవనం సాగిస్తున్న ఓ నిరుపేద గీత కార్మికుడు ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి కిందపడడంతో మృతి చెందాడు. ఈ విషాద ఘటన బోయిన్‌పల్లి మండలం మల్కాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. మల్కాపూర్‌కు చెందిన పల్లెర్ల నారాయణ తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడి పోయినట్లు గ్రామస్తులు తెలిపారు. తీవ్ర గాయాలతో కిందపడిన నారాయణను కుటుంబ సభ్యులు, స్థానికులు రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు తెలిసింది.నారాయణ తాటి చెట్లు ఎక్కి కల్లు గీస్తూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగించేవాడని గ్రామస్తులు తెలిపారు. రోజువారీ కూలీ పనులతో పాటు గీత వృత్తినే ఆధారంగా చేసుకుని కుటుంబాన్ని నెట్టుకొస్తున్న నారాయణ ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న నారాయణను కోల్పోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

గౌడ సంఘం నేతల సంతాపం

నారాయణ మృతిపై గ్రామస్తులు, గౌడ సంఘం నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గీత కార్మికులు నిత్యం ప్రాణాలను పణంగా పెట్టి వృత్తి కొనసాగిస్తున్నప్పటికీ వారి భద్రత, సంక్షేమంపై మరింత శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు. తాటి చెట్లు ఎక్కే సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో గీత కార్మికులకు ప్రభుత్వం మరింత భద్రత కల్పించాలని కోరారు.

ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి

నిరుపేద గౌడ కుటుంబానికి చెందిన పల్లెర్ల నారాయణ మృతితో ఆ కుటుంబం ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయిందని గ్రామస్తులు, గౌడ సంఘం నాయకులు పేర్కొన్నారు. కుటుంబ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడంతో పాటు బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలవాలని కోరారు. కుటుంబానికి జీవనాధారం కల్పించేలా తగిన సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

తల్లి దండ్రులను పోషించని కొడుకు పై ఫిర్యాదు

మల్యాల, ప్రభాతవార్త; మల్యాల మండలం రాజారం గ్రామానికి చెందిన భూర్గుపెల్లి సింగరయ్య (75) రత్నమ్మ(72) అనే అనారోగ్యం తో బాధపడుతున్న వృద్ధ తల్లి దండ్రులకు వారి కుమారుడు ఆంజనేయులు పోషణ, వైద్య ఖర్చులు పెట్టాలని అడుగుతుంటే కొడుతున్నాడని ఈ మేరకు జిల్లా కేంద్రం లోని సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ను ఆశ్రయించారు. దీంతో బుధవారం సీనియర్ సిటిజెన్స్ ప్రతినిధులతో వెళ్లి ఆర్డీవో కు ఫిర్యాదు చేయగా, వయో వృద్ధుల సంరక్షణ,, పోషణ చట్టం సెక్షన్ 24, సెక్షన్ 2(బి) కింద కొడుకుపై కేసు నమోదు చేశారు. అనంతరం సీనియర్ సిటిజెన్స్ జిల్లా కార్యాలయం లో వృద్ధ తల్లిదండ్రులు తన గోడును విలేకరులకు వివరించారు. అనారోగ్యంతో భాద పడుతున్న తమకు పోషణ, వైద్య ఖర్చులు పెట్టమని బ్రతిమిలాడితే కనికరం లేకుండా కొడుతున్నాడని, గ్రామ పెద్ద మనుషులకు చెప్పుకుంటే ప్రతి నెలా పోషణ, వైద్య ఖర్చులు ఇస్తానని ఒప్పుకున్న కూడా ఇవ్వక పోవడంతో పోషణ, వైద్యం కోసం పలు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పోషణ, వైద్య ఖర్చులకోసం తమ కొడుకు ఆంజనేయులు నుంచి ప్రతి నెలా రూ. 10 వేలయినా ఇప్పించాలని సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షులు, న్యాయవాది హరి అశోక్ కుమార్ సాయం తో ఆర్డీవో కు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారని, ఎస్పీ కి సైతం ఫిర్యాదు చేస్తామన్నారు.ఆ వృద్ధుల వెంట సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, చట్టం కాన్సిలియేషన్ అధికారులు పి. హన్మంత్ రెడ్డి, వెల్ముల ప్రకాష్ రావు తదితరులున్నారు.



మన ఊరి భూమి జోలికి వస్తే ఊరుకునేది లేదు

కోరుట్ల గడి బురుజు స్థలాన్ని కాపాడే వరకు నా పోరాటం ఆగదు

ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్..





కోరుట్ల, ప్రభాతవార్త : కోరుట్ల పట్టణ చారిత్రక గుర్తింపుగా నిలిచిన గడి బురుజు స్థలాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, మన ఊరి భూమి జోలికి వస్తే ఊరుకునేది లేదని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి గడిబురుజులను పరిరక్షించాలని కోరుతూ అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అక్కడి నుంచి సభాస్థలికి పాదయాత్రగా వచ్చి ఏర్పాటుచేసిన సమా వేశంలో ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ గడి బురుజు స్థలాన్ని కొంత మంది వ్యక్తులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారనే అంశంపై ఎమ్మెల్యే సంజయ్ స్పందిస్తూ, ప్రజల ఆస్తులను కాపాడటం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. గడి బురుజు స్థలానికి సంబం ధించిన వీఎల్టీ రద్దు అయ్యే వరకు తన పోరాటం ఆగదని స్పష్టం చేశారు.. ఈ వ్యవహారంలో తమ పార్టీకి చెందిన నాయకులు లేదా కార్యకర్తల ప్రమేయం ఉన్నా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పార్టీకి చెందిన వారైనా సరే, ప్రజా ఆస్తుల పరిరక్షణకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.. ప్రజలకు చెందాల్సిన ఆస్తుల విషయంలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా చూడాలని, గడి బురుజు స్థలాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలన్నారు. గడి బురుజు స్థల పరిరక్షణ కోసం చేపట్టిన పోరాటం ఇది కేవలం ఆరంభం మాత్రమేనని, ప్రజల ఆస్తులను కాపాడే విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల జేఏసీ నాయకులు, పలు కుల, యువజన సంఘాల నాయకులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు

కట్లకుంటలో బొంబాయి పోచమ్మ ఆలయ పునఃప్రారంభోత్సవం

ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు



మేడిపల్లి, ప్రభాతవార్త : మండలంలోని కట్లకుంట గ్రామంలో బొంబాయి పోచమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ ఈ వేడుకల్లో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై ఆలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించు కుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ప్రధాన అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. శ్రీపతి శ్రీనివాస్ సరిత పుణ్య దంపతుల సొంత ఖర్చులతో పునఃనిర్మాణ పనులను పూర్తి కావడంతో పలు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లోకల సుమలత రంజిత్, ఉపసర్పంచ్ జలందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి టీపీసీసీ గల్ఫ్ బోర్డు కన్వీనర్ సింగిరెడ్డి నరేష్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు, మాజీ జడ్పీటీసీ కుందారపు జలందర్, ఉమ్మడి మండల కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచులు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మౌలానా ఆజాద్ ఆశయాల సాధనే మనందరి లక్ష్యం కావాలి

కోరుట్ల, ప్రభాతవార్త :



భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో విశిష్ట స్థానం సంపాదించుకున్న మహనీయుడు, స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మోలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఆయన ఆశయాలను ఆచరణలోకి తీసుకురావడమే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని జగిత్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ మైనారిటీ విభాగం చైర్మన్ ఎం.ఏ. నయీమ్ పిలుపునిచ్చారు. అ ఖిల భారత కాంగ్రెస్ కమిటీ మైనారిటీ విభాగం జాతీయ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఇమ్రాన్ ప్రతాప్గఢీ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ మైనారిటీ చైర్మన్ ఎం.ఏ. నయీమ్ ఆధ్వర్యంలో పట్టణంలోని నౌనిహాల్ ఉర్దూ మీడియం హైస్కూల్ తో సహా పలు ప్రభుత్వ ప్రైమరీ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విజేతలకు మెమెంటోలు అందజేశారు.ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, కోరుట్ల మున్సిపల్ చైర్మన్ వసంత గంగాధర్, 21వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ షహనాజ్ రిజ్వానా, 2 వ వార్డు కౌన్సిలర్ హుమెరా వాసిద్, 17 వ వార్డు కౌన్సిలర్ సోగ్రా బీ, 18 వ వార్డు కౌన్సిలర్ అబ్దుల్ రహీం, 4వ వార్డు కౌన్సిలర్ తెడ్డు శిరీష విజయ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముజీబుర్ రహమాన్, మైనారిటీ నాయకులు రిహన్, ఫెరోజ్ యువకులు సాజిద్, సూఫియాన్, అజాన్ రజా, ముస్తాఖీమ్, అశ్రార్, ఆకిఫ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విద్యా దినోత్సవం

కోరుట్ల అర్బన్, ప్రభాతవార్త :



తెలంగాణ స్టేట్ మైనారిటీ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ కోరుట్ల డివిజన్ శాఖ తరపున జాతీయ విద్యా దినోత్సవం భారతరత్న మోలానా అబ్దుల్ కలాం ఆజాద్ గారి జన్మదిన సందర్భంగా గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ కోరుట్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ 14 సంవత్సరాలు నిండిన ప్రతి పిల్లవాడు విద్యనభ్యసించాలని, మనకు ఆర్ టి ఐ చెబుతుంది కానీ ఈ విషయాన్ని మనకు ఎప్పుడో మోలాన అబుల్ కలామ్ ఆజాద్ కలాం చెప్పారు అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గంగుల నరేష్, ఇన్చార్జి ప్రిన్సిపాల్ నటరాజ్, హెడ్మాస్టర్ అబ్దుల్ బారి , కోరుట్ల మున్సిపల్ వైస్ చైర్మన్ షాహిదుల్ ఆహద్, టీఎస్ మీసా స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఎండి ఫసీఉద్దీన్ షకీల్, టీఎస్ మీసా కోరుట్ల అధ్యక్షులు హమీదుల్లా ఖాన్, కార్యదర్శి ఆమీర్ సోహెల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

కోరుట్ల వార్త



సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు

కోరుట్ల టౌన్, ప్రభాతవార్త :



కోరుట్ల మున్సిపల్ కమీషనర్ రాఘవేంద్ర ఆదేశాల మేరకు కోరుట్ల పట్టణంలోని పలు కిరాణా,సూపర్ మార్కెట్ లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వారు వినియోగిస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ స్వాధీన పరుచుకొని, చెత్త బయట పడేసిన ఇంటి యజమానిపై రూ. 9వేల 5వందల జరిమానాలు విధించారు. ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చెయ్యని దుకాణా దారులకు ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ రాఘవేంద్ర అన్నారు. మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను పూర్తిస్థాయిలో నిషేదించాలని, లేనియెడల భారీ జరిమానాలు విధించడంతో పాటు దుకాణాలు సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్, జవాన్లు నవీన్, చంద్ర ప్రకాష్, జగ్గల్ల రమేష్, రాజు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

భీమారం ఎంపీడీఓగా వేముల విజయలక్ష్మి బాధ్యతల స్వీకరణ

భీమారం, ప్రభాతవార్త:



భీమారం మండల నూతన ఎంపీడీఓగా శ్రీమతి వేముల విజయ లక్ష్మి బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యా లయంలో ఆమె అధికారికంగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు చేరేలా కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. గ్రామపంచాయతీల అభివృద్ధి, పారిశుద్ధం, మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని తెలిపారు. నూతన ఎంపీడీఓకు మండల అధికారులు, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్యను కలసిన మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అడువాల జ్యోతి

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:

జగిత్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గాజంగి నందయ్యను జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అడువాల జ్యోతి లక్ష్మణ్ మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయన్ను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, మహిళా కాంగ్రెస్ అభివృద్ధికి పరస్పర సహకారంతో ముందుకు సాగాలని వారు చర్చించారు.పార్టీ నాయకులు,కార్యకర్తల సమన్వయంతో ప్రజలకు మరింత చేరువగా పనిచేస్తామని,పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని అడువాల జ్యోతి లక్ష్మణ్ ఈ సందర్భంగా తెలిపారు.

రాష్ట్రస్థాయి షార్ట్ ఫిల్మ్ పోటీల్లో భరోసాకు తృతీయ స్థానం

రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా చేతుల మీదుగా దర్శకుడు నాగరాజుకు సన్మానం



పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త: తెలంగాణ పోలీస్ శాఖ నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆన్‌లైన్ షార్ట్ ఫిల్మ్ పోటీల్లో రామగుండం పోలీస్ కమిషనరేట్ తరఫున పంపిన 'భరోసా' చిత్రం తృతీయ స్థానం సాధించింది. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం, పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా నిర్వహించిన ఈ పోటీల్లో రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్ పర్యవేక్షణలో ఈ చిత్రాన్ని ఎంపిక చేసి పంపించారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం నర్వ గ్రామానికి చెందిన నిప్పొత్తుల నాగరాజు దర్శకత్వం వహించిన ఈ చిత్రం విజయం సాధించడంపై బుధవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ అంబర్ కిషోర్ ఝా, ఐపీఎస్ హర్షం వ్యక్తం చేశారు. దర్శకుడు నాగరాజును శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల రక్షణే లక్ష్యంగా పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తోందని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకం, భరోసా పెంచేలా షార్ట్ ఫిల్మ్‌లు రూపొందించాలని సూచించారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించేలా నాణ్యమైన చిత్రాలను ప్రొఫెషనల్ స్థాయిలో రూపొందించాలని కోరారు. సృజనాత్మకతతో పాటు సామాజిక బాధ్యతను ప్రతిబింబించే చిత్రాలు సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడతాయని పేర్కొంటూ, భవిష్యత్తులోనూ ప్రజలకు ఉపయోగపడే సందేశాత్మక చిత్రాలు రూపొందించి పోలీస్ శాఖకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని నాగరాజును అభినందించారు. కార్యక్రమంలో ఎన్ ఐ బీ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రజా పాలనకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరిక

ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు

కాంగ్రెస్‌లో మాజీ ఉప సర్పంచ్, వార్డు సభ్యుల చేరిక పలు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



పెద్దపల్లి, ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజా పాలనకు ఆకర్షితులై పలువురు ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తెలిపారు. పెద్దపల్లి మండలం పెద్దబొంకూరు గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ కల్వల సంపత్, వార్డు సభ్యులు కల్వల శ్రీలత రామరాజు, రాజేశం గౌడ్, మిట్టపల్లి మహేశ్వరి రాజేశంతో పాటు కల్వల లచ్చయ్య, కల్వల సదానందం, తగరం జయరాజు, కల్వల రాజేశం, తగరం కోటేశ్, తగరం కమల్, తగరం వంశీ, కల్వల సంపత్, కల్వల విఘ్నేష్, కల్వల శ్రీనివాస్ బీఆరఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. వీరికి ప్రభుత్వ విప్ విజయరమణ రావు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పెద్దపల్లి మండలంలోని బొంపల్లి, మెరపల్లి, కాసులపల్లి, పాలితం, గోపయ్యపల్లి, కాపులపల్లి, కనగర్తి గ్రామాల్లో సింగిల్ విండో, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గి, ఎండ తీవ్రత పెరిగి సాగునీటి కొరత ఏర్పడే పరిస్థితులు ఉన్నందున రైతులు సాధారణంగా సాగు చేసే వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రకృతి విపత్తు కాగా, దానిని ఆసరాగా చేసుకుని ప్రతిపక్షాలు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ విపత్తు విషయంలో ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్, డైరెక్టర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పెద్దబొంకూరు నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి

ఓదెల,ప్రభాతవార్త: ఎల్నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటి వనరుల పరిరక్షణ, నీటి పొదుపు చర్యలపై ఓదెల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అనిల్ రెడ్డి అధ్యక్షతన సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామాల్లో తాగునీటి వృథాను అరికట్టడం, పైపులైన్ లీకేజీలను వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టడం, అవసరమైన చోట కొత్త పైపులైన్లు ఏర్పాటు చేయడం, మరమ్మతులకు గురైన వాటర్ ట్యాంకులను బాగు చేయడం వంటి అంశాలపై చర్చించారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇన్‌ట్రా డీఈ సతీష్, గ్రిడ్ డీఈ అనిల్, ఏఈలు సూర్యతేజ, శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించి, మనోధైర్యం నింపిన మాజీ ఎమ్మెల్యే దాసరి.

ఓదెల,ప్రభాతవార్త: ఓదెల మండలం మడక, గుంపుల గ్రామాల్లో బాధిత కుటుంబాలను పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పరామర్శించి, వారికి మనోధైర్యం కల్పించారు. మడక గ్రామంలో ఆవుల రాజయ్య వార్షిక కార్యక్రమానికి హాజరైన దాసరి మనోహర్ రెడ్డి, రాజయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గుంపుల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ సర్పంచ్ ఉప్పుల సంపత్ కుమార్ తండ్రి ఉప్పుల మల్లేశం చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆవుల రవీందర్, ఉప్పుల సంపత్ కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కష్టకాలంలో అధైర్యపడవద్దని, బాధిత కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని దాసరి మనోహర్ రెడ్డి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్, రౌతు జలపతి, మారెల్లి రవీందర్, గ్రామ అధ్యక్షులు గొర్ల కుమార్, గంధం శ్రీనివాస్, గ్రామ యువజన అధ్యక్షుడు తాళ్లపల్లి ప్రశాంత్ గౌడ్, నోముల ఇంద్రారెడ్డి, మర్రి కుమార్, సదారెడ్డి, ఐలయ్య, కేశవరెడ్డి, నీలకంఠ చారి, సత్యనారాయణ రెడ్డి, రమేష్, తుడి సంపత్, మొగిలి, రాసాల అశోక్, ఇట్టెం శ్రీనివాస్, పండ్రాజుల సదానందం, తిప్పరపు శ్రీనివాస్, కొసన సదయ్య, ఆగయ్య, గణేష్, సంపత్, బుచ్చయ్య, సదయ్య, అనిల్, నరేష్, ఉప్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ పర్సన్ ఇంచార్జిగా డీ ప్రకాష్

కాల్వశ్రీరాంపూర్. ప్రభాతవార్త : వ్యవసాయ మార్కెట్ పర్సన్ ఇన్చార్జిగా సిద్దిపేట అసిస్టెంట్ మార్కెటింగ్ డైరెక్టర్ డి. ప్రకాష్ పదవి బాధ్యతలు చేపట్టినట్లు డి ఎం ఓ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ గత నెల 28 తేదీన ముగియడంతో ప్రభుత్వం డి. ప్రకాశం ను కాల్వ శ్రీరాంపూర్ వ్యవసాయ మార్కెట్ పర్సన్ ఇన్చార్జిగా నియమించడం జరిగింది అన్నారు. వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ వచ్చే వరకు ప్రకాష్ పర్సన్ ఇంచార్జిగా కొనసాగనున్నారు.

కన్నుమూసినా.. ఇద్దరి కళ్లలో వెలుగులు..



గోదావరిఖని, ప్రభాతవార్త:పుట్టెడు దుఃఖంలోనూ మానవత్వాన్ని చాటుకున్న కుటుంబం మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపింది. ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన గోదావరిఖని తిలక్‌నగర్‌కు చెందిన మేడి శైలజ (40) నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు.ఈ నెల 9న దీపావళి నోముల సందర్భంగా కరీంనగర్‌లోని తల్లి ఇంటికి వెళ్లిన శైలజ ప్రమాదవశాత్తు కిందపడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయినప్పటికీ, ఆమె మరణం మరో ఇద్దరికి చూపునివ్వాలనే ఆలోచనతో నేత్రదానానికి అంగీకరించారు. కరీంనగర్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ సతీష్‌కుమార్ శైలజ కార్నియాలను సేకరించారు. అనంతరం హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు అనుబంధంగా ఉన్న రామాయమ్మ ఇంటర్నేషనల్ ఐ బ్యాంక్‌కు తరలించారు. దీంతో శైలజ నేత్రాలు మరో ఇద్దరికి చూపునిచ్చే అవకాశం కలిగింది.కుటుంబ సభ్యుల నిర్ణయాన్ని సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, కార్యదర్శి లింగమూర్తి అభినందించారు. నేత్రదానానికి అంగీకరించిన భర్త రాజేశం, కుమారుడు అమృతసాయి, కుమార్తె విజ్ఞప్రీతిక, తల్లిదండ్రులు వీరమ్మ, లచ్చయ్య, సోదరుడు శ్రీధర్‌ను ప్రశంసించారు.ఫౌండేషన్ ప్రతినిధులు సానా రామకృష్ణారెడ్డి, నూక రమేష్, లగిశెట్టి చంద్రమోళి, భీష్మాచారి, వెల్దీ కవిత, అనంతరాములు, కే.ఎస్.వాసు, రాంరెడ్డి, లక్ష్మీనారాయణ, రామన్న, అన్నపూర్ణ, శశికళ, జ్యోతి, గోలివాడ చంద్రకళతో పాటు రెడ్ డ్రాగన్ కరాటే ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకుడు మొండయ్య కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు.



యాసంగిలో ఆరుతడి పంటల సాగుతో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవాలి : పెద్దపల్లి ఏడీఏ శ్రీనాథ్

పెద్దపల్లి, ప్రభాతవార్త: యాసంగి సీజన్‌లో నీటి లభ్యత తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేసి ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవాలని పెద్దపల్లి ఏడీఏ శ్రీనాథ్ రైతులకు సూచించారు. బుధవారం పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ సోమకుమార్ అధ్యక్షతన ఎల్‌నినో ప్రభావం, యాసంగి పంటల సాగు, పంటల మార్పిడి, పంట అవశేషాలను తగలబెట్టడం వల్ల కలిగే నష్టాలు, కేతి బచావో అభియాన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీనాథ్, మండల వ్యవసాయ అధికారి డి. నాగార్జున, ఏఈఓ పూర్ణచందర్, హెచఈఓ రాము రైతులకు పలు అంశాలపై వివరించారు. పొలాల్లో పంట అవశేషాలను తగలబెట్టడం వల్ల పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు నశించి నేల ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. నేల సంరక్షణ, సుస్థిర వ్యవసాయం, సమతుల్య ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విచక్షణారహితంగా రసాయన ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల భూసారం తగ్గడంతోపాటు మానవాళికి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వివరించారు. పంటల సాగులో తగిన పద్ధతులు పాటిస్తూ నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె. సంతోష్ రెడ్డి, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మోలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

చొప్పదండి,ప్రభాతవార్త: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆర్నకొండ లో స్వాతంత్ర సమరయోధుడు మోలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు దీక్షితుల శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేయడమైనది. ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు మోలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తదుపరి ప్రధాన ఉపాధ్యాయులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మోలానా అబుల్ కలాం ఆజాద్ విద్యారంగానికి చేసిన సేవలను గుర్తు చేస్తూ, వారు భారతదేశమునకు స్వాతంత్రం వచ్చిన తరువాత భారతదేశం నకు మొదటి కేంద్ర మానవ వనరుల (విద్యాశాఖ) మంత్రిగా తను చనిపోయేంతవరకు విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన కాలంలో విద్యా రంగానికి , బడుగు బలహీన వర్గాల, స్త్రీల విద్య కోసం, అదేవిధంగ దేశంలో ఉన్నత విద్యా ప్రమాణాలను పెంచడానికి ఆయన ఆధ్వర్యంలోనే యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఖరగ్‌పూర్), ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలు ఏర్పాటయ్యాయి. తన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయన జన్మదినం నవంబర్ 11ను పురస్కరించుకొని 2008 సంవత్సరం నుండి జాతీయ విద్య దినోత్సవంగా, రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ వెల్ఫేర్ దినోత్సవంగా పేర్కొనడం జరిగింది. విద్యా రంగానికి, దేశానికి ఆయన చేసిన నిరుపమాన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 1992లో ఆయనకు మరణానంతరం దేశ అత్యున్నత పౌర పురస్కారం ఖిభారత రత్నఖి ప్రకటించింది. విద్యార్థులు అందరూ బాగా చదువుకోవాలని, పేదరికం రూపుమాపటానికి చదువు ఒక్కటే మార్గమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కానిగంటి రాజమోళి, గంగాధర్, వెంకటేశ్వరరావు, శ్రీకాంత్, ప్రార్థన, ఉమాదేవి, అనిత, లక్ష్మి ,చంద్రశే ఖర్, కిషన్, మీనాక్షి, విద్యార్థులు పాల్గొన్నారు.

పలువురు మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే డా. సంజయ్ పరామర్శ

మల్లాపూర్ ప్రభాతవార్త:

మల్లాపూర్ మండలంలోని రాఘవపేట గ్రామంలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన సొన్న శ్రీనివాస్, మద్దెల రాజం, ఆలకుంట ముత్తన్న, బాధనకుర్తి రాజన్న కుటుంబాలను కోరుట్ల శాసనసభ్యులు డా. కల్వకుంట్ల సంజయ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబాల సభ్యులను ఆప్యాయంగా పలకరించి, వారి కుటుంబాల్లో చోటుచేసుకున్న విషాదం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల చిత్రపటాలకు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆప్తులను కోల్పోయిన బాధ వర్ణనాతీతమని, ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని మనోధైర్యం కల్పించారు. రాఘవపేట గ్రామంతో తనకున్న అనుబంధాన్ని చాటుకుంటూ, గ్రామ ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ తోడుగా ఉంటానని ఎమ్మెల్యే సంజయ్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోట శ్రీనివాస్, ఉప సర్పంచ్ మద్దెల



నర్సయ్య, వార్డు సభ్యులు దాసరి భారతి మనోజ్, చిట్యాల సుశీల నర్సయ్య, ఇడగొట్టి లక్ష్మయ్య, మాధం సాగర్, గురిజెల మాధురి రమేష్, బీఆర్ఎస్వీ నాయకులు భైరి రవికుమార్ యాదవ్, మాజీ మార్కెట్ డైరెక్టర్ భైరి రాకేష్ యాదవ్, నాయకులు ద్యావతి వెంకట్, శ్రీరాముల సురేష్, బండి కమలాకర్, మద్దెల స్వామి, ఆలకుంట శేఖర్, మైలారపు భూమన్న, మద్దెల రాజేష్ తదితరులు, మృతుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు చేపట్టాలి

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన తహశీల్దార్ వరప్రసాద్

ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త:

ఇబ్రహీంపట్నం మండలంలోని యామపూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో వేములకుర్తి, యామపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం తహశీల్దార్ వరప్రసాద్, సహకార సంఘం చైర్మన్ అంకతి రాజన్న స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో కలిసి ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వరప్రసాద్ మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. రైతులు ధాన్యాన్ని నాణ్యతా



ప్రమాణాలకు అనుగుణంగా ఆరబెట్టి, తేమ శాతం నిబంధనలను పాటిస్తూ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కొనుగోళ్లలో జాప్యం జరగకుండా, రైతులు రోజుల తరబడి కేంద్రాల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు కనుక నాగేష్, తరి రామానుజం, ఏఓ అకు రాజ్ కుమార్, సహకార సంఘం వైస్ చైర్మన్ ఆరె గంగారెడ్డి, ఏఈఓ రవళి, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎడపల్లి మురళి, ఆయా గ్రామాల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సేవల్లో న్యాయవాదులు భాగస్వాములు అవ్వాలి

సీనియర్ సివిల్ జడ్జి ఆర్. అజయ్ కుమార్

మెట్ పల్లి టౌన్, ప్రభాతవార్త:

మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత న్యాయసేవల్లో న్యాయవాదులు భాగస్వాములు అవ్వాలని మెట్ పల్లి సీనియర్ సివిల్ జడ్జి ఆర్. అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా బుధవారం బార్ అసోసియేషన్ గదిలో న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉచిత న్యాయసేవాల కోసం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే విజ్ఞాన సదస్సులకు మరియు వివిధ సేవా కార్యక్రమాలకి న్యాయవాదులు స్వచ్ఛందంగా సహకరించాలని విజ్ఞప్తి చేసారు. సామాజికంగా ప్రజలు ఎదుర్కొనే అనేక రకాల న్యాయ సేవలు అందించేందుకు మెట్ పల్లి కోర్టు కాంప్లెక్స్ లో మండల లీగల్ సర్వీసెస్ సిబ్బంది సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఆర్థికంగా న్యాయ సేవలు పొందలేనివారికి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు, ప్రభుత్వ వసతి గృహాల్ని ఆకస్మిక తనిఖీ చేసి, విద్యార్థుల సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. పత్రికా



కథనాల ఆధారంగా కూడా అధికారులపై సుమోటా గా కూడా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వినుకొండ మాధవి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దయ్య రాజారాం, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రాంరెడ్డి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెర్లపల్లి ఆనంద్ గౌడ్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ అబ్దుల్ హఫీజ్, లోక్ అదాలత్ మెంబర్లు వడ్డేపల్లి శ్రీనివాసన్, జేడి సుధాకర్, మీడియాషన్ కో ఆర్డినేటర్లు ఒజ్జెల శ్రీనివాస్, బక్కూరి రమేష్, తునికి వేణు గోపాల్, పసునూరి శ్రీనివాస్, పారా లీగల్ కౌన్సిల్స్ పుప్పాల భానుమూర్తి, ఎలాల మధుసూదన్ రెడ్డి, నేరెళ్ల శ్రీధర్, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వైద్య విద్యకు ఎంపికైన విద్యార్థినికి ఘన సన్మానం

మెట్‌పల్లి రూరల్,ప్రభాతవార్త:



వైద్య విద్య కు ఎంపికైన మండలంలోని వేంపేట గ్రామానికి చెందిన సుద్దాల ఇషిత ను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వేంపేట గ్రామంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా అల్లూరి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థిని ఇషిత భవిష్యత్తులో ఉన్నత విద్య అభ్యాసం చేసి గ్రామానికి మంచి పేరు తీసుకరావాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కొమ్ముల రాజేశ్వర్ రెడ్డి,ఏఎంసి డైరెక్టర్ పల్లి శేఖర్ గౌడ్,విద్యార్థిని తండ్రి సుద్దాల శ్రీధర్,నాయకులు పుల్ల శేఖర్ గౌడ్,రాజు,ఇప్ప జలంధర్,నల్ల నరేందర్ రెడ్డి,భూమయ్య,మ్యాదరి రమేష్,తదితరులు పాల్గొన్నారు.

అంబటి తిరుపతి రాజును పరామర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

మానకొండూర్, ప్రభాతవార్త



: మానకొండూరు మండలం గంగిపల్లి గ్రామానికి చెందిన బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు అంబటి తిరుపతి రాజు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు అయ్యాయి. బుధవారం కేంద్ర హోం శాఖ సహాయక మంత్రి బండి సంజయ్ కుమార్ గంగిపల్లి గ్రామానికి చేరుకొని అంబటి తిరుపతి రాజును పరామర్శించారు . ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వాల ప్రదీప్ రావు, కరీంనగర్ కార్పొరేటర్ పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకట్ రెడ్డి, రంగు భాస్కరాచారి, మాజీ ఎంపీటీసీ నాగయ్య, నాయకులు రావుల శ్రీనివాస్, రంగు శ్రీనివాస్, దేవేందర్, రావుల వెంకట రాజ్యం, ములకల శ్రీనివాస్, పిట్టల ఆంజనేయులు, ఎనగందుల సంపత్,కాట సంపత్, కాట శంకర్ మండల నాయకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి వార్త



అభివృద్ధి పనులకై కృషి చేస్తాఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్.



మెట్‌పల్లి రూరల్,ప్రభాతవార్త:

నియోజకవర్గంలో ప్రజా అవసరాలైన అభివృద్ధి పనుల కోసం అహర్నిశలు కృషి చేస్తానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మండలంలోని సత్తక్కపల్లి గ్రామంలో రూ. 12 లక్షలతో నూతనంగా నిర్మించబోయే అంగన్వాడీ భవన నిర్మాణానికి, చెర్ల కొండాపూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో రూ. 5లక్షలతో నిర్మించనున్న కిచెన్ షెడ్ నిర్మాణానికి కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ బుధవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో లేకున్నా అభివృద్ధి పనులకు నిధుల మంజూరు కోసం పార్టీల కతీతంగా పాటుపడతానని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ లు బాస లాస్య ఆనంద్, మిట్టపెల్లి మహేందర్ రెడ్డి, నాయకులు ఆరేళ్ళ రాజగౌడ్, కాట శ్రీధర్, పడిగెల రవి, రాజశేఖర్, సుద్దాల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బిఫార్మసీలో గోల్డ్ మెడల్ సాధించిన మెట్ పల్లి విద్యార్థి

మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త:



మెట్ పల్లి పట్టణానికి చెందిన మహ్మద్ ఇమ్రాన్ బ్యాచిలర్ ఆఫ్ ఫార్మసీ (బి.ఫార్మసీ)లో ప్రథమ శ్రేణితో ఉత్తీర్ణత సాధించి యూనివర్సిటీ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించాడు. మెట్ పల్లి పట్టణంకు చెందిన మహ్మద్ ఇమ్రాన్ హైదరాబాద్ జేయన్టీయూ సాంకేతిక విశ్వవిద్యాలయం ఇటీవల నిర్వహించిన పరీక్ష లో ఉత్తీర్ణత సాధించి గోల్డ్ మెడల్ సొంతం చేసుకున్నాడు. మహ్మద్ ఇమ్రాన్ యూనివర్సిటీ చివరి ఫలితాలలో గోల్డెమెడల్ సాధించడం పట్ల మెట్ పల్లి కి చెందిన విద్యావంతులు, మేధావులు హర్షం వ్యక్తం చేసి ఇమ్రాన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి తదుపరి ఉన్నత విద్య కోసం ఫార్మ్‌డీ లో ఉచిత సీటు పొందాడు. ఫార్మాసి విద్యలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి భవిష్యత్తులో సమాజానికి సేవ చేయాలని ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు ఆకాంక్షి ంచారు.

తహసీల్దార్ కు సన్మానం

మెట్‌పల్లి రూరల్,ప్రభాతవార్త:



మెటుపల్లి నూతన తహసీల్దార్ గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ముక్తార్ పాషా ను మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షులు పసుల సుమన్ బుధవారం శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమంలో జిపివో రాజేశం, ఉప సర్పంచ్ కసాడి తిరుపతి, గ్రామస్తులు చౌటుపల్లి మల్లేష్, తుమ్మల రాజారెడ్డి, కాటిపెల్లి ప్రదీప్ రెడ్డి, తిపిరెడ్డి జీవన్ రెడ్డి, నేరెళ్ల ప్రభాకర్, తుమ్మల రాజారెడ్డి, కుంట బాలరాజ్, ఏలేటి లింగారెడ్డి, కుంట సాయిరెడ్డి, బండ బాలరాజు, బద్దం లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రం లో యూనిఫామ్‌ల పంపిణీ

ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త



జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని ఫకీర్ కోండపుర్ గ్రామం లో అంగన్వాడి కేంద్రంలో విద్యార్థులకు గ్రామ సర్పంచ్ తోట రమేష్ పాఠశాల యూనిఫామ్‌లను బుధవారం పంపిణీ చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ రోదసి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక, ఉపాధ్యాయులు ప్రసాద్, నవీన్, రశ్మిత, సైనిక, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ సింగని మారుతి, గంగారం తదితరులు పాల్గొన్నారు.

మహా పాదయాత్రను విజయవంతం చేయాలి

ఇల్లంతకుంట, ప్రభాతవార్త

కరీంనగర్‌లో ఈ నెల 18న ప్రారంభం కానున్న మహా పాదయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్శెట్టి సంపత్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.బుధవారం ఇల్లంతకుంట మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు భూమల్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.ఈ నెల 18న ప్రారంభమయ్యే మహా పాదయాత్రకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు.ప్రతిపక్షాలు ప్రజాస్వామ్య, రాజ్యాంగ విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు.ఇలాంటి రాజ్యాంగ విరుద్ధ శక్తులను ఎదుర్కొనేందుకు యువత పెద్దఎత్తున ముందుకు రావాలని కోరారు.ప్రధాని నరేంద్ర మోదీకి మద్దతుగా పార్టీ నిర్వహించే మహా పాదయాత్రలో కార్యకర్తలు,యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ



సమావేశంలో జిల్లా నాయకులు దేశెట్టి శ్రీనివాస్,కొలనూరు ముత్తవ్వ,మామిడి హరీష్,అసెంబ్లీ కోకన్వీనర్ బత్తిని స్వామి,మాజీ మండల అధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్,మండల ప్రధాన కార్యదర్శి కరికె నవీన్ కుమార్,ఉపాధ్యక్షుడు దూది సుధీర్,కార్యదర్శి ఇట్టిరెడ్డి లక్ష్మారెడ్డి,కోశాధికారి పిల్లి గోపాల్,నాయకులు ఓరెం భార్గవ్ రెడ్డి,దాసరి శ్రీనివాస్,దండవేణి రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే ప్రణాళిక ప్రకారం అభ్యసించాలి

ఆదర్శమూర్తులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలి
జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :



విద్యార్థి ప్రగతికి చదువే ఆధారంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. మోలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని 20 పాఠశాలల్లో హెచ్ డీ ఎఫ్ సీ బ్యాంక్ ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద (సీఎస్ఆర్) ఇటీవల స్మార్ట్ క్లాస్ రూమ్ లు ఏర్పాటు చేయగా , సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ ఎం పీ హెచ్ ఎస్ లో ఏర్పాటు చేసిన స్మార్ట్ క్లాస్ రూమ్ ను ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ బుధవారం హాజరై ప్రారంభించారు. జిల్లాలోని 20 పాఠశాలల్లో ఆయా పాఠశాలల్లో ఒక గదికి రంగులు వేసి నాలుగు ఫ్యాన్లు, లైట్లు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్, 10 డెస్క్ లు, యూపీఎస్ లు కూడా ఏర్పాటు చేశారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ వ్యక్తి వికాసం, అభివృద్ధికి చదువు ఒక ఆయుధంగా ఉపయోగ పడుతుందని వివరించారు. ఎందరో ఆదర్శ వ్యక్తులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదిగారని గుర్తు చేశారు. బీఆర్ అంబేద్కర్, మోలానా అబుల్ కలాం ఆజాద్, ఏపీజే అబ్దుల్ కలాం వారి విద్యాభ్యాస కాలంలో ఎన్నో కష్టాలు పడి ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేశారని, దేశ నిర్మాణంలో విశేష సేవలు అందించారని కొనియాడారు. అలాగే ఇన్ఫోసిస్ చైర్మన్ నారాయణమూర్తి భార్య సుధా మూర్తి విద్యాభ్యాసం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆదర్శమూర్తుల ఉన్నతమైన విలువలు, దేశానికి, సమాజానికి అందించిన సేవలను ప్రతి విద్యార్థి స్ఫూర్తిదాయకంగా తీసుకొని ప్రణాళిక ప్రకారం చదవాలని పిలుపునిచ్చారు . ప్రతి విద్యార్థి తాము పుట్టిన ప్రాంతం, మాట్లాడే భాష, ఆర్థిక పరిస్థితి, కుటుంబ నేపథ్యం ఏవీ కూడా ఉన్నత విద్యాభ్యాసానికి అడ్డు రావని, ప్రతిభ చూపేందుకు అడ్డంకులు కావని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి అన్ని పాఠ్యాంశాలపై పట్టు సాధించి మంచిగా చదివి తాము అనుకున్న ఉన్నత ఉద్యోగాలు, స్వయం ఉపాధి, వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షి ంచారు. విద్యార్థితో మార్పు సాధ్యమని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ, శ్రద్ధతో సౌకర్యాలు

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక చొరవ, శ్రద్ధతో జిల్లాలోని ప్రభుత్వ విద్యా సంస్థలు, హాస్పిటల్ లలో సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయి. పలు బ్యాంకుల ఆధ్వర్యంలో సీ ఎస్ ఆర్ కింద వసతులు కల్పిస్తున్నారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో సీ ఎస్ ఆర్ కింద 22 లక్షల రూపాయలతో విద్యార్థుల సౌకర్యార్థం 145 బెడ్స్, పరుపులు ఏర్పాటు చేయించారు. హెచ్ డీ ఎఫ్ సీ బ్యాంక్ ఆధ్వర్యంలో కోటి రూపాయలతో స్మార్ట్ క్లాస్ రూమ్ లు ఏర్పాటు చేయించారు. త్వరలో జిల్లాలోని పలు ఆసుపత్రులు, అంగన్వాడీల్లో సీ ఎస్ ఆర్ కింద వసతుల కల్పన పనులు మొదలు కానున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి విజయ్ సాగర్, తహసీల్దార్ మహేశ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజీవ్ కుమార్, హెచ్ డీ ఎఫ్ సీ బాధ్యులు శ్రావణ్ కుమార్, నాగేశ్వరరావు, కమలాకర్, మండల విద్యాధికారి దూస రఘుపతి, కాంప్లెక్స్ హెచ్ ఎం మోతిలాల్, ఏఏపీసీ ఛైర్ పర్సన్ తిప్పవరం సుధ, హెచ్ఎం చక్రవర్తుల రమాదేవి, వార్డు కౌన్సిలర్ లింగంపల్లి భాగ్యలక్షి ్మ, దొంతినేని కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

యువత తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఇల్లంతకుంట, ప్రభాతవార్త

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తెలంగాణ రక్షణ సేన మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమల్ల చైతన్య పిలుపునిచ్చారు.మండల కేంద్రంలోని వైశ్యభవన్‌లో పార్టీ మండల అధ్యక్షుడు వొళ్ళాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కవితక్క ప్రవేశపెట్టిన పంచజన్య సూత్రాలు,ప్రజా సంక్షేమ విధానాలకు ఆకర్షితులై యువత పెద్ద ఎత్తున పార్టీలో చేరాలని కోరారు.రైతుల ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని,ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మండలానికి ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని విమర్శించారు.తెలంగాణ ప్రజలకు ఉచిత విద్య,వైద్యం అందించడమే తమ పార్టీ లక్ష ్యమని,రాబోయే రోజుల్లో కవితక్కను ముఖ్యమంత్రిగా చూడటమే తమ ఆకాంక్ష అని తెలిపారు.ఈ సమావేశంలో మండల కార్యదర్శి దాసరి కిషోర్,మైనారిటీ అధ్యక్షుడు ఎండీ సమద్,తూర్పాటి రవీందర్,తాళ్లపల్లి సాహిల్ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్ల వార్త



మోలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :



స్వాతంత్ర సమర యోధుడు, భారతదేశ తొలి విద్యా శాఖ మంత్రి మోలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను బుధవారం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మోలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్!! హాజరై పూల మాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో, దేశ విద్యా వ్యవస్థ నిర్మాణంలో మోలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ శాఖ అధికారి, ఇంచార్జి మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి జయశ్రీ, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

ప్రమాద బాధితుడికి ఆర్థిక చేయూత

ముస్తాబాద్ ప్రభాత వార్త:



ఇటీవలే అవునూర్ గ్రామానికి చెందిన వేముల నారాయణ గౌడ్ ఇటీవలే ప్రమాదవశాత్తు తాటిచెట్టు మీద నుండి పడి కరీంనగర్ లో చికిత్స పొందుతూండగా అతనిది నిరుపేద కుటుంబం కావడంతో దాతల సాహాయం కోరగా ఆసుపత్రి చికిత్స నిమిత్తం గూడెం హై స్కూల్ బ్యాచ్ 1975 కి చెందిన అతని స్నేహితులు 32500 రూపాయలను బుధవారం అందించారు.ఇంకా దాతలు ఎవరైనా ముందుకు వచ్చి ఆదుకోవాలని నక్కదాసరి రవి,నక్కల రాజు అన్నారు. .

న్యాయం చేయండి అని అడిగితే అక్రమ అరెస్టులు అన్యాయం

నవంబర్ 11, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్

:న్యాయం చేయండి అని అడిగితే అక్రమ అరెస్టులు చేయడం అన్యాయమని ప్రభుత్వం మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. కాజీపేట వైఎస్సార్ నగర్ గుడిసెవాసులకు పట్టాలు ఇవ్వాలని అడిగినందుకు బీఆర్ఎస్ నాయకులు, గుడిసెవాసులను అర్ధరాత్రి అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణం. కాజీపేటలోని వైఎస్సార్ నగర్‌లో దశాబ్దాలుగా నివసిస్తున్న నిరుపేద గుడిసెవాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేసినందుకు అరెస్ట్ చేయడాన్ని ప్రభుత్వ దాస్యం వినయ్ భాస్కర్ తీవ్రంగా ఖండించారు.

చర్లపల్లి గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్

జిల్లాలోనే తొలి మ్యాజిక్ డ్రెయిన్ శంకుస్థాపన

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:

జగిత్యాల మండలం రూరల్ చర్లపల్లి గ్రామంలో స్థానిక శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా 25 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించి,పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు.అనంతరం జిల్లాలోనే మొట్టమొదటిసారిగా 3.50 లక్షల నిధులతో చేపట్టిన మ్యాజిక్ డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేశారు.అలాగే గ్రామంలో మున్నూరు కాపు,రెడ్డి కుల సంఘాల భవనాల నిర్మాణానికి కేటాయించిన 5 లక్షల చొప్పున నిధులతో పనులకు భూమిపూజ నిర్వహించారు.అనంతరం గ్రామానికి చెందిన దీటి లావణ్య-రాజయ్య,గడ్డం అంజయ్య-ఈశ్వరి దంపతుల ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని నూతన గృహాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు చీరలు కానుకగా అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ,గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధం మెరుగుపరిచి ఆరోగ్యకరమైన వాతావరణం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.జిల్లాలోనే తొలి మ్యాజిక్ డ్రెయిన్ పనులకు



చర్లపల్లి గ్రామంలో శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందన్నారు.మోలిక సదుపాయాల కల్పనతో పాటు పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం ద్వారా వారి ముఖాల్లో ఆనందం చూస్తున్నామని,తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేడిపల్లి వనిత ఆనందరెడ్డి,డిసిసి అధ్యక్షులు గజంగి నందయ్య,ఎఎంసి చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, ఎంపిపి రమాదేవి,ఎమ్మార్వో హకీమ్,ఎంపిఓ రవి బాబు,డిఈ మిలింద్,సర్పంచుల ఫోరం నాయకులు బొలిశెట్టి గంగారెడ్డి,కట్ట రాజేందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బాల ముకుందం, నాయకులు,,గ్రామస్తులు పాల్గొన్నారు.

చల్గల్ మార్కెట్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభం

ఎమ్మెల్యే సంజయ్ కుమార్

దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు పిలుపు



జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో జగిత్యాల మండలం రూరల్ చల్గల్ వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా,సజావుగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మార్కెట్‌లో బియ్యం బ్లాక్ మార్కెట్‌ను అధికారులు కఠినంగా అరికట్టాలని,ధరల కృత్రిమ పెంపుపై ప్రభుత్వం ఇప్పటికే పలు ఆంక్షలు విధించిందని జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఒక్క గుంట పొలం కూడా ఎండిపోకుండా రైతులకు ఉచిత విద్యుత్, సాగునీరు అందించామని,రైతు సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు.చల్గల్ మార్కెట్‌లో రైతుల సౌకర్యార్థం లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో 8 కోట్ల వ్యయంతో షెడ్ల నిర్మాణం,1.80 కోట్లతో సీసీ రోడ్డు పనులు చేపట్టినట్లు వెల్లడించారు.ఎల్ నీన్యో ప్రభావం ఉన్న నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటలు పండించే దిశగా ఆలోచన చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రసూనాంబ,పీఏసీఎస్ చైర్మన్ కొలుగూరి దామోదర్ రావు,డిసిసి అధ్యక్షులు గాజంగి నందయ్య,ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి,డీసీఓ మనోజ్,డిసిఎస్ఓ జితేందర్ రెడ్డి,ఎమ్మార్వో హకీం,ఏఎంసీ వైస్ చైర్మన్ అబ్బూరి మల్లేశం గౌడ్,మాజీ జెడ్పీటీసీ పెండెం రాములు,నాయకులు బాలముకుందం, సమిండ్ల శ్రీనివాస్,సర్పంచుల ఫోరం అధ్యక్షులు బొలిశెట్టి గంగారెడ్డి, కట్ట రాజేందర్,సర్పంచులు జున్ను రాజేందర్, మల్లారెడ్డి, మల్లేష్, ఏవో తిరుపతి నాయక్,సీఈఓ వేణు,పీఏసీఎస్ ఏఎంసీ డైరెక్టర్లు, యూత్ నాయకులు,స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు,రైతులు పాల్గొన్నారు.

జగిత్యాల వార్త

దేశంలో విద్యాభివృద్ధికి పునాదులు వేసిన మహనీయుడు మోలానా అబుల్ కలాం ఆజాద్

మోలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలకు హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాం



జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: స్వతంత్ర భారతదేశంలో విద్యాభివృద్ధికి విశేష కృషి చేసి, గుణాత్మక విద్యకు పునాదులు వేసిన తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి, భారతరత్న మోలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ పేర్కొన్నారు. బుధవారం మోలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్లో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ మాట్లాడుతూ జన్మదినమైన నవంబర్ 11న దేశవ్యాప్తంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తారని అన్నారు.స్వాతంత్రం అనంతరం తొలి కేంద్ర ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆజాద్ సుమారు 11 సంవత్సరాల పాటు దేశ విద్యారంగ అభివృద్ధికి కృషి చేశారు. సమగ్ర విద్యావిధాన రూపకల్పనకు పునాదులు వేయడంతో పాటు ప్రాథమిక, ఉన్నత, సెకండరీ విద్యాభివృద్ధికి ప్రత్యేక కమిషన్లను ఏర్పాటు చేశారు.విద్యా రంగంలో ఉన్నత ప్రమాణాల సాధనకు యూజీసీ వంటి ప్రతిష్టాత్మక సంస్థల ఏర్పాటుకు కృషి చేసి, సాంకేతిక విద్యాభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చారు. భారతీయ సంస్కృతి, కళలు, సంగీతం, సాహిత్య పరిరక్షణకు విశేష సేవలందించారు. విద్య ద్వారానే వ్యక్తి, సమాజం, దేశం అభివృద్ధి చెందుతాయని చాటిచెప్పిన ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని నాణ్యమైన విద్యను అందరికీ చేరువ చేయాలని ఈ సందర్భంగా స్మరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ మరియు జిల్లా రెవెన్యూ అధికారి కె. వై ప్రసాద్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కిషన్, కలెక్టరేట్ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ సభ జాతీయ మహాసభలకు తరలిరండి

సిపిఎం పార్టీ జిల్లా నాయకులు



జగిత్యాల టౌన్,ప్రభాత వార్త: జగిత్యాల జిల్లా కేంద్రంలోని సిపిఎం పార్టీ జిల్లా కార్యాలయంలో అఖిలభారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభల వాల్ పోస్టర్ ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నాయకులు మాట్లాడుతూ ఈనెల నల్గొండ జిల్లా కేంద్రంలో 15 నుండి 18 వరకు జరిగే అఖిల భారత కిసాన్ సభలను విజయవంతం చేయవలసిందిగా రైతులను, రైతు కార్మికులకు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి తీరని అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జాతీయ నాయకులు పార్టీ శ్రేణులకు ఈనెల 15న నల్లగొండ పట్టణంలో జరిగే బహిరంగ సభలో దిశా నిర్దేశం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా నాయకులు భూతం సారంగపాణి, న్యాయవాది ఉమా మహేష్, సుజాత, వినోద్, అమితేష్, అక్షయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఎన్ఎస్ఎస్ శిబిరంలో మద్యపానం, గంజాయి వినియోగంపై అవగాహన

కొడిమ్యాల, ప్రభాతవార్త: గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల కొడిమ్యాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శీతకాల ప్రత్యేక శిబిరం ఆరవ రోజు ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలతో కొనసాగింది. ఇందులో భాగంగా మద్యపానం, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై వాలంటీర్లు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని వివిధ వీధుల్లో పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి మత్తు పదార్థాల వినియోగం వల్ల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కొంటాయని ప్రజలకు వివరించారు. మద్యపానం, గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్లకార్డుల ప్రదర్శన ద్వారా సందేశాన్ని అందించారు. అనంతరం నిర్వహించిన సామాజిక విలువలు వ్యక్తిత్వ వికాసం కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ పి. గోపాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాలు విద్యార్థుల్లో సేవాభావాన్ని, సామాజిక బాధ్యతను పెంపొందించడంతో పాటు గ్రామాభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. వాలంటీర్లు గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినంద నీయమన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఇంపాక్ట్ మెంబర్ అంకశాల సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మంచి విలువలు,



క్రమశిక్షణ, సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కేవలం చదువుకే పరిమితం కాకుండా సమాజంలో జరిగే పరిణామాలపై అవగాహన పెంచుకుని, సామాజిక సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రత్యేకంగా అభినందించారు. మరో అతిథిగా పాల్గొన్న కొడిమ్యాల ప్రభుత్వ పాఠశాల పీడీ బూట్ల రాజమల్లయ్య వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు. వస్తువులు, సేవల కొనుగోలులో వినియోగదారులు ఏ విధంగా మోసాలకు గురవుతున్నారు, నాణ్యత, ధర, బిల్లుల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, తమ హక్కులను ఎలా కాపాడుకోవాలి అనే అంశాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బండ్ల భాస్కర్, అధ్యాపకులు చిట్టె నర్సయ్య, తిరుపతి, సుమన్ పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ కార్యాలయంలో ఘనంగా మోలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

కరీంనగర్, ప్రభాతవార్త

:భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు మోలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. బుధవారం కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, పలువురు కార్పొరేటర్లు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. స్వతంత్ర భారతదేశ నిర్మాణంలో, విద్యా వ్యవస్థ పునాదులు బలోపేతం చేయడంలో మోలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశ సమైక్యతకు, లౌకిక విలువలకు ఆయన నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రతి



ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశంలో ఆధునిక విద్యాసంస్థల ఏర్పాటుకు ఆజాద్ వేసిన పునాదులే నేటి విద్యాభివృద్ధికి మూలస్తంభాలని తెలిపారు. దేశ విభజనను వ్యతిరేకించి.... దేశ భక్తిని చాటి....దేశ అభివృద్ధికి కృషి చేసిన గొప్ప నాయకులని కొనియాడారు. నేటితరం ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని... భవిష్యత్తు తరానికి అబుల్ కలాం సేవలను చాటి చెప్పాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నగరపాలక సంస్థ కార్పోరేటర్లు, అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ పాఠశాలలో ఘనంగా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

కొత్తపల్లి ప్రభాతవార్త

భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో మోలానా అబుల్ కలాం ఆజాద్ పాత్ర చాలా విశిష్టమైనదని స్ఫూర్తి దాయకమనీ అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో వారి జయంతిని పురస్కరించుకుని నిర్వహించినటువంటి ప్రత్యేక వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి వారు చేసిన సేవలను స్మరించుకున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత అబుల్ కలాం ఆజాద్ నుండి స్ఫూర్తి తీసుకోవాలని . నేడు భారతదేశ విద్యా రంగంలో అగ్రగామిగా ఉండడానికి ప్రధాన కారణం వారేనని అదే విధంగా సాంస్కృతిక రంగంలో సైతం భారతదేశ విజయాలు సాధిస్తున్నదంటే వారి కృషి మాత్రమేనని సగర్వంగా చెప్పవచ్చని అన్నారు భారతదేశంలో ప్రతిష్టాత్మక విద్యాసంస్థలను నెలకొల్పి విద్యార్థులకు చేయూతనిచ్చిన గొప్ప నేత అహింస మార్గాన్ని అనుసరించి స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని దేశానికి స్వాతంత్రం అందించిన నేతల్లో వారొకరిని



గుర్తు చేశారు అనేక సంస్కరణలను ప్రవేశపెట్టి భారతదేశం యొక్క కీర్తి పతాకాన్ని రెపరెపలాడించారని అభివర్ణిస్తూ వారు చేసిన సేవలు చారిత్రాత్మకమని చరిత్ర పుటల్లో ఉండిపోతాయని వారు అభివర్ణించారు. ఏమి ఆశించకుండా దేశ సేవనే పరమావధిగా భావించి భారతదేశానికి నూతన చరిత్రను లిఖింప చేసినటువంటి గొప్ప రాజనీతిజ్ఞుడు రాజకీయ నాయకుడు స్వాతంత్ర సమరయోధుడు అని కొనియాడారు ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

విద్యారంగంలో మోలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం

కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్,ప్రభాతవార్త

:భారత దేశ తొలి విద్యా శాఖ మంత్రి, స్వాతంత్ర సమరయోధుడు మోలానా అబుల్ కలాం ఆజాద్ విద్యారంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని పాత కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భారత తొలి విద్యాశాఖ మంత్రి మోలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతి పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ , అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, డీఆర్ఓ స్వామి, మైనారిటీ సంక్షేమ అధికారి జలాలుద్దీన్ అక్బర్, డీఈఓ తిరుపతిరావు, వివిధ శాఖల అధికారులు, మైనారిటీ నాయకులు, వివిధ పార్టీల నాయకులు అబుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. విద్యతో ప్రజలు చైతన్యవంతం కావడంతో పాటు సమాజ ప్రగతి, దేశ అభివృద్ధి , సమానత్వం సాధ్యమని నమ్మి.. దేశంలో విద్యావ్యాప్తికి బలమైన పునాదులు వేసిన మహనీయుడు మోలానా అబుల్ కలాం ఆజాద్ అని అన్నారు. విద్యాభివృద్ధికి, లౌకిక వాదానికి, జాతీయ



సమైక్యతకు ఆయన ఎంతో కృషి చేశారన్నారు. అబుల్ కలాం ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్య అందేలా అందరం కృషి చేద్దామన్నారు.మహనీయుల గొప్పతనం తెలిసేలా వారి జయంతి సందర్భంగా పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామని మైనారిటీ నాయకులకు సూచించారు.అనంతరం మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల పాఠశాలల్లో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించగా.. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ అధికారి అనిల్ ప్రకాష్, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు కాళీ చరణ్, మాధవి, యమున, తాజుద్దీన్, కార్పొరేటర్లు మహ్మద్ యూసుఫ్, హుంస, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మత్తును తరిమేద్దాం.. బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దాం

!చర్లబూత్కూర్‌లో పోలీసుల విస్తృత తనిఖీలు.. కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన

కరీంనగర్ రూరల్ ,ప్రభాతవార్త



కరీంనగర్ రూరల్: యువత మత్తు పదార్థాలు, ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ఏసీపీ ఎ. విజయ్ కుమార్, ఇన్స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి సూచించారు.కరీంనగర్ రూరల్ మండలం చర్లబూత్కూర్ గ్రామంలో బుధవారం తెల్లవారుజామున 4 నుంచి ఉదయం 7 గంటల వరకు పోలీసులు విస్తృత తనిఖీలు



నిర్వహించారు. సుమారు 100 మోటార్ సైకిళ్లను తనిఖీ చేసి వాహన పత్రాలను పరిశీలించారు.అనంతరం నిర్వహించిన కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తన, మొబైల్ వినియోగంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏసీపీ విజయ్ కుమార్, ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి, ఎస్సైలు, పోలీసు సిబ్బంది, గ్రామ సర్పంచ్ నరేష్ రెడ్డి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువత, గ్రామస్థులు పాల్గొన్నారు.

కరీంనగర్ వార్త

రైతులకు అండగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్: ప్రభాతవార్త :



రైతులకు అండగా నిలుస్తూ, వారు పండించిన వరి ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం గ్రామ గ్రామాన చర్యలు తీసుకుంటోందని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.మానకొండూర్ మండలంలోని ఊటూరు (లక్ష్మీ శ్మపూర్), పచ్చునూర్, దేవంపల్లి గ్రామాల్లోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కవ్వంపల్లి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు ఆరు గాలం పాటు కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి వారి చేతుల్లో మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్ద ధర లభిస్తుందన్నారు. ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే రైతు ఖాతాలోకి డబ్బులు జమయితాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఊటూరు, దేవంపల్లి, మానకొండూర్ పీఏసీఎస్ చైర్మన్లు ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, రొంటాల లక్ష్మారెడ్డి, నాగిశెట్టి రాజయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేవెల్లి రాజలింగం, వైస్ చైర్మన్ రేమిడి శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్లు బొంగోని కనకయ్య, వరహాలచారి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, పార్టీ నాయకులు మర్రి ఓదెలు యాదవ్, రామిడి తిరుమల్ రెడ్డి, సర్పంచులు బుర్ర శ్రీధర్, ఎడ్ల సత్యనారాయణ, మండల నాయకులు అశోక్, తమిశెట్టి రాజేష్, అంజిరెడ్డి, గుడాల మహేందర్, రాపాక రాజేశ్వర్, మండల సంపత్ రెడ్డి, మండల బక్కారెడ్డి, బుర్ర శ్రీధర్, దాసరి శ్రీనివాస్, గుడాల శ్రీనివాస్ గౌడ్, కాల్వ దనేందర్, జీడి శ్యాంసుందర్, గాడిచర్ల కొమురయ్య, వరహాల చారి, వంతడుపుల శంకర్, అనిల్, ఊటూరు సీఈవో మిట్టపల్లి రవీందర్, దేవంపల్లి సీఈవో కసిరెడ్డి మల్లికార్జున్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 18న, బీజేపీ మహా పాదయాత్రకు తరలి రండి

.బిజెపి మండల అధ్యక్షుడు కంది రాజిరెడ్డి

మానకొండూర్, ప్రభాతవార్త



: కేంద్ర హోం శాఖ సహాయక మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహించనున్న మహా పాదయాత్రకు అధిక సంఖ్యలో తరలివచ్చి, విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కంది రాజిరెడ్డి బుధవారం పిలుపునిచ్చారు. బుధవారం మానకొండూరు మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ పార్టీ మండల సన్నాహక సమావేశం బీజేపీ మండల అధ్యక్షుడు కంది రాజిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కంది రాజిరెడ్డి మాట్లాడుతూ.. మండలం నుండి భారీ సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి యాత్రను విజయవంతం చేయాలని కోరారు. జన సమీకరణ, రవాణా ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో సెంట్రల్ ఫిలిం బోర్డ్ మెంబర్ రాపాక ప్రవీణ్, శంషాబాద్ ఉప సర్పంచ్ డొల్ల సతీష్, మండల ప్రధాన కార్యదర్శులు భాషబోయిన ప్రదీప్ యాదవ్, శీలం కుమార్, నాయకులు సొన్నకుల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు పోచంపల్లి శ్రీనివాస్, మీస రమణయ్య, కార్యదర్శులు కోల శ్రీనివాస్, రావుల తిరుపతి, ఆరపెల్లి సునంద్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు అడప రవి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల

.కె.వి.నారాయణరెడ్డి సేవలు చిరస్మరణీయం

ప్రొఫెసర్ నన్న రామస్వామి

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త



కె.వి.నారాయణ రెడ్డి సేవలు చిరస్మరణీయమని జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షులు ప్రొఫెసర్ నన్న రామస్వామి అన్నారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల వ్యవస్థాపకులు కె.వి. నారాయణ రెడ్డి విగ్రహాన్ని పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షులు చేతుల మీదగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే ఒక గొప్ప లక్ష్యంతో 1965 సంవత్సరంలో కె.వి నారాయణ రెడ్డి జమ్మికుంటలో ఆదర్శ కళాశాల పేరు మీదగా కళాశాలను స్థాపించారన్నారు. జమ్మికుంటలో కళాశాలను ఏర్పాటు చేయడం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరంగా మారిందన్నారు. నాటి నుండి నేటి వరకు వేలల్లో విద్యార్థులు చదువుకొని ఉన్నతస్థాయికి ఎదిగారన్నారు. అలాంటి గొప్ప నాయకుడు ఈ కళాశాలను స్థాపించడం ఈ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. రమేష్ , పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు మీర్ అహ్మద్ హుస్సేన్, మొలుగూరి సదయ్య, మైస మహేందర్, అన్వర్ బాబు, డా. కె. రాజేంద్రం, బచ్చు భాస్కర్, శివకుమార్, ఆకుల రాజేందర్, టి. రాజ్ కుమార్, జగదీశ్వర్, సయ్యద్ సజ్జు, ప్రసాద్, సుధాకర్, సాయికుమార్, అరుణ్ రాజ్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహా పాదయాత్రను విజయవంతం చేయండి.

. బీజేపీ మండల అధ్యక్షుడు రమణారెడ్డి

ఇల్లందకుంట, ప్రభాతవార్త:



ఓటరు సమగ్ర సవరణ జాబితా (ఎస్ ఐ ఆర్)పై కాంగ్రెస్‌తో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని బీజేపీ బైరెడ్డి రమణారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షులు బైరెడ్డి రమణారెడ్డి అధ్యక్షతన బీజేపీ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా కార్యదర్శి సంపెల్లి సంపత్ రావ్ మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్ విషయంలో కాంగ్రెస్ పార్టీ అనవసర రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. దశాబ్దాల పాటు దేశాన్ని ఏలిన కాంగ్రెస్ పార్టీ, బీజేపీని రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేక విదేశీ శక్తులతో చేతులు కలిపి పనికిమాలిన రాజకీయాలు చేస్తోందని సంపత్ రావ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా ప్రజా విశ్వాసాన్ని కోల్పోయి తుడుచి పెట్టుకుపోయిన కాంగ్రెస్, దిక్కుతోచని స్థితిలోనే బీజేపీపై చిల్లర రాజకీయాలతో బురదజల్లే కుట్రలు చేస్తోందన్నారు. దేశంలో అశాంతిని రేకెత్తించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు చూస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ చేస్తున్న కుట్రలకు బుద్ధి చెప్పేందుకే ప్రజలు, యువత భాగస్వామ్యంతో కరీంనగర్‌లో ఈ మహా పాదయాత్రను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని, పార్టీ శ్రేణులంతా కష్టపడి కార్యక్రమాన్ని గ్రాండ్ సక్సెస్ చేయాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి పడరాని పాట్లు పడుతుందని మండల అధ్యక్షులు బైరెడ్డి రమణారెడ్డి ఎద్దేవా చేశారు .దేశంలో ప్రజా విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ కి మనుగడ కష్టంగా మారిందని, అందుకే ప్రజల దృష్టిని మరలించడానికి రకరకాల డ్రామాలు ఆడుతోందన్నారు. కాంగ్రెస్ పనికిమాలిన రాజకీయాలు ప్రజలు గ్రహిస్తున్నారని, రాబోయే కాలంలో ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ కు తీవ్ర గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల ప్రధానకార్యదర్శి గుత్తికొండ రాంబాబు, ఉప్పుల రమేష్, కంకణాల రవీందర్ రెడ్డి, ఇంగ్లే ప్రభాకర్, నల్ల లింగారెడ్డి, తాళ్ల లావణ్య, చింతల ఐలయ్య, మడ్డి శ్రీనివాస్, కొక్కుల దేవేందర్,ఆసల సుధాకర్,ఉప్పు దుర్గయ్య, తుపాకుల సతీష్, జిల్లెల్ల శ్రీపాల్ రెడ్డి, మట్ట పవన్ రెడ్డి, దేవునూరి లచ్చన్న, పలకల కిషన్ రెడ్డి, గురుకుంట్ల సంజీవ్, చిట్ల శ్రీనివాస్,జోడు సంపత్, వడ్లకొండ జలపతి, మద్దూరి మల్లేష్, బెల్లం హరీష్, కనుమల్ల రాయమల్లు, చీపతి శ్రీకాంత్, రావుల అశోక్, శనిగరపు శ్రవణ్, కండె స్వామి దాస్,కొత్తూరి రవీందర్ పలువురు పాల్గొన్నారు.

మండల స్థాయి వ్యాసరచన పోటీలు..

ఇల్లందుకుంట, ప్రభాతవార్త:



కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వారు జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఇల్లందకుంట మండల కేంద్రంలో జిల్లా పరిషత్ హై స్కూల్ లో మండల స్థాయి వ్యాసరచన బుధవారం పోటీలు నిర్వహించారు. విద్య యొక్క ప్రాముఖ్యత అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్(రిటైర్డ్ టీచర్) మండల విద్యాధికారి కే రాములు నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తస్లీమ్ నజ్ నిమ్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ విద్య నిజమైన బలమని, జ్ఞానార్జన ద్వారా దేశ పురోగతికి,సమాజాభివృద్ధికి కృషి చేయవచ్చని తెలిపారు. విద్యార్థులకు చదివే ముఖ్యమని బాగా చదివిన విద్యార్థి భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో ఉంటాడని, విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు తదుపరి ఉపాధ్యాయ బృందం విద్య యొక్క ప్రాముఖ్యత వివరిస్తూ, మధురమ్మ ట్రస్ట్ వారు మండల స్థాయిలో మంచి కార్యక్రమం నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకులు మాట్లాడుతూ మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా 2011 సంవత్సరం నుండి ప్రభుత్వ సెక్టార్ల లోని విద్యార్థులకు, సమాజంలోని పేదలకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ దేశ నాయకుల జయంతి, వర్ధంతి సందర్భంగా వ్యాసరచన పోటీలు, ఆటల పోటీలు నిర్వహిస్తూ వారి ఆశయాలను నేటి విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొనుటకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని తెలిపారు అనంతరం మండల స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచిన మొదటి ఇద్దరు విద్యార్థులు ఎం రచన జిల్లా పరిషత్ హై స్కూల్ ఇల్లందకుంట, పి. నాగలక్ష్మి 8 కేజీబీవీ, ఇల్లందకుంటలకు శంకర్ నారాయణ డిక్షనరీ, షీల్డ్ లను కన్సోలేషన్ ప్రైజులుగా బి రక్షిత, ఎం అక్షయ్, ఎం సహస్ర, కె రితిక్, డి కావ్య శ్రీ, బి నితిన్, ఎం అక్షయ్, డి రితిక లు శంకర్ నారాయణ డిక్షనరీలు అందించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు ఎస్ అనసూయ, ప్రేమ్ రాజు, కె జయప్రకాష్, సిహెచ్ వేణు, కే సత్యం, జె.రాధికా రాణిలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన యూప్ టీవీ అధినేత

.ఇల్లందకుంట, ప్రభాతవార్త:



కరీంనగర్ జిల్లా ఇల్లందుకుంట మండలంలో ఎఐ శిక్షణ కేంద్రాన్ని యూప్ టీవీ అధినేత, సామాజిక వేత్త పాడి ఉదయనందన్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఐదు సంవత్సరాల్లో విద్య, వ్యవసాయం, వైద్యంతో పాటు అన్ని రంగాల్లో తి। ద్వారా మార్పులు వస్తాయని అందుకే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువతకు తి। పై అవగాహన రావాలనే ఉద్దేశ్యం తో ఉచిత తి। శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని యూప్ టీవీ అధినేత ఉదయానందన్ రెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండల కేంద్రం లో ఆరవ తరగతి చదివే విద్యార్థుల నుండి ఉన్నత విద్యనభ్యసించే యువత కోసం ఉచిత తి। శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. వీరికి తి। పై ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. గతం లో కూడా వీణవంక కేంద్రంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఏర్పాటు చేసి అనేక మంది యువతకు ఉద్యోగాలు రావడానికి సహకరించమని రాబోయే రోజుల్లో హుజూరాబాద్ కేంద్రం గా కూడా తి। ఉచిత శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచ్ లు, ఉప సర్పంచులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పలువురు పాల్గొన్నారు.

హుజూరాబాద్ వార్త



హుజురాబాద్ నుంచి అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక యాత్ర

వివరాలు వెల్లడించిన డిపో మేనేజర్ దయాకర్

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:



కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల కోసం హుజురాబాద్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ఈనెల 22న అరుణాచలానికి ప్రత్యేక ఆధ్యాత్మిక యాత్ర నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ టి. దయాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక బస్సు యాత్రలో భాగంగా భక్తులకు పలు పుణ్యక్షేత్రాల దర్శనభాగ్యం కల్పిస్తున్నారు. కాణిపాకం వినాయక స్వామి, వెల్లూరు గోల్డెన్ టెంపుల్, తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వర స్వామి ఆలయంతో పాటు అలంపూర్ జోగులాంబ అమ్మవారి ఆలయాలను భక్తులు దర్శించుకునేలా ప్రణాళిక రూపొందించారు.ఈనెల 22వ తేదీ సాయంత్రం 6 గంటలకు హుజురాబాద్ ఆర్టీసీ డిపో నుంచి ఈ బస్సు ప్రయాణం ప్రారంభం కానుంది. ఈ ఆధ్యాత్మిక యాత్రకు సంబంధించి టికెట్ ధరలను.. పెద్దలకు రూ. 4,500, పిల్లలకు రూ. 3,200 గా నిర్ణయించారు. ఆసక్తి గల భక్తులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని, ముందస్తుగా సీట్లు రిజర్వేషన్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు అర్హుల జాబితా విడుదల

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

ఐసీడీఎస్ హుజురాబాద్ ప్రాజెక్టు పరిధిలోని కుమ్మరివాడ అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు సంబంధించి అర్హుల, అనర్హుల జాబితాను విడుదల చేసినట్లు సీడీపీఓ ప్రవళిక తెలిపారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంబంధిత జాబితాను మున్సిపల్ కమిషనర్‌కు పంపించామని, మున్సిపల్ కార్యాలయ నోటీసు బోర్డులో జాబితాను ప్రదర్శించాలని, డప్పు చాటింపు ద్వారా ప్రజలకు తెలియజేయాలని కోరుతూ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్, కమిషనర్‌లకు లేఖ రాశామని పేర్కొన్నారు.అభ్యర్థులు మున్సిపల్ కార్యాలయంలో ప్రదర్శించిన జాబితాను పరిశీలించుకోవాలని సూచించారు. జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత ధ్రువపత్రాలతో ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు హుజురాబాద్ కె.సి. క్యాంపు, దమ్మక్కపేట రోడ్డులోని సీడీపీఓ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. గడువు తర్వాత వచ్చే అభ్యంతరాలను స్వీకరించబోమని స్పష్టం చేశారు.

హత్య చేసిన వ్యక్తి అరెస్టు..రిమాండ్ తరలింపు వివరాలు

వెల్లడిస్తున్నహుజురాబాద్ ఏసీపీమాధవి.

.సైదాపూర్,నవంబర్11(ప్రభాతవార్త)

:శంకరపట్నం మండలం మెట్ పల్లి గ్రామానికి చెందిన పచ్చిమట్ల అజయ్ (21) అనే వ్యక్తిని పత్తిపాక సాయికుమార్ ఈనెల 9 వతేదీన హత్య చేసిన సంఘటనపై సైదాపూర్ పోలీసు స్టేషన్ లో విలేకరుల సమావేశంలో హుజురాబాద్ ఏసీపీ మాధవి తెలిపారు.హుజూరాబాద్ ఏసీపీ మాధవి వెల్లడించిన వివరాల ప్రకారం హుజురాబాద్ పట్టణంలో ఏ టూ జెడ్ టూ వీలర్ మెకానిక్ షాప్ ను శ్రీనివాస్ నిర్వహిస్తున్నారు.అతని మెకానిక్ షాప్ లో పచ్చిమట్ల అజయ్,పత్తిపాక సాయికుమార్ లు పనిచేస్తున్నారు.అజయ్ పనితీరును మెచ్చుకోవడంపై సాయికుమార్, అజయ్ పై ఈర్ష్యా, కక్ష్య పెంచుకున్నాడు.షాప్ యజమాని శ్రీనివాస్ తన స్వగృహం సైదాపూర్ మండలం ఘణపూర్ గ్రామంలో ఈనెల 9 వతేదీన విందు భోజనం కార్యక్రమానికి పిలువడంతో ఇద్దరూ ఒకే బైక్ పై వెళ్లారు.ఎలాగైనా అజయ్ నుండి చంపాలని ముందు కక్ష పెట్టుకుని ప్లాన్ చేసుకున్నాడు.వంట సామాను తీసుకువచ్చిన ఆటోలో నుండి సుత్తిని తీసుకున్నాడు.ఇద్దరూ కలిసి వెళుతుండగా ఘణపూర్ శివారు లో అవకాశం చూసుకుని సుత్తితో అజయ్ భుజంపై కొట్టగా బండితో సహా కింద పడిపోవడంతో వెంటనే వెంబడి తెచ్చుకున్న సుత్తితో తలపై బలంగా కొట్టటంతో తీవ్రంగా గాయపడిన అజయ్ అక్కడికక్కడే మరణించారు.ఇట్టి విషయం పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా దర్యాప్తులో నిందితుడు పత్తిపాక సాయికుమార్ అజయ్ నుండి చంపినట్లు వెల్లడించారు.నిందితుడిని హుజురాబాద్ లో అరెస్టు చేసినట్లు తెలిపారు.నిందితుడు సాయికుమార్ ని పూర్తి విచారణ చేసి, న్యాయస్థానం ముందు హాజరు పరచి రిమాండ్ కు తరలించి నట్లు ఏసీపీ మాధవి తెలియజేశారు.కార్యక్రమంలో హుజురాబాద్ రూరల్ సీఐ వీ.శ్రీనివాస్, ఎస్సై కొప్పుల స్వాతి,ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్స్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కరువు పరిస్థితులపై సమగ్ర సర్వే చేపట్టి పరిహారం అందించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం విజ్ఞప్తి.. పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్‌కు వినతి

పెద్దపల్లి, ప్రభాతవార్త: వర్షాభావంతో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పెద్దపల్లి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి రైతుల సమస్యలను వివరించారు. జిల్లాలో పంటలు ఎండిపోవడం, భూగర్భ జలాలు తగ్గిపోవడం, సాగునీటి కొరతతో రైతులు పెట్టిన పెట్టుబడులు నష్టపోతున్నారని ఆయన తెలిపారు. ఈ పరిస్థితులు చిన్న, సన్నకారు రైతులతో పాటు కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల జీవనంపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. కరువు తీవ్రతను గ్రామాల వారీగా అంచనా వేసి పంట నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలని కోరారు. వరికి ఎకరాకు రూ.30 వేలు, పత్తి, మిర్చికి ఎకరాకు రూ.50 వేలు, కూరగాయలు, ఇతర పంటలకు ఎకరాకు రూ.20 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాగుకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించాలని, తాగునీటి సమస్య పరిష్కారానికి గ్రామాలు, పట్టణాల్లో అత్యవసర చర్యలు చేపట్టాలని సూచించారు. పశువులకు అవసరమైన మేతను ఉచితంగా లేదా రాయితీపై అందించాలని, ఉపాధి కోల్పోయే వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, చిన్న, సన్నకారు రైతులకు ఉపాధి హామీ పనులు విస్తరించి ఆర్థికంగా చేయూతనివ్వాలని కోరారు. రబీ పంటలు సాగు చేయలేని ప్రాంతాల్లో ప్రత్యేక ఆర్థిక సహాయం



అందించాలని, బోరుబావుల్లో అందుబాటులో ఉన్న నీటిని రైతులందరికీ న్యాయంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తక్షణమే క్షేత్రస్థాయి సర్వే చేపట్టి పంట నష్టాన్ని అంచనా వేయాలని కోరారు. జిల్లా స్థాయిలో పరిష్కరించగల సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన అంశాలపై నివేదికలు పంపించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. రైతులకు కేవలం హామీలు ఇవ్వకుండా నేరుగా ఆర్థిక సహాయం అందించాలని, అప్పుల భారంతో రైతులు ఇబ్బందులు పడకుండా, గ్రామీణ ప్రజల జీవనోపాధికి విఘాతం కలగకుండా ప్రభుత్వం స్పందించాలని తాండ్ర సదానందం హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గౌతమ్ గోవర్ధన్, ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య, పెద్దపల్లి పట్టణ కార్యదర్శి కలిపాక నవీన్, కల్లెపల్లి శంకర్, రాజయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



దేశిని చిన్న మల్లయ్య పోరాటాలు కల్లుగీత కార్మికులకు స్ఫూర్తి

మాజీ జడ్పీటీసీ సారయ్య గౌడ్ నేతృత్వంలో సంస్మరణ సభ

పెద్దపల్లి, ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితమై, కల్లుగీత కార్మికుల హక్కుల కోసం ఉద్యమించిన మాజీ ఎమ్మెల్యే దేశిని చిన్న మల్లయ్య ఆశయాలను కొనసాగించాలని మాజీ జడ్పీటీసీ సారయ్య గౌడ్ పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే దేశిని చిన్న మల్లయ్య 9వ వర్ధంతి సందర్భంగా పెద్దపల్లి పట్టణంలోని నందన గార్డెన్‌లో సంస్మరణ సభ నిర్వహించారు. సారయ్య గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దేశిని చిన్న మల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సారయ్య గౌడ్ మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో జన్మించిన చిన్న మల్లయ్య సర్పంచిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి, 4 పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజలకు సేవ చేశారని అన్నారు. కల్లుగీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించి, వారి హక్కుల సాధనకు కృషి చేశారని తెలిపారు. రాజకీయ పదవులకు ప్రాధాన్యం ఇవ్వకుండా ప్రజల ఇబ్బందులనే తన సమస్యలుగా భావించి పనిచేసిన వ్యక్తి అని పేర్కొన్నారు. ఆయన చేసిన సేవలు, కార్మికుల సంక్షేమం కోసం సాగించిన ఉద్యమాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని, వాటిని నేటి తరం ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయాల కోసం పనిచేయాలని కోరారు. అనంతరం సభకు హాజరైన నాయకులు, అభిమానులు చిన్న మల్లయ్యకు ఘనంగా నివాళులర్పించారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రమణ, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు నరసయ్య, సాంబయ్య, సర్వాయి పాపన్న రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సింగం సత్తయ్య గౌడ్, మోకు దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు జాగిరి అంజి గౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రవి గౌడ్, పడాల కొమురయ్య, రైతు సంఘం నాయకుడు మునిమడుగుల మల్లన్నతో పాటు ఉమ్మడి జిల్లా గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఓదెలలో ప్రతి ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం

ఓదెల,ప్రభాతవార్త: ఓదెల మండల కేంద్రంలోని లయన్స్ విజన్ సెంటర్‌లో ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ విజన్ కేర్ వ్యవస్థాపక అధ్యక్షులు, కంటి వైద్య నిపుణులు పూదరి దత్తాగౌడ్ తెలిపారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పక్కన ఉన్న లక్ష్మీ ఐ కేర్ అండ్ ఆప్టికల్స్‌లో ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ లగిశెట్టి వంశీ సహకారంతో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.కంటి శుక్లాలు, చెడు మాంసం సమస్యలతో బాధపడేవారికి ఉచితంగా ఫాకో శస్త్రచికిత్సలు నిర్వహించడంతో పాటు, ఆపరేషన్‌కు అవసరమైన రక్త పరీక్షలు, రవాణా, భోజన సదుపాయాలు కూడా ఉచితంగా కల్పిస్తామని తెలిపారు. పేద ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు లగిశెట్టి వంశీని లేదా 7032975096 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రూ.80 కోట్లతో రూపునారాయణపేట హై లెవల్ బ్రిడ్జి పనులు పునఃప్రారంభం

మహిళ సంఘాల భవనాలను,ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన.ప్రభుత్వ విప్ విజయరమణ రావు

ఓదెల,ప్రభాతవార్త: ఓదెల మండలం రూపునారాయణపేట వద్ద మానేరు వాగుపై జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామం వరకు రూ.80 కోట్ల నిధులతో నిర్మించనున్న హై లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు బుధవారం తిరిగి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో రూపునారాయణపేట మానేరు వాగుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.80 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. గతంలో పనులు ప్రారంభించినప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా నిర్మాణం పూర్తికాలేదని, దీంతో పనులను మరో కాంట్రాక్టర్‌కు అప్పగించి తిరిగి ప్రారంభించినట్లు వెల్లడించారు.ఈ వంతెన నిర్మాణం పూర్తయితే ఓదెల, కాల్వ శ్రీరాంపూర్, సుల్తానాబాద్ మండలాల ప్రజలకు జమ్మికుంట, హుజురాబాద్, వరంగల్ ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణ దూరం, సమయం గణనీయంగా తగ్గుతాయని పేర్కొన్నారు. అలాగే జమ్మికుంట, హుజురాబాద్ ప్రాంతాల నుంచి పెద్దపల్లికి వచ్చే ప్రజలకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రివర్గ సహకారంతో పెద్దపల్లి నియోజకవర్గానికి అనేక అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయించుకుంటున్నామని తెలిపారు. వంతెన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం ఓదెల మండలంలోని కొలనూరు, రూపునారాయణపేట బాయమ్మపల్లి గుంపుల గ్రామాల్లో 40 లక్షల నిధులతో నిర్మించిన మహిళ సంఘాల భవనాలను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్, అధికారులు, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి,స్థానిక సర్పంచ్ బొంగుని రమ శ్రీనివాస్, సర్పంచులు,మాజీ సర్పంచ్, నాయకులు ఆకుల మహేందర్, పల్లె కనకయ్య, ఊరకొండ సమ్మక్క, సిట్ల రాము, పడాల భాగ్యలక్ష్మి రాజు, ఉరగొండ వినయ్,అంకం రమేష్, సామా డిల్లి శంకర్, రెడ్డి రజనీకాంత్, కట్కూరి సమిరెడ్డి, సిరిశెట్టి రాహుల్ తో పాటు వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు నాయకులు మహిళలు పాల్గొన్నారు



పెద్దపల్లి వార్త



ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవం

పెద్దపల్లి, ప్రభాతవార్త: పెద్దపల్లి కలెక్టరేట్ ఆడిటోరియంలో జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. భారతరత్న మోలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని జరిగిన ఈ కార్యక్రమంలో విద్యారంగానికి, దేశ నిర్మాణానికి ఆయన అందించిన సేవలను వక్తలు గుర్తుచేసుకున్నారు. మోలానా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాణ్యమైన విద్యను అందించడం, అందరికీ సమాన అవకాశాలు కల్పించడం, మైనారిటీల సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి, పరిపాలన అధికారి, వివిధ మైనారిటీ వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాక్మెన్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సదస్సు

గోదావరిఖని,ప్రభాతవార్త: రైల్వే ట్రాక్మెన్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 29న సికింద్రాబాద్‌లోని లాలాగూడ రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ట్రాక్మెన్ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘం నాయకులు తెలిపారు. ఈ నేపథ్యంలో



పెద్దపల్లి రైల్వే సెక్షన్ పరిధిలోని రామగుండం, రాఘవపురం, పెద్దపల్లి ప్రాంతాల్లో పనిచేస్తున్న ట్రాక్మెన్ కార్మికులను వారు కలిసి కాన్ఫరెన్స్‌కు ఆహ్వానించారు.విధి నిర్వహణలో ట్రాక్మెన్ ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఉద్యోగ సంబంధిత సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడమే కాన్ఫరెన్స్ ప్రధాన ఉద్దేశమని నాయకులు పేర్కొన్నారు. కార్మికులు తమ సమస్యలను సదస్సులో ప్రస్తావించాలని కోరారు. కార్మికులను కలిసిన వారిలో డీఎంఆర్‌కేఎస్ జోనల్ కన్వీనర్ సూర్యదేవర శ్రీనివాస చారి, జోనల్ కమిటీ సభ్యుడు బొమ్మన వేణి చంద్రమోళి, బీఎంఎస్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి సాయివేణి సతీష్ పాల్గొన్నారు.

శివుడి ఆశీస్సులతో ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలి

పెద్దపల్లి, ప్రభాతవార్త: గ్రామాలు పాడిపంటలతో కళకళలాడాలని, ప్రజల జీవితాల్లో సుఖశాంతులు నెలకొనాలని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి ఆకాంక్షించారు. ఎలిగేడు మండలం రైకల్‌దేవుపల్లి గ్రామంలోని శివాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆమె పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజల సంక్షేమం కోసం ప్రార్థించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీపీ స్రవంతి మోహన్ రావు, మండల అధ్యక్షుడు రామ్ రెడ్డి, సుల్తాన్ పూర్ సర్పంచ్ బావు, నారాయణ పూర్ సర్పంచ్ గొడుగుల సతీష్, కోమల రెడ్డి, సమ్మయ్య, వినోద్, తిరుపతి రెడ్డి, మహిళలు, నాయ కులు పాల్గొన్నారు.



ఉచితంగా పొద్దుతిరుగుడు విత్తనాలు

జాతీయ ఆహార నూనెల మిషన్ నూనె గింజల పథకం కింద రైతులకు పంపిణీ



చొప్పదండి,ప్రభాతవార్త: చొప్పదండి మండలంలో నూనెగింజల సాగును ప్రోత్సహించడంతో పాటు రైతులకు ప్రత్యామ్నాయ పంటల ద్వారా అదనపు ఆదాయం కల్పించే లక్ష్యంతో జాతీయ ఆహార నూనెల మిషన్ – నూనె గింజలు పథకం కింద బుధవారం చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో రైతులకు ఉచితంగా పొద్దుతిరుగుడు విత్తనాలను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో భాగంగా తిల్విన్ సన్టెక్ వన్ రకం పొద్దుతిరుగుడు విత్తనాలను చొప్పదండి మండలానికి 100 ఎకరాల సాగు లక్ష్యంతో మొత్తం 250 కిలోలు కేటాయించగా, ఒక్కో ఎకరానికి 2.5 కిలోల చొప్పున అర్హులైన, ఆసక్తిగల రైతులకు పూర్తిగా ఉచితంగా పంపిణీ చేసారు. రైతుల పొలాల్లో భూసార పరీక్షలు – ప్రత్యేక చర్యలు పొద్దుతిరుగుడు సాగు చేయడానికి ముందుకు వచ్చిన ప్రతి రైతు పొలంలో నుంచి వ్యక్తిగతంగా మట్టి నమూనాలను సేకరించడం జరుగుతుంది. సేకరించిన మట్టి నమూనాలను సంబంధిత చైన్ పార్టనర్ ద్వారా భూసార పరీక్షలకు పంపించి, పరీక్షల అనంతరం రైతులకు భూసార పరీక్ష నివేదికలు అందించడం జరుగుతుందన్నారు. తద్వారా రైతులు తమ పొలాల భూసార స్థితికి అనుగుణంగా సమతుల్య ఎరువుల యాజమాన్యాన్ని పాటించేందుకు అవకాశం కలుగుతుంది. వి సి పి ద్వారా పంట సాగు పర్యవేక్ష ణఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని విలేజ్ క్లస్టర్ పార్టనర్ గా కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ వి సి పి ద్వారా విత్తనాల పంపిణీ నుంచి పంట సాగు, రైతులకు సాంకేతిక సూచనలు, భూసార పరీక్షలు, పంట పురోగతి, ఇతర సంబంధిత కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుంది. సమూహ సాగుకు ప్రాధాన్య తఒకే ప్రాంతంలో సుమారు 20-30 ఎకరాల విస్తీర్ణంలో రైతులు సమూహంగా పొద్దుతిరుగుడు సాగు చేపట్టడం ద్వారా పంట యాజమాన్యాన్ని సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు, ఉత్పత్తు లను సమిష్టిగా మార్కెటింగ్ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. రైతులం దరూ వ్యవసాయ శాఖ అధికారులు సూచించే శాస్త్రీయ సాగు పద్ధతులను పాటించాలని సూచించడం జరిగింది. రైతులకు విజ్ఞప్తి దేశంలో వంటనూనెల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, దేశీయంగా నూనెగింజల ఉత్పత్తిని పెంచడం, రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా అదనపు ఆదాయ అవకాశాలను కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం అని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో ఎ డి ఎ ప్రియదర్శిని, వ్యవసాయ అధికారి అంజిత్ కుమార్, పిఏసిఎస్‌సిఇఒ కళ్యెం తిరుపతి రెడ్డి, ఎఇఒలు, రైతులు పాల్గొన్నారు.

మహాపాదయాత్రను విజయవంతం చేయాలి

ఈ నెల 18న పాదయాత్రకు బండి సంజయ్ కుమార్ హాజరు : బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ



చొప్పదండి,ప్రభాతవార్త: కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహించనున్న మహాపాదయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డిలు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం చొప్పదండి రూరల్ మండల బీజేపీ అధ్యక్షులు ముగ్గిలి మహేష్ ఆధ్వర్యంలో మహాపాదయాత్ర సంబందించిన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 18న నిర్వహించనున్న మహాపాదయాత్రకు సంబంధించిన కార్యక్రమ వివరాలను పార్టీ నాయకులు, కార్యకర్తలకు వివరించడం జరిగింది. ఈ మహాపాద యాత్రకు ముఖ్య అతిథులుగా బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు హాజరుకా నున్నారని తెలిపారు. ఈ మహాపాదయాత్ర భారతీయ జనతా పార్టీకి ఎంతో ప్రతిష్టాత్మకమైన కార్యక్రమమని, పార్టీ శ్రేణులందరూ సమన్వయంతో పనిచేస్తూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గ్రామస్థాయి నుంచి ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి మహాపాదయాత్ర ప్రాధాన్యతను వివరించాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి మహాపాదయాత్రను చారిత్రాత్మక విజయంగా నిలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శిలు కొమ్మ రమేష్ ఎడ్ల సురేష్ మండల ఉపాధ్యక్షులు గన్ను నరసింహారెడ్డి, బద్దెనపల్లి రాజేందర్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు మడిపల్లి రాజు సీనియర్ నాయకులు భైరగోని కిట్టు గౌడ్, విలాసారం అంజయ్య, దొంతి సారపు సంపత్, తాటికొండ అనిల్ కుమార్, లింగంపల్లి కళ్యాణ్ మాచర్ల శశి కుమార్, రాపెల్లి శ్రీనివాస్, ఒరుగుల తిరుపతి, దామెర మధుసూదన్ రెడ్డి, పోరండ్ల రవీందర్, జిల్లాల రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాల్వ వెంబడి

రైతుల మోటార్ల వరుస చోరీలు

నష్టపోతున్న రైతులు.. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలి సంగ నరేష్ బిజేవైయం జిల్లా అధ్యక్షులు



చొప్పదండి,ప్రభాతవార్త: నవోదయ కెనాల్ పరిధిలో వారస చోరీలతో రైతులకు చెందిన 5 హెచ్‌పీ మో టార్లు అపహరణ గురవుతుం డడం రైతులకు ఇబ్బందికి గురిచే స్తుందని, గుర్తుతెలియని దొం గలు రైతుల పాలిట శాపంగా మారారని జిల్లా బీజేవైఎం అధ్య క్షులు సంఘ నరేష్ పేర్కొన్నారు. ఇప్పటికే చొప్పదండి పట్టణానికి చెందిన పలు రైతులకు సంబం ధించిన 28 వ్యవసాయ బోరు మోటార్లను రాత్రి పూట దొంగలు అపహరించారని అన్నారు. ఒక్కొక్కటి 5 హెచ్‌పీ సామర్థం కలిగిన మోటార్లను ఫ్యూజులు తొలగించి మరీ ఎత్తుకెళ్లడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని వారు అన్నారు. వ్యవసాయ ప్రాంతాల్లో రాత్రి గస్తీని ముమ్మరం చేసి, మోటార్ల చోరీలకు పాల్పడుతున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసులను నరేష్ కోరారు.



మెప్మాపైసమీక్ష సమావేశం

చొప్పదండి,ప్రభాతవార్త: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా పై కమిషనర్ కీర్తి నాగరాజు అధ్యక్షతన బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వ హించారు. మెప్మా పీడీ స్వరూప రాణి, మెప్మా ఆర్పీలతో ఈ సమీక్ష సమా వేశం నిర్వహించారు. మహిళా సంఘాలు బ్యాంకు లింకేజీ, మెప్మా క్యాం టీన్లు, నూతన సంఘాల ఏర్పాటు, వికలాంగులు, వీధి వ్యాపారుల సంఘా లు, ఇందిరా మహిళా శక్తి, చీరల పంపిణీ, మహిళా సంఘాలు చేపట్టే వినూత్న కార్యక్రమాలపై సమావేశంలో చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా డి ఎం సి శ్రీవాణి, టిఎంసి అనిత, రిసోర్స్ పర్సన్లు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిగా ప్రమాణ స్వీకారం చేసిన నరేష్

చొప్పదండి,ప్రభాతవార్త: తెలంగాణ బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో హైకోర్టు ప్రాంగణంలో నిర్వహించిన న్యాయవాదుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో కరీం నగర్ జిల్లా చొప్పదండి మండల భూపాల పట్నం గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక కార్య కర్త గొల్లపెల్లి నరేష్ న్యాయవాదిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ చైర్మెన్ రామ్ రెడ్డి, వైస్ ఛైర్మెన్ వెంకట్ యాదవ్, బార్ కౌన్సిల్ ప్రతినిధులు నూతన న్యాయవా దులకు న్యాయవాద వృత్తి విలువలు, బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు.

చొప్పదండి వార్త



ఆసుపత్రి ప్రారంభోత్సవానికి ఆహ్వానం..

వంద పడకల ఆసుపత్రి ప్రారంభోత్సవానికి మంత్రి దామోదర రాజనర్సింహా ను ఆహ్వానించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి,ప్రభాతవార్త: చొప్పదండి మండల కేంద్రంలో నిర్మాణం పూర్తి చేసుకున్న 100 పడకల ఆసుపత్రి ప్రారంభోత్సవం కోసం రావాలని బుధవారం మినిష్టర్ క్వార్టర్స్‌లో తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ని కలిసి ఆహ్వానించిన చొప్పదండి శాసనసభ్యులు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మేడిపల్లి సత్యం. చొప్పదండి మండలంతో పాటు చుట్టు పక్కల ఉన్న నాలుగు మండలాల ప్రజలకు ఈ ఆసుపత్రి చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వారి వెంట చొప్పదండి మండల కాంగ్రెస్ అధ్యక్షులు, సింగిల్ విండో చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ ఫోరం అధ్యక్షులు గుర్రం సుజీత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మల్యాల రామాలయం నిర్మాణానికి రూ 5,55,555 విరాళం అందించిన దాతలు

మల్యాల, ప్రభాతవార్త: మల్యాల మండల కేంద్రంలో భారీ అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన శ్రీ కోదండరామ ఆలయ నిర్మాణానికి హైదరాబాద్ ఉత్తేజ్ రియాల్టీ కి చెందిన మారం ఉత్తేజ రెడ్డి, శ్రావణి, దేవేందర్ రెడ్డి, రనిత రెడ్డిలు బుధవారం రూ,5,55,555 లను విరాళంగా అందజేశారని ఆలయ నిర్మాణ వ్యవస్థాపక చైర్మన్ ఎల్లాల జనార్దన్ రెడ్డి తెలిపారు, మల్యాల లో భారీ ఎత్తున చేపడుతున్న శ్రీ సీతారామ మందిర నిర్మాణానికి విరాళం అందజేసినందుకు ఈ సందర్భంగా ఆయన వారికి కృతజ్ఞతలు తెలిపారు,



రబీలో రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలి

మల్యాల, ప్రభాతవార్త: ప్రస్తుత వరి కోతల అనంతరం రైతులు తక్కువ నీటితో అధిక లాభాలు సాధించేందుకు ఆరుతడి పంటలను వేసుకోవాలని మల్యాల మండల వ్యవసాయ అధికారి చంద్ర దీపక్ కోరారు, బుధవారం మల్యాల మండలం ఓబులాపూర్ లో ఎల్ నినో కరువు ఎదుర్కొ నేందుకు రైతులకు అవగాహన కల్పించారు, భూగర్భ జలాలు తక్కువ అవుతు న్నందున రైతులు వరి పంటలకు బదులు పెసర ,మొక్కజొన్న, మినుము లు ,శనగలు, నూనె గింజల పంటల తో పాటు కూరగాయలు పండించి ఆదాయం పొందాలని అంతేకా కుండా ఆయిల్ ఫామ్ మామిడి తోటల సాగు లాభదాయకమన్నారు, కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గ్యాదం కుమార్, గిర్ధవార్ తిరుపతి ఏఈఒ శ్రీలేఖ, పంచాయతీ కార్యదర్శి కిరీటి పాల్గొన్నారు,



మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

అనంతపల్లెలో వివో భవనానికి భూమి పూజ

చందుర్తి / ప్రభాతవార్త

మహిళా సంక్షేమమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ప్రభుత్వ విప్. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం అనంతపల్లె గ్రామంలో మహిళా వీవో సంఘ నూతన భవన నిర్మాణం కోసం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు ఆత్మగౌరవంతో ముందుకు సాగాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గతంలో మహిళా సంఘాలకు పావలా వడ్డీ రుణాలు అందించిన కాంగ్రెస్ ప్రభుత్వం, అనంతరం వడ్డీలేని రుణాల విధానాన్ని తీసుకొచ్చిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు రూ. 67 వేల కోట్ల ఆర్థిక సహాయం అందించే దిశగా చర్యలు చేపట్టిందని తెలిపారు. ఒక్కో సంఘానికి రూ. 20 నుండి 25 లక్షల వరకు రుణాలు పొందే అవకాశం కల్పిస్తూ మహిళలపై నమ్మకంతో ఎలాంటి పూచీకత్తులు లేకుండా బ్యాంకుల



ద్వారా రుణాలు అందిస్తున్నట్లు వివరించారు. మహిళా సంఘాలకు కేవలం ఆర్థిక సహాయమే కాకుండా శాశ్వత భవనాలు, బస్సులు, పెట్రోల్ పంపులు. సోలార్ పవర్ ప్లాంట్ల ద్వారా ఆదాయ మార్గాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళలు సమావేశాలు నిర్వహించుకోవడానికి, తమ సమస్యలను చర్చించుకోవడానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవడానికి ఈ భవనాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. గత ప్రభుత్వం రాష్ట్రంపై భారీగా అప్పుల భారం మోపినప్పటికీ, ఆర్థిక పరిస్థితులను అధిగమిస్తూ గతంలో అమలులో ఉన్న సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే కొత్త పథకాలను ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిలకబాబు. రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి. సింగిల్ విండో చైర్మన్ గసికంటి ప్రభాకర్. ఎంపీడీవో రాధ. ఏపీఎం కళ్యాణి. మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వేములవాడ వార్త



బూరుగు పల్లి లో నూతన బస్టాండ్ కు భూమి పూజ

బోయిన్ పల్లి ప్రభాత వార్త



బోయిన్ పల్లి మండలం లోని బూరుగు పల్లి గ్రామంలో నూతన బస్టాండ్ కు పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా కేటాయించిన లక్ష రూపాయల నిధులతో దీనిని నిర్మిస్తున్నట్లు సర్పంచ్ సౌమ్య మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెంచాల సౌమ్య మహేష్, ఉప సర్పంచ్ కల్లేపల్లి చంద్రయ్య, వార్డు సభ్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్, వార్డు సభ్యులు మ్యాన వర్షిత వెంకటేష్ , గ్రామ కార్యదర్శి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వర స్వామి అన్నదాన ట్రస్టుకు రూ.1,00,001 విరాళం..

వేములవాడ ప్రభాతవార్త



:వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అన్నదాన ట్రస్టుకు వరంగల్‌కు చెందిన వేముల సువర్ణ నాగరాజు దంపతులు లక్షా ఒక రూపాయి విరాళంగా అందజేశారు. బుధవారం ఆలయ ప్రోటోకాల్ కార్యాలయంలో పీఆర్ఓ పెరిక శ్రీనివాస్‌కు నగదు రూపంలో విరాళాన్ని అందించారు. అనంతరం దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితులు స్వామివారి మండపంలో దంపతులకు వేదాశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

.పెండింగ్ డీఏ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి: డీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ బూర సదానందం.

.వేములవాడ ప్రభాతవార్త:



వేములవాడ మండలంలో డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ బూర సదానందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు, ఒక గది ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన పీఆర్సీని 51 శాతం ఫిట్‌మెంట్‌తో వెంటనే ప్రకటించాలని, ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు మంగళగిరి చక్రపాణి, వేములవాడ రూరల్ మండల అధ్యక్షుడు దశరథం, ప్రధాన కార్యదర్శి విష్ణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేత్ బచావో అభియాన్ ఎల్‌నినో ప్రభావాలపై రైతులకు అవగాహన



బోయిన్ పల్లి ప్రభాత వార్త

బోయినపల్లి మండలం లోని బూరుగుపల్లి, కోరెం గ్రామాలలో ఆయా గ్రామ సర్పంచ్ లు పెంచాల సౌమ్య , జంపుక మాధవి అధ్యక్షతన సాగు భూముల సంరక్షణ, ఎల్‌నినో ప్రభావాలు, వాతావరణ మార్పుల వల్ల వ్యవసాయ రంగంపై కలిగే ప్రభావాలు, రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన సమావేశం నిర్వహించడం జరిగింది. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, తక్కువ నీరు అవసరం ఉన్న ఆరుతడి పంటలు మొక్కజొన్న, శనగ, పెసర, మినుము, పొద్దు తిరుగుడు, నువ్వులు మొదలైన పంటలు వేసుకోవాలని రైతులని విజ్ఞప్తి చేశారు. . ఈ సమావేశంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, కోరం అధ్యక్షులు శ్రీమతి వన్నెల మమత , వ్యవసాయ విస్తరణ అధికారి రవళి, లక్ష్మణ్, నీటి పారుదల శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి, గ్రామ కార్యదర్శులు శ్రీకాంత్, బాలయ్య, రైతులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి



చందుర్తి: ప్రభాతవార్త

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుంద రెడ్డి తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం. సర్పంచ్ పులి సత్యం సింగిల్ విండో చైర్మన్ గసికంటి ప్రభాకర్. డీపీఎం శ్రీనివాస్. ఏపీఎం కళ్యాణి ప్రజా ప్రతినిధులు. రైతులు పాల్గొన్నారు.

గొర్రెలు చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్, ఎస్సై రామ్మోహన్

ప్రభాత వార్త కోనరావుపేట



గొర్రెల మంద నుండి 44 గొర్రెలను ఎత్తుకెళ్లిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి 11 గొర్రెలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు. కోనరావుపేట మండలం మల్కపేట గ్రామానికి చెందిన ఎక్కాల దేవి నాగరాజు, తన గొర్రెల మంద నుండి 44 గొర్రెలను గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారని కోనరావుపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు ఇచ్చారు. దీనిపై ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా మంగళవారం నిందితులైన గ్రామానికి చెందిన దండగల రాజు శివంగలపల్లె గ్రామానికి చెందిన మహేష్, అను వారిని పట్టుకుని, వారి వద్ద నుండి 11 గొర్రెలను సీజ్ చేసి రిమాండ్ కు తరలించారు. మరో నిందితుడు శేఖర్ పరారీలో ఉన్నాడని, తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని ఎస్సై తెలిపారు.

ఘనంగా యూనియన్ బ్యాంక్ ఆవిర్భావ వేడుకలు

చందుర్తి ప్రభాతవార్త



చందుర్తి మండలం మల్యాల గ్రామంలో యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ లో 108వ ఆవిర్భావ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారుఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చందుర్తి ఎంపీవో రాజేశ్వర్ గౌడ్ హాజరై బ్యాంకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ బ్యాంకు గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు సేవలు అందించడం అభినందనీయమన్నారు. బ్రాంచ్ మేనేజర్ తిరుపతి కేక్ కట్ చేసి ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు శారద అబ్రహం. మరాటి మల్లిక్. అవారు రమేష్. శంకర్. పోతరాజు భారతి నగేష్ బ్యాంకు సిబ్బంది. ఖాతాదారులు పాల్గొన్నారు.

వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం



బోయిన్ పల్లి ప్రభాత వార్త

బోయిన్ పల్లి మండలం లోని బూరుగు పల్లి వడ్ల కొనుగోలు కేంద్రాన్ని గ్రామపంచాయతీ పలకవర్గం ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ పెంచాల సౌమ్య మహేష్, ఉప సర్పంచ్ కల్లేపల్లి చంద్రయ్య, సింగిల్ విండో డైరెక్టర్ ముద్దం రవీందర్ గౌడ్, తెలంగాణ వార్డు సభ్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్, వార్డు సభ్యులు మ్యాన వర్షిత వెంకటేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



సింగిల్ విండో చైర్మన్ గసికంటి ప్రభాకర్

చందుర్తి :ప్రభాతవార్త

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని చందుర్తి సహకార సంఘం (సింగిల్ విండో చైర్మన్) గసికంటి ప్రభాకర్ అన్నారు. చందుర్తి మండలం లో రామన్నపేట. తిమ్మాపూర్ గ్రామాలలో చందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి తో కలిసి గసికంటి ప్రభాకర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను అన్ని రకాలుగా ఆదుకునేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని శుద్ధిచేసి కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పోతరాజు భారతి. శంకర్ స్థానిక నాయకులు. సింగిల్ విండో సిబ్బంది. రైతులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణతోనే భవిష్యత్ సాగుకు భరోసా

ముత్తారం మండల వ్యవసాయ అధికారి జె. అనూష

మైదంబండలో ఖేతీ బచావో అభియాన్ కార్యక్రమం

ముత్తారం, ప్రభాతవార్త:

నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని ముత్తారం మండల వ్యవసాయ అధికారి జె. అనూష రైతులకు సూచించారు. బుధవారం ముత్తారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మైదంబండలో నిర్వహించిన 'ఖేతీ బచావో అభియాన' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. నీటి సంరక్షణకు ప్రాధాన్యమిస్తూ బిందు, తుంపర సేద్య పద్ధతులను అనుసరించాలని కోరారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, ఒంగోలు, గిర్, సహివాల్ వంటి దేశవాళీ పశు జాతులను పెంచుకోవడం ద్వారా పాల దిగుబడిని పెంచుకోవచ్చని వివరించారు. పశువుల నుంచి లభించే పేడను సేంద్రియ ఎరువుగా పొలాల్లో



వినియోగించుకోవాలని సూచించారు. వరి కోతల తర్వాత పంట గడ్డిని కాల్చకుండా గడ్డి చుట్టలుగా తయారుచేసి భద్రపరచుకోవడం ద్వారా పశుగ్రాస కొరతను నివారించవచ్చని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతలు నిర్మించి వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో మైదంబండ సర్పంచ్ బియ్యని శివకుమార్, ఏఈఓ బి. శశిధర్, రైతులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

సర్పంచ్ రాజబాబును దూషించిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలి

మాల సంఘం రాష్ట్ర నాయకులు కొండ రవీందర్

మంథని రూరల్ ప్రభాతవార్త:

పుట్టపాక సర్పంచ్ కన్నూరి రాజబాబును అసభ్య పదజాలంతో దూషించిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని, తిరుపతి రెడ్డిని ఎందుకు అరెస్టు చేయడం లేదో పోలీసులు సమాధానం చెప్పాలని మాల సంఘం రాష్ట్ర నాయకులు కొండ రవీందర్ తెలిపారు. బుధవారం మంథని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకుడు పోరెడ్డి తిరుపతి రెడ్డి, సర్పంచ్ రాజబాబును అవమానకరంగా మాట్లాడారని ఆయన ఆరోపించారు. ఇది హేయమైన చర్య అని అన్నారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన సర్పంచ్ రాజబాబును అవమానించిన తిరుపతి రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయడమే కాకుండా, అరెస్ట్ చేసి చట్ట ప్రకారం ఎస్సి, ఎస్టీ యాక్ట్ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షి ంచాలని ఆయన డిమాండ్ చేశారు. తిరుపతి రెడ్డి



అరెస్ట్ కాకపోవడం వెనుక ఏదైనా కుట్ర ఉందేమోనని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు ఇప్పటికైనా జాప్యం చేయకుండా తిరుపతి రెడ్డిని అరెస్ట్ చేసి ప్రజలకు నమ్మకం కలిగించాలని కోరారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా ఉన్న సొంత పార్టీ నాయకులనే సస్పెండ్ చేయించిన తీరుగానే ఈ ఘటనలోనూ వ్యవహరిస్తున్నారని కొండ రవీందర్ విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో మాల సంగం రాష్ట్ర నాయకులు కారెంగుల సుధాకర్, ఎరుకల రవి, పెద్దపల్లి జిల్లా నాయకులు కారెంగుల సురేష్, బడికెల సతీష్, జంజర్ల మురళి, బండారి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మట్టి పాత్రలనే వాడండి వ్యాధులను దూరం చేసుకోండి

మంథని రూరల్ ప్రభాతవార్త:

నేటి సమాజం ప్లాస్టిక్, అల్యూమినియం తదితర వంట పాత్రలను ఉపయోగించడంతో క్యాన్సర్ వంటి వ్యాధులకు ప్రజలు గురవుతున్నారని అందుచేత మట్టి పాత్రలను వాడి వ్యాధుల నుండి ప్రజలు దూరంగా ఉండి ఆరోగ్యంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు టి.కే. శ్రీనివాస్ అన్నారు. కుంబార్ స్వశక్తి కరణ్ కార్యక్రమంలో భాగంగా గ్రామోద్యోగ వికాస్ యోజన పథకం కింద కుమ్మర యువకులకు వృత్తి శిక్షణ ఇచ్చి వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకునే కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షులు నడి కూడా జయంత రావు నాయకత్వంలోజిల్లా స్థాయిలో మంథని మండలం లోని సూరాయపల్లి గ్రామంలో 20 మంది యువకులకు కుమ్మర కులవృత్తి పై శిక్షణ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు టి.కే .శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి సమాజం ప్లాస్టిక్, అల్యూమినియం తదితర వంట పాత్రలను ఉపయోగించడంతో క్యాన్సర్ వంటి వ్యాధులకు ప్రజలు గురవుతున్నారని అందుచేత మట్టితో చేసిన వంట పాత్రలను వాడితే క్యాన్సర్ తదితర వ్యాధులు దరి చేరవని సైంటిస్టులు తెలుపుతున్నారని అన్నారు. అందుకే పూర్వీకులు మట్టి పాత్రలను వాడి అనేక వ్యాధుకు ప్రజల దూరంగా ఉండేవారని ప్రస్తుత తరుణంలో ప్లాస్టిక్ ఉపయోగంతో అనేక



వ్యాధులకు బారిన ప్రజలు పడుతున్నారని అన్నారు. అందుచేత కుమ్మర కులవృత్తి ని కాపాడటం తో పాటు మట్టి పాత్రలతో చేసిన పాత్రలను వాడిన వారికి పలు వ్యాధుల నుండి ఉపశమనం కలుగుతుందని రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు టి.కే శ్రీనివాస్ అన్నారు. కుమ్మర కులవృత్తి పై శిక్షణ పొందుతున్న యువకులు వృత్తి నీ నైపుణ్యం పెంపొందించుకొని అధునాతన మట్టి పాత్రలను తయారు చేసి ప్రజలకు అందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు ఆషాడపు లింగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కటికనపల్లి రవీందర్, ఏ శిక్షణ శిబిరా ఇన్స్ట్రక్టర్ రాతిపల్లి నగేష్, కుమ్మర సంఘం ప్రతినిధులు రేపాక శంకర్ ,రేపాక రాములు కల్పచర్ల రాజేందర్, ఇందారపు రాజు, రేపాక శ్రీనివాస్ ,రేపాక మల్లయ్య, గొల్లపల్లి శ్రీనివాస్, ఉప్పుల రవీందర్ ,గొల్లపల్లి రవళి, తో పాటు శిక్షణ పొందే కుమ్మర యువకులు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా రత్నాపూర్ లో పోచమ్మ ఉత్సవాలు ప్రారంభం

రామగిరి ప్రభాతవార్త

రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో పోచమ్మ కొలుపు ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఐదు సంవత్సరాలకోకసరి పోచమ్మ కొలుపు ఉత్సవాలు జరుగుతాయి. ఊరంతా సందడి వాతావరణం లో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. గ్రామ నడిబొడ్డున బొడ్రాయి వద్ద పూజలను నిర్వహించిన సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పల్లె ప్రతిమా పివి రావు మాట్లాడుతూ గ్రామ కట్టుబాటు ప్రకారం పోచమ్మ కొలుపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామంలోని రైతులు ప్రజలు యువకులు అన్ని వర్గాల కులస్తులు సుఖ శాంతులతో ఉండాలని కోరుకోవడం జరిగిందన్నారు. దీనికి తోడు పోలిమేరు గ్రామాలైన కల్వచెర్ల, పన్నూరు,



నాగెపెల్లి, నవాబ్ పేట, బేగంపేట, మేడిపల్లి శివారులోని గ్రామాల ప్రజలు, అన్ని గ్రామాల ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కనవేన సదానందం విరాళంగా అందించిన పోతరాజు విగ్రహాన్ని మధున పోచమ్మ వద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. గురువారం బొడ్రాయి వద్ద పోచమ్మ బలి కార్యక్రమం నిర్వహిస్తారు

పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘన దాసరి శివ సస్పెన్షన్

అధిష్టానం నిర్ణయం మేరకు చర్యలు

క్రమశిక్షణ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తులసిరాం గౌడ్

రామగిరి ప్రభాతవార్త

పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించిన కారణంగా రామగిరి మండలం బేగంపేట గ్రామానికి చెందిన దాసరి శివను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోరకొప్పుల తులసిరాం గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని, పార్టీ నియమ నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అవసరమైతే సస్పెన్షన్‌తో పాటు పార్టీ నుంచి బహిష్కరణ కూడా తప్పదని హెచ్చరించారు. అధిష్టానం ఆదేశాల మేరకే దాసరి శివపై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నట్లు తులసిరాం గౌడ్ తెలిపారు

మంథని వార్త



అల్లం నారాయణకు పెరిక సంఘం నాయకుల పరామర్శ

ముత్తారం, ప్రభాతవార్త:



తెలంగాణ ప్రెస్ అకాడమీ తొలి చైర్మన్ అల్లం నారాయణ, ఆయన కుటుంబ సభ్యులు అల్లం రాజయ్య, అల్లం వీరయ్యలను పెరిక సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో పెరిక సంఘం నాయకులు పరామర్శించారు. అల్లం నారాయణ తల్లి అల్లం బుచ్చమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం మంథని మండలంలోని గాజులపల్లి గ్రామంలోని ఆయన నివాసంలో పెరిక సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కందుల సంధ్యారాణి, జిల్లా అధ్యక్షుడు దుండె మల్లేష్ పరామర్శించారు. ముందుగా అల్లం బుచ్చమ్మ చిత్ర పటానికి వారు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అల్లం నారాయణ, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెరిక సంఘం జిల్లా నాయకులు కందుల పోశం, బత్తుల రమేష్, ఉగ్గె కుమార్, పేరం చిరంజీవి, లగిశెట్టి చంద్రమోళి, మీస రఘురాం, ఆకుల సత్యనారాయణ, బియ్యాల మహేందర్ తదితరులున్నారు.

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

కాలనీలో కుక్కలు కోతుల బెడద ను నియంత్రించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలి

రామగిరి ప్రభాతవార్త



రాబోయే వేసవిలో నీటి ఎద్దడి నివారణతో పాటు కాలనీల్లో కుక్కలు, కోతుల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు నాగేల్లి సాంబయ్య ఆర్‌జీ3 జనరల్ మేనేజర్ మధుసూదన్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఎల్ నినో ప్రభావంతో రానున్న వేసే కాలంలో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో సెంటనరీ కాలనీ లో తాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అలాగే కోతులు మరియు వీధి కుక్కల బెడద రోజురోజుకు పెరుగుతూ కాలనీవాసులు ముఖ్యంగా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పరిసర గ్రామాల సర్పంచ్ ల తో సమన్వయం చేసుకుంటూ వీధి కుక్కలు మరియు కోతుల బెడద నియంత్రించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనిపై జనరల్ మేనేజర్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జాయింట్ సెక్రటరీ దేవ శ్రీనివాస్, సెంట్రల్ కమిటీ సభ్యులు కేశవరావు, పెద్ది స్వామి, డివిజన్ నాయకులు ఎండీ షరీఫ్, ఓసీపీ1 ఫిట్ సెక్రటరీ గిటుకు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యా

రామగిరి ప్రభాతవార్త



రామగుండం ఆర్ జి త్రీఎస్!!ఓసీ విభాగంలో పనిచేస్తున్న చందుపట్ల సరిత తండ్రి సంధి మల్లారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబ సభ్యులను బుధవారం టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజి రెడ్డి పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల ఆ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఈసంపల్లి రమేష్, బోయినపల్లి శ్రీకాంతరావు, ఆర్ జి త్రీ డివిజన్ అడ్వైజర్ పోతరాజు రవి సీనియర్ నాయకులుగుండెవేణి.నర్సింగరావు ఉన్నారు.

ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచేందుకు మేట్లకు శిక్షణ

ప్రతి కుటుంబానికి 125 రోజుల ఉపాధి కల్పనపై అవగాహన

పెగడపల్లి, ప్రభాతవార్త:

మండలంలోని ఐకేపీ కేంద్రంలో బుధవారం వీబీజీ రామ్ జీ వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ పథకంలో భాగంగా కూలీల సంఖ్య పెంపుపై గ్రామాల మేట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ ప్రేమ్ సాగర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతి గ్రామ పంచాయతీకి నియమించిన మేట్లకు పథకం అమలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో అర్హులైన కుటుంబాలకు 125 రోజుల ఉపాధి కల్పన, కూలీల నమోదు, జాబ్ కార్డుల నిర్వహణ, మస్టర్లు, వేతనాల చెల్లింపు, పనుల గుర్తింపు తదితర అంశాలను వివరించారు.



గ్రామాల్లో కూలీల సంఖ్య పెంచడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించి, పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ బి. అనిల్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీపీ ఎస్ నందగిరి తెనుగువాడలో ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

పెగడపల్లి, ప్రభాతవార్త:

మండలంలోని ఎంపీపీ ఎస్ నందగిరి తెనుగువాడ పాఠశాలలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చాట్ల వెంకటేశం మాట్లాడుతూ 1888 నవంబర్ 11న మక్కాలో జన్మించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యావేత్తగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా దేశానికి విశేష సేవలందించారని తెలిపారు. అరబిక్, ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ, పర్షియన్, బెంగాలీ భాషల్లో ప్రావీణ్యం సంపాదించారని, తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించారని వివరించారు. హిందూ, ముస్లింల మధ్య ఐక్యత కోసం ఖిలాఫత్ పత్రికను స్థాపించి మతసామరస్యానికి కృషి చేశారని పేర్కొన్నారు. విద్య అనేది కేవలం అక్షరజ్ఞానం మాత్రమే కాదని, మనిషి జీవితాన్ని మార్చే



గొప్ప శక్తి అని అన్నారు. ప్రతి బిడ్డకు విద్య అందాలనే లక్ష్యంతో ఆయన జయంతి నవంబర్ 11ను జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 1992లో భారతరత్న పురస్కారంతో గౌరవించిందని గుర్తుచేశారు. మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ముందుగా భారతీయులమనే భావనతో ఐక్యత, సోదరభావంతో జీవించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

వరి కొయ్యలను కాల్చకూడదు

ధర్మపురి, ప్రభాతవార్త:

వరి కొయ్యలను కాల్చకుండా భూమిలోనే కలియదున్ని భూసారాన్ని కాపాడుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎం. రాజకుమార్ రైతులకు సూచించారు. బుధవారం ధర్మపురి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అక్సాయిపల్లె గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కొయ్యలను కాల్చడం వల్ల భూమిలోని సూక్ష్మజీవులు నశించడంతో పాటు పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని తెలిపారు. కొయ్యలు త్వరగా కుళ్లిపోయేందుకు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ లేదా వేస్ట్ డీకంపోజర్ వినియోగించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున రాబోయే యాసంగిలో వరికి బదులుగా పెసర, మినుము, జొన్న, సజ్జ, వేరుశనగ, నువ్వులు, చిరుధాన్యాలు, కూరగాయలు వంటి ఆరుతడి పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేష్, ఏఈఓ నవ్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.



తిమ్మాపూర్‌లో అట్టహాసంగా జిల్లా స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

బాలికల్లో క్రీడాస్ఫూర్తి నింపిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్,ప్రభాత వార్త, నవంబర్ 11:

తిమ్మాపూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా ఫూలే బాలికల గురుకుల కళాశాలలో బుధవారం అండర్17 బాలికల విభాగంలో జిల్లా స్థాయి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ఘనంగా ప్రారంభమైంది. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ తదితర క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ క్రీడా పోటీలను ప్రారంభించారు. బాలికలు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను



పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ జాయింట్ సెక్రటరీ ఎం. అంజలి, సెట్ ఇన్‌స్పెక్టర్ అభిజిత్, వ్యవసాయ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నరసింహారెడ్డి, వివిధ పాఠశాలల ప్రిన్సిపల్స్ డి. విమల, లవణ, సంతోషి, హారిక తదితరులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. సరితా కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. జిల్లా స్థాయి క్రీడా పోటీల ప్రారంభంతో బాలికల్లో ఉత్సాహం నెలకొంది.

బీ ఆర్ ఎస్ సోషల్ మీడియా లో పోస్ట్ పెట్టినందుకు శ్యాం సుందర్ రావు అరెస్ట్..

అరెస్ట్ చేసిన హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు..

తిమ్మాపూర్,ప్రభాత వార్త,నవంబర్11:

సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన బీఆర్ఎస్ సోషల్ మీడియా లో కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీకి చెందిన సిరికొండ శ్యాంసుందర్రావు ను హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు బుధవారం మధ్యాహ్నం అరెస్టు చేసి తీసుకెళ్లారు. గత కొద్ది రోజుల క్రితం ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్.. కేటీఆర్ పై చేసిన ఆరోపణలు ఖండిస్తూ బల్మూరు వెంకట్ కు వ్యతిరేకంగా ఫేస్ బుక్ లో పోస్టులు పెట్టాడు. బల్మూర్ వెంకట్ భార్య హిందూజా గురించి పోస్ట్ పెట్టిన నేపథ్యంలో ఆమె హైదరాబాదులో ఫిర్యాదు చేశారు. పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేసి శ్యాంసుందర్రావు గురించి ఆరా తీశారు. ఈ నేపథ్యంలో



గత పది రోజుల నుండి ఆయన పోలీసులకుచిక్కకుండా తిరుగుతుండగా. .తన తండ్రి ఆరోగ్యం బాగా లేకపోవడంతో మందులు తీసుకుని ఇంటికి వెళ్లిన ఆయనను వల పన్ని పట్టుకున్నట్లు సమాచారం. ఆయనను హైదరాబాద్ తీసుకెళ్లనున్నట్లు తెలిసింది.

కరీంనగర్ మహా పాదయాత్రకు గన్నేరువరం బీజేపీ భారీ ఏర్పాట్లు

వెయ్యి మందికి పైగా తరలింపునకు సన్నాహాలు: తిప్పర్తి నీకేష్

గన్నేరువరం, ప్రభాత వార్త, నవంబర్ 11:

ఈ నెల 18న కరీంనగర్‌లో ఎంపీ బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో నిర్వహించనున్న మహా పాదయాత్రకు గన్నేరువరం మండలం నుంచి వెయ్యి మందికి పైగా తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నీకేష్ తెలిపారు. బుధవారం మండల పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ అసత్య ప్రచారాలను ప్రజాక్షేత్రంలో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు, మహిళా మోర్చా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని



పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల కోఆర్డినేటర్ సుగుర్తి జగదీశ్వరాచారి, సొల్ల అజయ్ వర్మ, ఏలేటి చంద్రారెడ్డి, బొమ్మాడి సురేందర్ రెడ్డి, కాంతాల శ్రీనివాస్ రెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మపురి వార్త

గ్రామ పంచాయతీ సిబ్బందికి రూ.15 లక్షల ప్రమాద బీమా



పెగడపల్లి, ప్రభాతవార్త:

పోస్టాఫీస్ ద్వారా ఆదిత్య బిర్లా జీవిత బీమా సంస్థకు చెందిన రూ.15 లక్షల ప్రమాద బీమా పథకంలో గ్రామ పంచాయతీ సిబ్బందికి బీమా చేయించారు. గ్రామ సర్పంచ్ చిర్ర రజితరమణాకర్ ఆధ్వర్యంలో సిబ్బందికి బీమా ఐడీ కార్డులు, బీమా బాండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎలగందుల విష్ణు, పంచాయతీ కార్యదర్శి చింత లావణ్య, పోస్టుమాన్ లొడ్యా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్ఓ



పెగడపల్లి, ప్రభాతవార్త:

పెగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అరవెల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్ సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షి ంచడంతో పాటు కుష్ఠు వ్యాధి బాధితుడిని పరీక్షించి ఆరోగ్య పరిస్థితిని సమీక్షి ంచారు. ఈ సందర్భంగా ఉపవైద్యాధికారి మాట్లాడుతూ కుష్ఠి వ్యాధి లక్షణాలు ఉన్నచో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నరేష్, అనూష, ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యమధర్మరాజు ఆలయంలో రుద్రాభిషేకం.



ధర్మపురి, ప్రభాతవార్త:

యమద్వితీయ పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీయమధర్మరాజు దేవాలయంలో బుధవారం రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆయుష్యసూక్త అభిషేకం, ఆయుష్య హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి హారతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సూపరింటెండెంట్ అల్వాల శ్రీనివాస్, మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు జక్కు రవీందర్, వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా గోదావరి హారతి



ధర్మపురి, ప్రభాతవార్త:

కార్తీకమాసం సందర్భంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం గోదావరి నది హారతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం నుంచి మహిళా మండళ్ల సభ్యులు, సేవా బృందాల సభ్యులు, అర్చకులు, భక్తులు మేళతాళాలు, హరినామ సంకీర్తనలతో గోదావరి నది వరకు చేరుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి నదిలో దీపాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సూపరింటెండెంట్ అల్వాల శ్రీనివాస్, మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు జక్కు రవీందర్, కౌన్సిలర్ జక్కు పద్మ, శారదా మహిళా మండలి, వాసవి మహిళా మండలి సభ్యులు, వివిధ సేవా బృందాల ప్రతినిధులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు

ర్యాగింగ్‌కు స్వస్తి.. డ్రగ్స్‌కు దూరం

రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా పిలుపు

సిమ్స్‌లో యాంటీ ర్యాగింగ్, మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త: వైద్య విద్యార్థులు క్రమశిక్షణ, మానవతా విలువలు, సేవాభావంతో మెలుగుతూ ర్యాగింగ్, మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సూచించారు. గోదావరిఖనిలోని సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్)లో యాంటీ ర్యాగింగ్, డ్రగ్స్, గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, మాదకద్రవ్యాల వినియోగం, సరఫరాపై చట్టపరమైన నిబంధనలు, శిక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీ మాట్లాడుతూ వైద్య వృత్తి సాధారణ ఉద్యోగం కాదని, ప్రాణాపాయంలో ఉన్నవారికి ప్రాణదాతలుగా నిలిచే పవిత్రమైన, బాధ్యతాయుతమైన వృత్తి అని పేర్కొన్నారు. అందుకే ప్రజలు వైద్యులను ప్రత్యక్ష దైవాలుగా భావిస్తారని తెలిపారు. విద్యార్థులు చదువుకునే దశ నుంచే క్రమశిక్షణ, మానవతా విలువలు, సేవాభావం, పరస్పర గౌరవాన్ని అలవర్చుకోవాలని, మంచి వైద్యులుగా ఎదగడంతోపాటు బాధ్యతాయుతమైన పౌరులుగా సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. గోదావరిఖని ఏసీపీ ఎం. రమేశ్ మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు జూనియర్లకు సహకరిస్తూ సరైన మార్గదర్శకత్వం అందించాలని, వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వేధించకూడదని సూచించారు. కళాశాలలో ప్రతి విద్యార్థి భయం లేకుండా సురక్షిత వాతావరణంలో విద్యను అభ్యసించేలా అందరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా పరస్పరం గౌరవించుకుంటూ, ఒకరికొకరు తోడ్పడాలని తెలిపారు. ప్రపంచంలో దేవుడిని రెండు రూపాల్లో భావిస్తారని, పరలోకంలో ఉండే దేవుడు కనిపించకపోయినా మన కళ్లముందు ప్రత్యక్షంగా కనిపించే దేవుళ్లు వైద్యులని పేర్కొన్నారు. దేవుడు అందరి మేలు కోరుకున్నట్లే వైద్య విద్యార్థులు కూడా సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. సీపీ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ తెల్లని యూనిఫాంలో క్రమశిక్షణతో, హుందాగా కనిపిస్తున్న వైద్య విద్యార్థులను అభినందించారు. ఇందుకు కృషి చేస్తున్న అధ్యాపక బృందం, కళాశాల యాజమాన్యాన్ని ప్రశంసించారు. విద్యార్థి దశలో ఏర్పడే స్నేహాలు, అనుబంధాలు జీవితాంతం గుర్తుంటాయని,



అయితే ర్యాగింగ్ పేరుతో జూనియర్లను అవమానించడం, భయపెట్టడం, వేధించడం, మానసికంగా ఇబ్బందులకు గురిచేయడం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. బీహార్ నుంచి తమిళనాడులోని ఎన్ఐటీ తిరుచ్చిలో విద్యనభ్యసించేందుకు వెళ్లిన తన అనుభవాలను గుర్తుచేసుకుంటూ, అక్కడ యాంటీ ర్యాగింగ్ కమిటీ హెడ్‌గా పనిచేసిన సమయంలో విద్యార్థుల, అధ్యాపకుల సహకారంతో ర్యాగింగ్ లేని సురక్షిత విద్యా వాతావరణాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కళాశాలల్లో ర్యాగింగ్‌ను పూర్తిగా నిర్మూలించి విద్యార్థులందరికీ గౌరవప్రదమైన, భద్రమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది, సీనియర్లు, జూనియర్లందరిపై ఉందన్నారు. డ్రగ్స్ వినియోగం, సరఫరాకు అవకాశం లేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. కొద్దిమంది విద్యార్థుల తప్పిదాల వల్ల మొత్తం కళాశాల పేరు, ప్రతిష్ఠ దెబ్బతినకూడదని, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, నాణ్యమైన విద్య అందుబాటులో ఉన్న సంస్థకు తగినట్లుగా విద్యార్థులు క్రమశిక్షణ, ఉన్నత ప్రమాణాలు పాటించాలని అన్నారు. తల్లిదండ్రులు, అధ్యాపకులు, కళాశాలకు గర్వకారణంగా నిలిచేలా కష్టపడి చదవాలని, వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో మంచి వైద్యులుగా ఎదిగి పేదలు, బలహీన వర్గాలతోపాటు సమాజంలోని ప్రతి ఒక్కరికీ సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హిమబిందు, ప్రిన్సిపాల్ దయాల్ సింగ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రేఖ, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేశ్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, టాస్క్‌ఫోర్స్/నార్కోటిక్ ఎస్ఐ రమేశ్, ఆర్ఎస్ఐ ప్రవీణ్, వన్‌టౌన్ ఎస్ఐలు మనోహర్, రాజశేఖర్, ప్రొఫెసర్లు, హెచ్ఓడీలు, వార్డెన్ డాక్టర్ ఓబులేష్, మెడికోలు, ఇతర పోలీసు అధికారులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయస్థాయి డాడ్జ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మల్యాల ,ప్రభాతవార్త:

మల్యాల క్రాస్ రోడ్డు సమీపంలో గల ఆల్ ఫోర్స్ ఎన్ ఎస్ వి విద్యా సంస్థలకు చెందిన ఐదుగురు విద్యార్థులు వచ్చే డిసెంబర్ 27 నుండి 29 వరకు కాశ్మీర్ లో జరగనున్న జాతీయ స్థాయి డాడ్జ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి తెలిపారు, జగిత్యాల జిల్లా కేంద్రంలో అభ్యాస పాఠశాలలో బుధవారం జరిగిన రాష్ట్రస్థాయి డాడ్జ్ బాల్ పోటీలలో పాఠశాల చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి సంగీత, ధనుశ్రీ, హీమా వర్షిని ,9వ తరగతికి చెందిన రిత్విక్, మల్లికార్జున్ లు పాల్గొనగా, ఈ విద్యార్థులు పోటీలలో తమ అద్భుతమైన ప్రదర్శనతో ప్రతిభను చాటారని, ఈ మేరకు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు,

కాంగ్రెస్ పార్టీలో మరింత బాధ్యత పెరిగింది

టి పి సి సి అధికార ప్రతినిధి మేడిపల్లి సత్యం

చొప్పదండి,ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా అధిష్టానం నియమించడంతో బాధ్యత మరింత నాపై పెరిగిందని చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, అసెంబ్లీ దళిత కమిటీ చైర్మన్, టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పనితనాన్ని గుర్తించి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా నియమించింది. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంతో పాటు, రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ ని పటిష్టపరిచేందుకు తనపై మరింత బాధ్యతను టీపీసీసీ అధికార ప్రతినిధి పదవి పెంచిందని సత్యం పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనముల రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ముందుకు తీసుకు వెళ్లేందుకు, రాబోయే రోజుల్లో పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చేందుకు తన వంతు బాధ్యతగా అలుపెరుగని కృషిని చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి పిలుపును విజయవంతం చేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మనోభావాలను పరిగణలోకి తీసుకొని వారి అభివృద్ధి పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తూ విజయవంతంగా ముందుకు సాగేందుకు తన వంతుగా కృషి చేస్తానని మేడిపల్లి సత్యం పేర్కొన్నారు.



రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జూలపల్లి విద్యార్థులు ఎంపిక

జూలపల్లి,ప్రభాతవార్త: పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం జడ్పీహెచ్ఎస్ బాలికల 10 వ తరగతి విద్యార్థులు మ్యాన సంపత్, నాడెం రాంచరణ్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక అయ్యారని ఈ నెల 13 నుండి 15వరకు నిజామాబాద్ జిల్లా కమ్మరిపల్లి గ్రీన్ ఫీల్డ్ మినీ స్టేడియం లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ఫీజికల్ డైరెక్టర్ చింతకింది శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండెం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థికి ఆటలు శారీరకంగా,మానసికంగా అవసరమని ఓరల్ డెవలప్మెంట్ క్రీడాల ద్వారానే జరుగుతాయని తెలిపారు.అలాగే పాఠశాల లోని ఉపాధ్యాయ బృందం,తల్లిదండ్రులు అభినందించారు.





సీఎం రేవంత్ రెడ్డికి

కొండగట్టు అంజన్న చందనోత్సవ ఆహ్వానం

మల్యాల ,ప్రభాతవార్త;

ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 15 నుండి 20 వరకు జరిగే చందనోత్సవ, మహా సంప్రోక్షణ ఉత్సవాల ఆహ్వాన పత్రికను బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో ఆలయ అధికారులు అర్చకులు అందజేశారు, కార్యక్రమంలో ఆలయ ఈ ఓ ఆంజన రెడ్డి తోపాటు ఆలయ ప్రధాన అర్చకులు , వేద పండితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు,



బాలికల విద్యే సమాజ ప్రగతికి పునాది!



ఆడపిల్ల అక్షరాలు నేర్చుకుంటే తన జీవితాన్నే కాదు.. తన కుటుంబాన్ని, సమాజాన్ని, భవిష్యత్ తరాలను సైతం మార్చగలదు. బాలికలకు విద్యతో పాటు ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం, స్వావలంబన కల్పించినప్పుడే సమాజం నిజమైన అభివృద్ధి సాధిస్తుంది. "ఆడపిల్లను చదివించండి.. ఆమె కలలను సాకారం చేయండి.. రేపటి సమాజానికి నాయకురాలిగా తీర్చిదిద్దండి!" ప్రతి బాలిక చదవాలి.. ప్రతి బాలిక ఎదగాలి.. ప్రతి బాలిక తన కాళ్లపై తాను నిలబడాలి!



ఫోటో: మర్రి రవికుమార్, వార్త - తిమ్మాపూర్

స్వర్గీయ దేశిని చిన్న మల్లయ్య జ్ఞాపకార్థం

ప్రభుత్వ పాఠశాలలకు వస్తువుల వితరణ

చిగురుమామిడి, ప్రభాత వార్త :

చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామం లోని ప్రభుత్వ పాఠశాలలకు స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే దేశిని చిన్న మల్లయ్య బుధవారం 9వ వర్ధంతిని పురస్కరించుకొని మైక్ సెట్, 50 కుర్చీలనువారి యొక్క కుమారులు, తోబుట్టువులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రాథమిక పాఠశాలకు ఫోర్ టేబుల్ ట్రాలీ మైక్ స్పీకర్, లాలయ్యపల్లి పాఠశాలకు 30 కుర్చీలు, సంఘం వాడ బొమ్మనపల్లికి 20 కుర్చీలు బహుకరించుట జరిగింది. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్రమ్ ,రాజేశ్వర్ రెడ్డి, సుజాత ఉపాధ్యాయులు బాల్ రెడ్డి, కిరణ్ రెడ్డి ,అరుణ,జ్యోతి విశ్రాంత



ఉపాధ్యాయులు దేశిని వెంకట రాజయ్య, విద్యార్థినీ, విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు. గతంలో కూడా దేశిని కుటుంబ సభ్యులు ప్రాథమిక పాఠశాల బొమ్మనపల్లికి 20 కుర్చీలు కూడా ఇవ్వడం జరిగింది. భవిష్యత్తు లో పాఠశాలలో ఏమైనా అవసరాలుంటే మా కుటుంబ సభ్యుల యొక్క సహకారంతో పాఠశాల విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తామని విద్యార్థులకు హామీ ఇవ్వడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన వస్తువులు అందజేసిన వారికి మా యొక్క పాఠశాలలు, విద్యార్థుల తరఫున దేశిని వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ సాధన ఉద్యమ మహానేత..

..మాజీ ఎమ్మెల్యే దేశిని చిన్న మల్లయ్య 9వ వర్ధంతి

చిగురుమామిడి, ప్రభాత వార్త

:తెలంగాణ రాజకీయాల్లోనూ, కల్లుగీత కార్మిక ఉద్యమాల్లోనూ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అహర్నిశలు కృషి చేసి, ఉద్యమానికి ఎంతో గుర్తింపు తెచ్చిన మహోన్నత నాయకుడు, మాజీ శాసనసభ్యులు, అమరజీవి కామ్రేడ్ దేశిని చిన్న మల్లయ్య పోరాట స్ఫూర్తితో ముందుకు సాగుతామని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు అన్నారు.బుధవారం వారి స్వగ్రామం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామంలో 9 వ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యకులు వి.వెంకటనర్సయ్య ,సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ సురుగు రాజేష్, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కోహెడ కొమరయ్య, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి తిరుపతి, రాష్ట్ర కమిటీ సభ్యులు పచ్చిమట్ల రవీందర్, చిన్న మల్లయ్య కుమారులుదేశిని విప్లవ కుమార్, లక్ష్మణ్ తో కలిసి వారి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూచిన్న మల్లయ్య కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం, బొమ్మనపల్లి గ్రామంలో 1932లో జన్మించారని, చిన్నతనంలోనే తండ్రి మరణించడంతో కల్లుగీత వృత్తి చేస్తూ జీవనం సాగించాడన్నారు.ఆనాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం లో కొరియర్ గా పనిచేశాడు.1953 లో కమ్యూనిస్టు పార్టీలో చేరి1957 నుండి 78 వరకు సర్పంచ్ గా 21 సంవత్సరాలు,1978 నుండి 94 వరకు వరుసగా నాలుగు సార్లు ఇందుర్తి



పాత నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా పనిచేసిఅందరికీ ఆదర్శంగా నిలిచాడన్నారు.1957 లో ఆవిర్భవించిన కల్లుగీత కార్మిక సంఘములో వారు ప్రధాన పాత్ర వహించారు.హక్కులు మామ్లాలకు, భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో కామ్రేడ్ ధర్మ భిక్షంతో కలిసి పని చేశారు. సొసైటీలు, టి యప్ టి లు ఏర్పాటు, పెన్షన్, ఎక్స్ గ్రేషియా తదితర అనేక హక్కులు సాధించుకోవడంలో వారి కృషి ఎంతో ఉందన్నారు.అసెంబ్లీలో పేద ప్రజలు, గీత కార్మికుల తరఫున తన గళాన్ని విప్పాడు. నాలుగు సార్లు వరుసగా ఎమ్మెల్యేగా గెలిచారు అంటేనే వారు ప్రజల మనిషి అని అర్థం చేసుకోవచ్చు అన్నారు.వారి స్ఫూర్తితో కల్లుగీత కార్మికుల హక్కుల కోసం పోరాడుతామన్నారు.సంఘం గత పది సంవత్సరాల నుండి ఆగస్టు 2 నుండి 18 వరకు అమరుల యాధిలో గీతన్నల చైతన్య యాత్ర నిర్వహిస్తుంది. దీనిలో వీరి యొక్క గొప్పతనాన్ని నేటి తరానికి అందిస్తుంది. ఈ సంవత్సరం బస్సు యాత్ర అత్యంత జయప్రదంగా జరిగింది. వేలాదిమంది గీత కార్మికులు అపూర్వ స్వాగతం పలికారు. సంఘం పోరాట ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ట్యాంకు బండ్ పై పావన్న విగ్రహం ప్రతిష్ఠించింది.ఇంకా ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చిటుమల్ల రవిందర్, సర్పంచ్ లు, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, దేశిని అభిమానులు తదితరులు పాల్గొన్నారు

ఆటో బోల్తా.. మహిళ మృతిమరో ఇద్దరికి గాయాలు

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త:



మెట్‌పల్లి పట్టణంలోని వెల్లుల్ల రోడ్డులో బుధవారం సాయంత్రం జరిగిన ఆటో ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం బండలింగాపూర్ గ్రామానికి చెందిన నాగెల్లి లస్మవ్వ (62) తన కోడలు నాగెల్లి లక్ష్మి (37)తో కలిసి పని నిమిత్తం మెట్‌పల్లికి వచ్చారు. పని ముగించుకొని స్వగ్రామానికి వెళ్లేందుకు మెట్‌పల్లి కొత్త బస్టాండ్ సమీపంలోని బండలింగాపూర్ ఆటో స్టాండ్ వద్ద ఏపీ15వై9795 నంబరు గల ఆటోలో ఎక్కారు. వారితో పాటు అదే గ్రామానికి చెందిన కోరే మల్లు, ముద్దుల చిన్నరాజు తదితరులు కూడా ఆటోలో ప్రయాణిస్తున్నారు.ఈ క్రమంలో సాయంత్రం 4.10 గంటల సమయంలో వెల్లుల్ల రోడ్డులోని దుర్గ వెల్డింగ్ షాప్ సమీపానికి చేరుకోగానే ఆటో డ్రైవర్ మూదం లింగం (50) అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో ఆటో ఒక్కసారిగా అదుపుతప్పి పక్కకు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న లస్మవ్వ రోడ్డుపై పడగా, ఆటో ఆమెపై పడటంతో ముఖం, ఛాతీ భాగంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు.ఆటోలో డ్రైవర్ కుడివైపు కూర్చున్న ముద్దుల చిన్నరాజు, కోరే మల్లు తల, చేతులకు రక్తగాయాలయ్యాయి. మృతురాలి కోడలు నాగెల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మెట్‌పల్లి ఎస్ ఐ కిరణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

53 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేయాలి

సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలి: తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జారతి నర్సయ్య

గన్నేరువరం, ప్రభాతవార్త, నవంబర్ 11:



తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గన్నేరువరం మండలంలోని రంగనాయకపల్లి, గుణుకుల కొండాపూర్, జంగపల్లి, హనుమాజిపల్లి, మైలారం, ఖాసీంపేట, పారువెల్ల, గన్నేరువరం తదితర పాఠశాలల్లో ఉపాధ్యాయులు పెద్దఎత్తున సభ్యత్వం స్వీకరించారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జారతి నర్సయ్య మాట్లాడుతూ.. 53 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేయాలని, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో 25 సవరించి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని, కేజీబీవీ సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వడ్ల కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలి.

రైతులను దళారుల నుంచి కాపాడాలి: సీపీఐ నాయకుల డిమాండ్

గన్నేరువరం, ప్రభాత వార్త, నవంబర్ 11



:మండలవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఇప్పటికే వరి కోతలు ప్రారంభమై ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తున్నప్పటికీ, కేంద్రాలు పూర్తిస్థాయిలో ప్రారంభం కాకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇదే అదునుగా దళారులు రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దళారులు అనుసరిస్తున్న తూకం విధానాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ప్రభుత్వం వెంటనే స్పందించి మండలంలోని అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కాంతాల అంజిరెడ్డి, మండల కార్యదర్శి చొక్కాల శ్రీశైలం, సహాయ కార్యదర్శి కూన మల్లయ్య, గన్నేరువరం గ్రామ కార్యదర్శి బోయిని మల్లయ్య, మండల నాయకులు ఎండీ నయీమ్, బుట్ల భాస్కర్, రాపోలు రాజమల్లు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్ మండలంలో అంగన్‌వాడీ పోస్టుల తాత్కాలిక జాబితా విడుదల

అభ్యంతరాలకు ఈ నెల 16 వరకు అవకాశం: ఐసీడీఎస్ అధికారులు

తిమ్మాపూర్, ప్రభాత వార్త నవంబర్ 11

:తిమ్మాపూర్ మండల పరిధిలోని మన్నెంపల్లి (1), మొగిలిపాలెం (1), అల్గునూర్ (4) గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించి అందిన దరఖాస్తుల పరిశీలన పూర్తయినట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థులు సమర్పించిన ధ్రువపత్రాలు, అర్హత ప్రమాణాల ఆధారంగా రూపొందించిన అర్హుల, అనర్హుల తాత్కాలిక జాబితాలను సంబంధిత గ్రామాల పంచాయతీ నోటీస్ బోర్డులలో ప్రదర్శించినట్లు వెల్లడించారు.ఈ జాబితాలపై అభ్యర్థులకు ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా, సరియైన ఆధారాలతో కూడిన వినతులను సమర్పించవచ్చని అధికారు తెలిపారు. నోటీస్ బోర్డులో జాబితా ప్రదర్శించిన తేదీ (11/11/2026) నుండి 6 రోజులలోగా, అంటే ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5:00 గంటలలోపు కరీంనగర్ రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ (దిదీశివీ) కార్యాలయంలో నేరుగా అందజేయాలని సూచించారు. నిర్ణీత గడువు దాటిన తర్వాత వచ్చిన అభ్యంతరాలను పరిశీలించబోమని అధికారులు స్పష్టం చేశారు.

ఇంటి పైభాగం నుంచి ప్రవేశించి బంగారు ఆభరణాల చోరీ

బోయిన్ పల్లి ప్రభాత వార్త బోయినపల్లి మండలంలోని కోరెం గ్రామానికి చెందిన వెంకటరమణ (43) ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది.ఫిర్యాదుదారుడు తెలిపిన వివరాల ప్రకారం, ఈ నెల 08112026 రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లి, 10112026 ఉదయం సుమారు 8 గంటలకు తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించారు.గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి పైభాగం నుంచి ఇంట్లోకి ప్రవేశించి, బీరువాలో భద్రపరిచిన బంగారు ఆభరణాలను అపహరించినట్లు బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నారు.చోరీకి గురైన వస్తువుల వివరాలు సుమారు 12 గ్రాముల బంగారు చైన్.సుమారు 5.5 గ్రాముల బంగారు ఉంగరం సుమారు 3.6 గ్రాముల బంగారు చైన్.ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి, నిందితులను గుర్తించడంతో పాటు చోరీకి గురైన ఆభరణాలను స్వాధీనం చేసుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.ఈ సందర్భంగా ప్రజలు తమ ఇళ్లను వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో ఇంటి భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఇంటి పైభాగాలు, కిటికీలు, తలుపుల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని బోయినపల్లి పోలీసులు సూచించారు.

ఎస్ ఐ ఆర్‌పై కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం

కరీంనగర్లో తలపెట్టిన మహా పాదయాత్రను విజయవంతం చేయండి

.బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జ శ్రీనివాసరావు

తిమ్మాపూర్ ప్రభాత వార్త

:ఓటరు సమగ్ర సవరణ జాబితా (ఎస్ ఐ ఆర్)పై కాంగ్రెస్‌తో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.బుధవారం తిమ్మాపూర్ మండలం నల్లొండ గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు చింతం శ్రీనివాస్ అధ్యక్షతన బీజేపీ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గుజ్జ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎస్ఎస్ఆర్ విషయంలో కాంగ్రెస్ పార్టీ అనవసర రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు.దశాబ్దాల పాటు దేశాన్ని ఏలిన కాంగ్రెస్ పార్టీ, బీజేపీని రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేక విదేశీ శక్తులతో చేతులు కలిపి పనికిమాలిన రాజకీయాలు చేస్తోందని శ్రీనివాసరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.దేశవ్యాప్తంగా ప్రజా విశ్వాసాన్ని కోల్పోయితుదుమపెట్టుకుపోయిన కాంగ్రెస్, దిక్కుతోచని స్థితిలోనే బీజేపీపై చిల్లర రాజకీయాలతో బురదజల్లే కుట్రలు చేస్తోందన్నారు. దేశంలో అశాంతిని రేకెత్తించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు చూస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ చేస్తున్న కుట్రలకు బుద్ధి చెప్పేందుకే ప్రజలు, యువత భాగస్వామ్యంతో కరీంనగర్‌లో ఈ మహా పాదయాత్రను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని, పార్టీ శ్రేణులంతా కష్టపడి కార్యక్రమాన్ని గ్రాండ్ సక్సెస్ చేయాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి పడరాని పాట్లు పడుతుందనిబీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర ఎద్దేవా చేశారు .దేశంలో ప్రజా విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ కి మనుగడ కష్టంగా మారిందని, అందుకే ప్రజల దృష్టిని మరలించడానికి రకరకాల డ్రామాలు ఆడుతోందన్నారు. కాంగ్రెస్ పనికిమాలిన రాజకీయాలు ప్రజలు గ్రహిస్తున్నారని , రాబోయే కాలంలో ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్కు తీవ్ర గుణపాఠం తప్పదని హెచ్చరించారు.ఈ సమావేశంలో బిజెపిజిల్లా కార్యవర్గ సభ్యులు.ముప్పరపు సంపత్ , బూట్ల శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి గొట్టె ముక్కుల తిరుపతి రెడ్డి, వేల్పుల ఓదేలు యాదవ్ , బొనాల మోహన్, కొయ్యడ శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి శేఖర్ , ఎర్రోజు లక్ష్మణ్ రాజేష్, ఎ. స్వామి శ్రీను, జూడి రాజు మహేందర్ రెడ్డి, రవికుమార్ ప్రణయ్, సుగుణాకర్, అజయ్ ,నరేష్, కామెరా వెంకటేష్, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు చెమటకు విలువేదీ..?

పది రోజుల్లో పత్తి, సన్నవడ్ల ధరలకు భారీ కోత.. కిలో బియ్యం రూ.98

వేములవాడ రూరల్ ప్రభాత వార్త

సీజన్ ప్రారంభంలో పంటలకు మంచి ధరలు చెల్లించి రైతుల్లో ఆశలు రేకెత్తించిన వ్యాపారులు, ధాన్యం మార్కెట్‌కు చేరుకోవడం ప్రారంభం కాగానే ధరలను ఒక్కసారిగా తగ్గిస్తున్నారు. పది రోజుల వ్యవధిలోనే పత్తి క్వింటాల్ ధరపై వెయ్యి రూపాయలకు పైగా కోత పడగా, మొన్నటివరకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు పలికిన సన్నవడ్ల ధర ప్రస్తుతం కొన్నిచోట్ల రూ.2,500కు పడిపోయింది. మరోవైపు వడ్ల ధరలు తగ్గుతున్నా సన్నబియ్యం ధరలు మాత్రం కిలోకు రూ.90 నుంచి రూ.98 వరకు కొనసాగుతున్నాయి. దీంతో మిల్లర్లు, వ్యాపారుల ధరల వ్యూహంలో అటు రైతులు, ఇటు సామాన్య వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.పత్తి ధరలకు భారీ కో202627 వానాకాలం సీజన్‌కు కేంద్ర ప్రభుత్వం పత్తికి క్వింటాల్‌కు రూ.8,667 కనీస మద్దతు ధర ప్రకటించింది. సీజన్ ప్రారంభంలో పలు మార్కెట్లలో వ్యాపారులు రూ.9 వేల నుంచి రూ.10 వేల వరకు చెల్లించడంతో రైతులు ఈసారి మంచి ఆదాయం వస్తుందని ఆశించారు. అయితే కేవలం పది రోజుల్లోనే పరిస్థితి మారిపోయింది. ప్రస్తుతం పలు మార్కెట్లలో క్వింటాల్ పత్తి ధర రూ.7,300 నుంచి రూ.8,500 మధ్యే పలుకుతోంది. నాణ్యత, తేమ శాతం పేరుతో ధరల్లో కోత విధిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి దిగుమతులపై కేంద్రం కస్టమ్స్ సుంకం మినహాయింపును డిసెంబర్ 31 వరకు పొడిగించడంతో విదేశీ పత్తి దిగుమతులు పెరిగి దేశీయ మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సీసీఐ కొనుగోలు కేంద్రాలపై రైతులు ఆశలు పెట్టుకున్నారు.సన్నవడ్ల ధరలకు రెక్కలు విరిచారుసీజన్ ప్రారంభంలో సన్నవడ్లకు క్వింటాల్‌కు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు ధర పలకడంతో రైతులు సంతోషించారు. అయితే ధాన్యం చేతికొచ్చి మార్కెట్‌కు చేరుతున్న సమయంలో ధరలు ఒక్కసారిగా పడిపోతున్నాయి. ప్రస్తుతం



పలు ప్రాంతాల్లో సన్నవడ్లను రూ.2,900 నుంచి రూ.3,200కే కొనుగోలు చేస్తుండగా, కొన్నిచోట్ల రూ.2,500కే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మిల్లర్లు, వ్యాపారులు ముందుగానే గ్రామాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసి, అడ్వాన్సులు ఇచ్చి పొలాల వద్దే ధాన్యం కొనుగోలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎల్‌నినో ప్రభావంతో దిగుబడి తగ్గుతుందనే ప్రచారం, సన్నబియ్యం కొరత భయాలను ఆసరాగా చేసుకుని బియ్యం నిల్వలను అధిక ధరలకు విక్రయించారనే విమర్శలు వినిపిస్తున్నాయి.వడ్ల ధర తగ్గినా.. బియ్యం ధర తగ్గదా?వినియోగదారులకు ప్రధానంగా ఆందోళన కలిగిస్తున్న అంశం బియ్యం ధరలే. బియ్యానికి ముడిసరుకైన వడ్ల ధరలు గణనీయంగా తగ్గుతున్నప్పటికీ, సన్నబియ్యం ధరలు మాత్రం తగ్గడం లేదు. రకాన్ని బట్టి కిలో రూ.90 నుంచి రూ.98 వరకు విక్రయిస్తున్నారు. వడ్ల ధరలు పెరిగినప్పుడు బియ్యం ధరలను వెంటనే పెంచే వ్యాపారులు, ఇప్పుడు వడ్ల ధరలు తగ్గినా వినియోగదారులకు ఆ ఊరట ఎందుకు కల్పించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.సిండికేట్‌పై చర్యలు తీసుకోవాలిపత్తి, సన్నవడ్ల ధరలు ఒక్కసారిగా తగ్గడం, బియ్యం ధరలు మాత్రం యథాతథంగా కొనసాగడం వెనుక వ్యాపారులు, మిల్లర్ల కుమ్మక్కు ఉందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మార్కెట్‌లో ధరల నియంత్రణపై అధికారులు దృష్టి సారించాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు వినియోగదారులకు సరసమైన ధరలకు బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

కులాలు మతాల పేరుతో ప్రజలను విభజిస్తూ పాలకులు పాలన చేస్తున్నారు

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క
నంది కమాన్ వద్ద ఉన్న రంగవల్లి విజ్ఞాన కేంద్రం రెండో వార్షికోత్సవ కార్యక్రమం

వేములవాడ టౌన్, ప్రభాతవార్త

దేశంలో కులాలు మతాల పేరుతో ప్రజలను విభజిస్తూ పాలకులు పాలన చేస్తున్నారని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క అన్నారు. వేములవాడ నంది కమాన్ వద్ద ఉన్న రంగవల్లి విజ్ఞాన కేంద్రం రెండో వార్షికోత్సవము, కామ్రేడ్ రంగవల్లి 27 వ వర్ధంతి ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ.. ఏట నవంబర్ మాసంలో అమరుల త్యాగాలను స్మరిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో జెన్జీలు లేవనెత్తిన సమస్యలను ప్రజలు ఆలోచించాల్సిన బాధ్యత ఉందన్నారు. దేశంలో పర్యావరణం మొత్తం దెబ్బతింటుందని



తెలియని ఎలినో ప్రభావంతో రైతాంగం సంక్షేమంలో ఉందన్నారు ప్రకృతి వైపరీత్యాలపై నెట్టివేయడం కాకుండా పాలకుల తప్పిదం ఎంత ఉంది మానవ తప్పిదం ఎంత ఉంది అనే దానిపై సమీక్ష నిర్వహించాలన్నారు. అమరుల త్యాగాలను గుర్తిస్తూ ఐక్య ఉద్యమాలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అమరవీరుల కుటుంబ సభ్యులు, అరుణోదయ కళాకారులు, తదితరులు పాల్గొన్నారు

గిరిజన తండాలకు రహదారి సౌకర్యం కల్పించడమే లక్ష్యం

రుద్రంగి అభివృద్ధి పనులకు రూ.7.07 కోట్లతో శంకుస్థాపన.
మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్.

రుద్రంగి ప్రభాత వార్త

:వేములవాడ నియోజకవర్గంలోని గిరిజన తండాలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గం రుద్రంగి మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా మొత్తం రూ.7.07 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.రుద్రంగి మెయిన్ రోడ్డు నుంచి కుక్కలగండి తండా వరకు రూ.4.57 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులకు, మరో రూ.2.50 కోట్లతో బీటీ రోడ్డు, హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం కోసం గిరిజన శాఖ ద్వారా సుమారు రూ.740 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. వేములవాడ నియోజకవర్గంలోని గిరిజన తండాలకు రహదారి కనెక్టివిటీ కల్పించేందుకు సుమారు రూ.100 కోట్ల నిధులు కేటాయించే దిశగా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా తొలివిడతలో సుమారు రూ.40 కోట్లతో వివిధ గ్రామాలు, గిరిజన తండాల్లో రోడ్ల నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసినట్లు అన్నారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించాలనే లక్ష్య ంతో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా



ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ఎస్సీ గురుకులాలు, హాస్టళ్ల అభివృద్ధికి కూడా ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని అన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నియోజకవర్గంలో ఇప్పటికే 3,500 కుటుంబాలకు ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని, మరో 2,000 ఇళ్ల మంజూరుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. అర్హులకు కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.మహిళా సంఘాల ద్వారా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్య మని తెలిపారు. గిరిజనులు, ఎస్సీలు, బీసీలు, మైనారిటీలకు విద్య, ఉపాధి, మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.వేములవాడ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, ఆయన సూచనల మేరకు గిరిజన తండాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు నిధులు కేటాయిస్తూ పనులు చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గండినారాయణ, ఏఎంసి చైర్మన్ చెలుకల తిరుపతి, ఎంపీడీవో నటరాజ్, తాసిల్దార్ పుష్పలత, ఉపసర్పంచ్ మాడిశెట్టి అభిలాష్, పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్.

ప్రభాత వార్త కోనరావుపేట



పల్లెలు, గిరిజన తండాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, భూక్య రెడ్డి తండా గ్రామంలో గిరిజన ప్రత్యేక నిధుల ద్వారా కోటి రూపాయల సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశానని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. బుధవారం మండలం లోని భూక్య రెడ్డి తండా గ్రామంలో వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ ఆది శ్రీనివాస్ నియోజకవర్గంలోని భూక్య రెడ్డి తండా సర్పంచ్ బానోత్ నరేష్ నాయక్ ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి కోటి రూపాయల నిధులతో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ తో కలిసి శంకుస్థాపన చేశారని లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గిరిజన తండాలు పల్లెల అభివృద్ధికి అన్ని విధాల సహకారం చేస్తుందని మారుమూల మండలమైన కోనరావుపేట మండలంలోని చిన్న గ్రామపంచాయతీ అయిన భూక్య రెడ్డి తండాలో ఒక సిసి రోడ్డు నిర్మాణానికే కోటి రూపాయల నిధులు ఎస్సీ ఎస్టీ స్పెషల్ ఫండ్ కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించడమే రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు నిదర్శనం అని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సుమారు మూడు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలోని పేదల బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సంక్షేమం కోసం కోట నదులు కేటాయించి సొంతింటి కలను ఇంటిలోని గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్ మా లక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణము చదువుకునే పేద గిరిజన షెడ్యూల్ క్యాస్ట్ విద్యార్థులకు ఫీజుల్లో రాయితీ వంటి అనేక పనులు చేస్తున్నారని లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వరలక్ష్మి మార్కెట్ కమిటీ, పాక్స్ చైర్మన్ లు, అన్ని గ్రామాల సర్పంచులు రాజకీయ నాయకులు మహిళలు ప్రజలు పాల్గొన్నారు

వట్టి మల్ల లో మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ



.ప్రభాత వార్త కోనరావుపేట

ప్రజా సౌకర్యాల కల్పనలో భాగంగా వట్టిమల్ల గ్రామ పంచాయతీ ఆవరణలోని మార్కెట్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న పబ్లిక్ టాయిలెట్ నిర్మాణ పనులకు శుక్రవారం భూమిపూజ నిర్వహించారు.మార్కెట్‌కు వచ్చే వ్యాపారులు రైతులు, మహిళలు గ్రామ ప్రజలకు మెరుగైన పారిశుధ్య సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుండా వెంకటేష్ గౌడ్, ఉప సర్పంచ్ గంగారం సంపత్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ యువకులు గణేష్, శేషు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా మత్స్యకార మహాత్మ 11వ జయంతి వేడుకలు



బోయిన్ పల్లి ప్రభాత వార్త

మత్స్యకార మహాత్మ 108వ జయంతి వేడుకల ను మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మోసం అంజయ్య ఉపాధ్యక్షులు పెద్దపల్లి సత్యనారాయణ దేశబోయిన శంకర్ పెద్దపెల్లి నరేందర్ బేతి ధర్మయ్య లక్ష్మీనారాయణ జితేందర్ కనకరాజు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మాసం కార్తికం

పవిత్ర మాసం కార్తిక మాసము

కార్తికమాస విశిష్టత మాసాల్లో కార్తికం

, మంథని ప్రభాతవార్త:



యుగాల్లో కృతయుగం, శాస్త్రాల్లో వేదం, తీర్థాల్లో గంగనది అత్యుత్తమమైనవిగా స్కంద పురాణం ద్వారా తెలుపబడింది. కార్తికమాసంలో ప్రతి ప్రవాహమూ గంగానదిగా మారిపోతుంది. ఈ నెలలో హరికీర్తన ఆలపించినా, శివనామాన్ని జపించినా వేదమంత్రాలను పఠించినంత పుణ్యం ఫలం లభిస్తుంది. పేరుకు కలియుగమే అయినా, ఈ సమయంలో కృతయుగం నాటి ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తుంది. దీప ప్రజ్వలనలూ, దీపోత్సవములు, దీప దానాలతో కళకళలాడే మాసం కార్తికం. నవంబరు 10 నుంచి డిసెంబర్ 8 వరకు పున్నమి రోజుల్లో ఆకాశమే ప్రమిదగా పరమాత్మ వెలిగించిన వెన్నెల దీపంలా కనిపిస్తాడు చంద్రుడు. పూజలతో, ఉపవాసాలతో, ఆధ్యాత్మిక చింతనలతో హృదయ దీపాన్ని వెలిగించుకునే అవకాశాన్నీ ఇస్తుంది కార్తికమాసం. దీపావళి పండుగను అందరూ ఆనందంగా జరుపుకొన్న తర్వాత ఆధ్యాత్మికత ఉట్టిపడే కార్తిక మాసంలోకి అడుగు పెడతాం. తెలుగు పంచాంగం ప్రకారం ఒక ఏడాదిలో వచ్చే అన్ని మాసాలలోకెల్లా కార్తిక మాసం అత్యంత పవిత్రమైనది. ఇటు శివునికి, అటు విష్ణువుకు కూడా ప్రీతికరమైన కార్తిక మాసం ఆధ్యాత్మిక సాధకులకు మోక్ష మార్గం. హిందూ సంప్రదాయం ప్రకారం సనాతన ధర్మాన్ని అనుసరించి ఒక ఏడాదిని రెండు ఆయనములుగా విభజిస్తారు. అందులో మొదటిది ఉత్తరాయణం, రెండోది దక్షిణాయనం. ఉత్తరాయణంలో మాఘ మాసానికి ఎంతటి విశిష్టత ఉందో, దక్షిణాయనంలో కార్తిక మాసానికి అంతే విశిష్టత ఉంది. ఈ పవిత్ర కార్తిక మాసం హరిహరులకు ప్రీతికరమైనది. కార్తిక మాసంలో చేసే శివారాధనకు విశేష పుణ్యఫలం లభిస్తుందని కార్తీక పురాణం చెబుతోంది. కార్తీక మాసంలో నదీ స్నానానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. రుషులు, మహర్షులు, సిద్ధులు కార్తిక మాసం నెల రోజులు పవిత్ర నదీ తీరాల్లో సంచరిస్తూ ఈ మాసమంతా కార్తిక స్నానం ఆచరిస్తుంటారు. కార్తిక మాసంలో గంగ, యమునా, గోదావరి, కావేరి, కృష్ణ వంటి పుణ్య నదుల్లోనే కాకుండా చెరువులు, నీటికుంటలు, సముద్రాల్లో కూడా స్నానమాచరించవచ్చునని స్కంద పురాణంలో తెలుపబడింది. సంపాదించినా ధనానికి కానీ పుణ్యానికి కానీ దానంతోనే సార్థకత చేకూరుతుందని స్కంద పురాణం వివరిస్తోంది. కార్తిక మాసంలో చేసే దానాలకు మామూలు కన్నా కోటిరెట్ల అధిక ఫలం లభిస్తుంది. ఈ మాసంలో దీపదానం, సాలగ్రామ దానం, అన్నదానం, వస్త్రదానం, గోదానం, భూదానం వంటి దానాలతో ఇటు ఇహలోకంలో, అటు పర లోకంలో కూడా తరించవచ్చని శాస్త్రాలు చెబుతున్నాయి. ముఖ్యంగా కార్తీక మాసంలో కన్యాదానం చేస్తే అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలు తరిస్తాయని, గతించిన పూర్వీకులకు సద్గతులు కలుగుతాయని కార్తిక పురాణం చెబుతోంది. కార్తీక మాసమంతా నక్తం పేరుతో ఉపవాసాలు ఆచరిస్తుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆహారం తీసుకోకుండా, దైవారాధనలోనే మనసును లగ్నం చేసి సాయంత్రం నక్షత్ర దర్శనం తరువాత భోజనం చేయడాన్ని నక్తం అంటారు. ఇలా కార్తిక మాసంలో ఉపవాసాలు ఆచరించడం వలన దైవానుగ్రహంతో శుభాలు చేకూరుతాయి. అలాగే ఉపవాసాల వలన మంచి ఆరోగ్యం కూడా సమకూరుతుంది.బలిపాడ్యమితో కార్తికమాసంలో ఉత్సవాల పరంపర మొదలవుతుంది. మొదటి రోజు నుంచీ సంధ్యా దీపాలు వెలిగిస్తారు. దీనివల్ల లక్ష్మీకటాక్షం లభిస్తుందని పద్మపురాణం చెబుతోంది. పరమాత్మకు మూడడుగుల నేలనిచ్చి, ముక్తిని పొందిన బలి చక్రవర్తిని స్మరిస్తూ దీపదానాలు చేయడం ప్రాచీన సంప్రదాయం. మరుసటి రోజున 'భగినీ హస్త భోజనం'. దీన్నే 'భాతృ విదియ', 'యమ ద్వితీయ' అని అంటారు. యముడు తన సోదరి యమున ఇంటికి విందు భోజనానికి వెళ్లిన రోజు. కార్తిక విదియరోజున సోదరీమణుల ఇంట భోజనం చేసినవారికి అపమృత్యు భయాలు తొలగిపోతాయని యమధర్మరాజు వరమిచ్చినట్టు పురాణాల్లో పేర్కొనబడింది. చాలా ప్రాంతాల్లో కార్తికశుద్ధ చవితి 'నాగుల చవితి'గానూ సుప్రసిద్ధం. పడగ తొక్కితే పారిపోయి నడుము తొక్కితే నావాళ్లనుకుని తోక తొక్కితే తొలగిపోయి కాచి రక్షించు తండ్రి నాగేంద్రుడా ఫణీంద్రుడా అంటూ పాముపుట్టలో పాలుపోసి భయభక్తులతో పాడుకుంటారు. సత్యయుగంలో ఉగాది కార్తికంలోనే వచ్చేదని అంటారు. కాబట్టే, కార్తిక శుద్ధ నవమిని 'కృత యుగాది'గా పరిగణిస్తారు. అలాగే కార్తిక శుద్ధ ఏకాదశిని 'ఉత్థాన ఏకాదశి'గా వ్యవహరిస్తారు. ఆషాఢ శుద్ధ ఏకాదశిరోజున యోగనిద్రకు ఉపక్రమించిన విష్ణుమూర్తి మళ్లీ ఇప్పుడు మేల్కొంటాడు. మరుసటి రోజు 'మథన ద్వాదశి'. క్షీరసాగర మథనం జరిగిన రోజు. తెలుగువాళ్లు దీన్ని 'చిలుకు ద్వాదశి'గా పిలుచుకుంటారు. ఇది 'క్షీరాబ్ధి ద్వాదశి'. పాలకడలిలో శేషతల్పమున పవళించిన స్వామి సకల దేవతలతో కలిసి తులసీ బృందావనానికి వచ్చిన శుభదినం. ఈనెలలో బిల్వ పత్రాలతో శివపూజ, తులసీ దళాలతో విష్ణుపూజ విశేషమైన ఫలితాలను ఇస్తాయని కార్తిక పురాణం ఘోషిస్తోంది. ఈ సంప్రదాయం వృశ్చిక మాసం ఈ సమయంలో జఠరాగ్ని మందంగా ఉంటుంది. ఉసిరి ఈ మాసపు ఫలం. కార్తికంలో ఉసిరి చెట్టుకు పూజలు చేస్తారు, ఉసిరి చెట్టు నీడలోనే వనభోజనాలు చేస్తారు. ఉసిరికాయ దీపాలు వెలిగిస్తారు. పోషకాల సిరి అయిన ఉసిరిని వంటకాల్లోనూ విరివిగా వాడతారు. ఇది వెన్నెల నెల. కౌముదీ మాసమనీ పిలుస్తారు. శరత్‌చంద్రిక మనసుకు మహదానందాన్ని ప్రసాదిస్తుంది. కార్తిక పౌర్ణమిని త్రిపురాసుర సంహారం జరిగిన రోజుగానూ భావిస్తారు. అలా, 'త్రిపురి పూర్ణిమ' అనే పేరు వచ్చింది. శివాలయాల్లో జ్వాలాతోరణాలు వెలిగించడం తరాల తరాల సంప్రదాయం. అసుర సంహారం చేసి వచ్చిన శివుడికి దిష్టి తీయడమే జ్వాలాతోరణ ఉద్దేశమని చెబుతారు. కొన్ని ప్రాంతాల్లో దీన్ని వీరుల పౌర్ణమి వ్యవహరిస్తారు.ఓ వైపు ఖిహర హర శంకరఖి అంటూ అభిషేకాలతో శివాలయాలు మారు మ్రోగుతుంటే, మరో వైపు శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలతో, ఏకాదశి ఉపవాసాలతో విష్ణు సహస్రనామ పారాయణలతో భూలోకం వైకుంఠాన్ని తలపించేలా ఉండే ఈ కార్తిక మాసం మోక్షదాయకం. ఇంతటి మహిమాన్వితమైన కార్తిక మాసంలో భక్తి శ్రద్ధలతో హరిహరాదులు ఆరాధిస్తూ, నియమ నిష్టలతో ఉపవాసాలు, నదీ స్నానాలు, దీపారాధన, దానధర్మాలు చేస్తూ ఇహంలో సకల భోగభాగ్యాలను అనుభవించి, జన్మరాహిత్యాన్ని పొందవచ్చునని కార్తిక పురాణంలో సూత మహాముని వివరించారు. మంగళవారం నుంచి కార్తిక మాసం ప్రారంభం కానున్న సందర్భంగా మనం కూడా ఈ కార్తిక మాసంలో హరి హరాదులను యధాశక్తి పూజిద్దాం. జన్మ రాహిత్యాన్ని పొందుదాం.

నాటు సారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

5 లీటర్ల నాటు సారా స్వాధీనం.. విలువ రూ.2 వేలు

సారంగాపూర్ ప్రభాత వార్త:



మండలంలోని వడ్డెర కాలనీలో అక్రమంగా నాటు సారా తయారు చేసి విక్రయిస్తున్న మహిళను సారంగాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె ఇంటి నుంచి 5 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.2 వేలుగా పోలీసులు అంచనా వేశారు.పోలీసుల వివరాల ప్రకారం.. వడ్డెర కాలనీలో నాటు సారా తయారు చేసి విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం మండల ఎస్ఐ పి. గీత తన సిబ్బందితో కలిసి గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన గుర్రం చిన్న లక్ష్మి (54) ఇంట్లో తనిఖీ చేయగా నాటు సారా లభించింది.పంచుల సమక్షంలో విచారణ చేపట్టగా, గత కొన్ని సంవత్సరాలుగా గ్రామస్తులకు అక్రమంగా నాటు సారా విక్రయిస్తున్నట్లు ఆమె వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. దీంతో 5 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, మహిళను అదుపులోకి తీసుకున్నారు.అక్రమ నాటు సారా తయారీ, విక్రయాలు, నిల్వ చేయడం, కొనుగోలు చేయడం చట్టరీత్యా నేరమని సారంగాపూర్ పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

జగిత్యాల పురపాలక సంఘం రిజర్వేషన్ల వారీగా 28 షాపుల ఖరారు

జగిత్యాల టౌన్,ప్రభాత వార్త



..జగిత్యాల పురపాలక సంఘం పరిధిలో వేలం ద్వారా కేటాయించనున్న 28 షాపులకు సంబంధించి, ప్రభుత్వ నిబంధనలు మరియు రిజర్వేషన్ మార్గదర్శకాల ప్రకారం షాపుల కేటగిరీలను నిర్ణయించేందుకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో డ్రా నిర్వహించారు. ఈ డ్రా ద్వారా ఎస్సీ కేటగిరీకి 4 షాపులు నంబర్లు 5/1, 7, 57, 4,ఎస్టీ కేటగిరీకి 1 షాపు నంబర్ 47, దివ్యాంగులకు 1 షాపు నంబర్ 31, నాయీ బ్రాహ్మణులు మరియు రజకులకు 1 షాపు నంబర్ 38, టీఎల్ఎఫ్ కు 3 షాపులు నంబర్లు 50, 52, 58 కేటాయించగా, మిగిలిన 18 షాపులను జనరల్ కేటగిరీ కింద ఖరారు చేశారు. మొత్తం 28 షాపులకు రిజర్వేషన్ల వారీగా కేటాయింపులు పూర్తయ్యాయని,తదుపరి వేలం ప్రక్రియను ప్రభుత్వ నిబంధనలు మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

త్రాగునీటి ఎద్దడి నివారణకై ప్రత్యేక చర్యలు చేపట్టాలి

ఎంపీడీవో శైలజ రాణి

రామగిరి ప్రభాతవార్త



ఎల్ నినో ప్రభావంతో రానున్న రోజుల్లో గ్రామాలలో నీటి ఎద్దడి నివారణకై ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీవో బద్రి శైలజా రాణి అన్నారు. బుధవారం రామగిరిమండల ప్రజా పరిషత్ కార్యాలయం లో "ఎల్ నినో " ప్రభావం ద్రుష్ట్యా గ్రామాలలో త్రాగు నీటి సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగత్తలు, నీటి ఎద్దడినికి నివారణ ప్రణాళిక పై మండల స్థాయిలో సర్పంచ్ లు మరియు పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మరియు భూగర్భ జలాల తగ్గుదల నేపథ్యంలో రాబోయే రోజుల్లో గ్రామాలలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు అధికారులు మరియు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నీటి పొదుపు మరియు సంరక్షణ చర్యలను తక్షణమే అమలు చేయడం ద్వారా నీటి కొరతను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని సూచించారు. ముఖ్యంగా వర్షం నీటి సంరక్షణ ప్రతి ఇంటి ఆవరణలో మరియు ప్రభుత్వ కార్యాలలో ఇంకుడు గుంతలు నిర్మించడం ద్వారా భూగర్భ జలాలు పెంపొందించుకోవచ్చని, అలాగే త్రాగునీటి వృధా అరికట్టేందుకు కుళాయిల లీకేజీలను తక్షణమే మరమ్మత్తులు చేయించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా నీటిని పొదుపు చేసినప్పుడే భావితరాలకు నీటి భద్రత కల్పించవచ్చని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డి ఈ ఈ రాజకుమార్, ఖలీల్, ఎంపీ ఓ సమ్మిరెడ్డి, మధు, సాయి కృష్ణ, తో పాటు ఆయా గ్రామ సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నీటి పొదుపే లక్ష్యం.. ఆరుతడి పంటలే మార్గం!

.. సాగు విధానంలో మార్పులతోనే రైతులకు లాభాలు

. నీటి ఆదాతో కూడిన పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి.. కేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్

కొడిమ్యాల, ప్రభాతవార్త:



యాసంగి సాగులో భూగర్భ జలాల లభ్యత తగ్గుతున్న నేపథ్యంలో రైతులు నీటి వినియోగాన్ని తగ్గించే ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి వి. భాస్కర్ సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కొడిమ్యాల మండలం డబ్బు తిమ్మాయిపల్లి గ్రామంలో బుధవారం మండల వ్యవసాయ అధికారి పి. జ్యోతి ఆధ్వర్యంలో కేత్ బచావో అభియాన్ (సాగు పొలాల సంరక్షణ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ మాట్లాడుతూ ఏలినినో ప్రభావం అధికంగా ఉన్న నేపథ్యంలో పంటలను కాపాడుకునేందుకు రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యాసంగిలో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగుతున్నందున వరి సాగుకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, పెసర, మినుములు, శనగలు, నువ్వులు వంటి ఆరుతడి, నూనెగింజల పంటలను సాగు చేయాలని కోరారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ తక్కువ నీటితో పండే పంటలకే ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. వరి కోతల అనంతరం పంట అవశేషాలను పొలాల్లో కాల్చడం వల్ల నేలలోని సేంద్రియ పదార్థాలు దెబ్బతినడంతో పాటు పర్యావరణ కాలుష్యం పెరుగుతుందని పేర్కొన్నారు. పంట వ్యర్థాలను పశుగ్రాసంగా వినియోగించుకోవాలని లేదా నేలలో కలియదున్ని భూసారం పెంపొందించుకోవాలని రైతులకు సూచించారు. డబ్బు తిమ్మాయిపల్లి గ్రామంలో ఇప్పటికే వివిధ రకాల ఆరుతడి పంటలు సాగు చేస్తున్న రైతులు ఉండటాన్ని అభినందిస్తూ, ఈ గ్రామాన్ని దివిటిపల్లిగా కొనియాడారు. కార్యక్రమంలో మహిళా రైతులు ఉత్సాహంగా పాల్గొని సాగులో తమ అనుభవాలను పంచుకున్నారు. ఉద్యానవన శాఖ అధికారి మంజువాణి మాట్లాడుతూ యాసంగిలో తక్కువ నీరు, తక్కువ కాలపరిమితితో సాగయ్యే కూరగాయలు, పూల తోటలతో పాటు మిరియాలు, అల్లం, కోకో వంటి పంటలను సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు. వేసవిలో మామిడి, ఆయిల్‌పామ్ తోటలు ఎండిపోకుండా డ్రిప్ పద్ధతిలో నీటి తడులు అందించి సంరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సురకంటి లావణ్య, ఏఈఓ తేజస్విని, హెచ్ఈఓ అనిల్, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్, పంచాయతీ కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.